ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY




శనివారం 06 జూన్ 2026 | Saturday 06 June 2026 | హైదరాబాద్ Hyderabad | ➪ పేజీలు: 12+12 | ➪ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 67 | Vol.No 28 Issue No .67 | www.visionandhra.in





# నీటి ప్రాజెక్టుల పేరుతో బిఆర్ఎస్ కోట్ల దోపిడీ

- కమీషన్లు దండుకుని ఒక్క ఎకరాకు నీరు అందించలే
- కెసిఆర్ హయాంలో ఒక్క ప్రాజెక్ట్ చేపట్టలేదు
- కమీషన్ల కోసం కాళేశ్వరం చేపట్టినా..కూలింది
- ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులో పెండింగే
- పాలమూరు ఎంపిగా ఉన్నా జిల్లాకు కెసిఆర్ చేసింది శూన్యం
- గతంలో ఇబ్బడిముబ్బడి అప్పులతో మళ్లీ అప్పు పుట్టకుండా చేశారు
- జిల్లా ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం
- రెండోరోజు జిల్లాలో పర్యటించిన సిఎం రేవంత్ రెడ్డి

మహబూబ్‌నగర్,జూన్5 : గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ నేతలు వేల కోట్ల కమిషన్లు కొల్లగొట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కమిషన్లు దండుకొని ఒక్క ఎకరానికీ నీరు అందించలేదని ఆగ్రహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి రెండోరోజు పర్యటించారు. బీఆర్ఎస్ హయాంలో కమిషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టులను సందర్శిస్తున్న సీఎం..



రెండోరోజు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. అనంతరం కరివెన రిజర్వాయర్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులూ పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. పంపులు, లిఫ్ట్ పనుల్లో అవినీతిపై మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఏళ్ల తరబడి పోరాడారు. జిల్లా నలుమూలలా తిరిగి ప్రాజెక్టు



పనులను కొలిక్కి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం అని అన్నారు. . మేం పనులు చేపడుతుంటే వాళ్లు రాజకీయ కార్యాచరణ చేపడుతున్నారు. సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి క్షేత్రస్థాయి పర్యటన చేశా. పనులు పరిశీలించి భవిష్యత్‌లో ఎలాంటి చర్యలు చేపట్టాలనేదానిపై నిర్ణయం తీసుకుంటాం అని అన్నారు. అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారని మండిసపడ్డారు. కష్టకాలంలో పాలమూరు నుంచి కేసీఆర్‌ను ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తారని ఆశించాం. కృష్ణా జలాలు పూర్తిగా జిల్లాలో ప్రవహించినా ఎన్నడూ ఒడిసి పట్టుకోలేదు. కేసీఆర్

మిగతా 2లో..

## దేశంలో కొందరు నిరాశావాదులు ఉన్నారు

- అత్మనిర్బర్ భారత్', దేశ దృఢ సంకల్పాన్ని విమర్శిస్తుంటారు
- సూరత్ సభలో రాహుల్‌పై ప్రధాని మోడీ పరోక్ష విమర్శలు



న్యూఢిల్లీ,జూన్5 :దేశంలో కొందరు నిరాశావాదులు ఉన్నారనీ, 'అత్మనిర్భర్ భారత్' ప్రచారాన్ని, దేశ దృఢ సంకల్పన్ని విమర్శించడమే వీళ్లు పనిగా పెట్టుకున్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపైన, కాంగ్రెస్ పార్టీపైనా ప్రధాని

మిగతా 2లో..

## యధాతథంగా ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు

- ద్రవ్యపరపతి విధానం ప్రకటించిన ఆర్‌బిఐ
- రెపోరేటును యథాతథంగా కొనసాగిస్తూ నిర్ణయం
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి



ముంబై,జూన్5 : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం

మిగతా 2లో..

## నిధులు,నియామకాలు, నీళ్లలో వైఫల్యం

- బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం,
- బిజెపి కోసం ప్రజలు ఆశగా చూస్తున్నారు
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



మహబూబాబాద్,జూన్5: తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో రాంచందర్‌రావు పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో నిధులు, నియామకాలు, సాగునీటి వ్యవస్థల్లో వైఫల్యాలు జరిగాయని విమర్శించారు. కాంగ్రెస్

మిగతా 2లో..

## హైదరాబాద్‌లో ఎబోలా కలవరం

### ఇప్పటికే గాంధీలో ఇద్దరికి చికిత్సలు

హైదరాబాద్,జూన్5 : హైదరాబాద్‌లో ఎబోలా అనుమానిత కేసులు కలకలం రేపాయి. ఎబోలా లక్షణాలు ఉన్నట్లు గుర్తించిన ఇద్దరు వ్యక్తులను రాత్రి సమయంలో అపోలో ఆస్పత్రి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో ఎమర్జెన్సీ విభాగంలో వారికి చికిత్స అందిస్తున్నారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్న వైద్య బృందం అవసరమైన పరీక్షలు నిర్వహిస్తోంది. రోగుల ప్రయాణ వివరాలు, వైద్య చరిత్ర, సంప్రదించిన వ్యక్తుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. పరిస్థితిని ఆరోగ్య శాఖ అధికారులు పర్యవేక్షిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే.. కాంగోలో ఎబోలా మహమ్మారి వ్యాప్తిని అంతర్జాతీయంగా ఆందోళన కలిగించే ప్రజారోగ్య అత్యవసర స్థితిగా ప్రపంచ ఆరోగ్య

మిగతా 2లో..

## కాంగ్రెస్ నిర్లక్ష్యంతో ప్రమాదంలో జలహక్కులు

- సిఎం రేవంత్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ



హైదరాబాద్,జూన్5 :కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెలంగాణ జల హక్కులు తీవ్ర ప్రమాదంలో పడ్డాయని మాజీ మంత్రి,బిఆర్ఎస్ సిద్దిపేట

మిగతా 2లో..

## క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణం

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్షలో పొంగులేటి



హైదరాబాద్,జూన్5 : కోట్ల రూపాయిల విలువైన ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. క్యూర్ పరిధిలో ఎల్ఐజీ, ఎంఐజీ వర్గాలకు లక్ష ఇళ్ల నిర్మాణం చేపడతామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు.

మిగతా 2లో..

## ఆసక్తికరంగా తమిళనాడు రాజకీయాలు

- ప్రజలు లక్ష్యంగా రాజకీయ పార్టీని నడిపిస్తా
- బిజెపికి భారం కాకూడదనే బయటకు వచ్చా
- ఒంటరిగా పోటీచేయాలన్న తనవాదనను పట్టించుకోని బిజెపి
- గతంలో రజనీకాంత్ సార్ తనతో కలవమని కోరారు
- మీడియా సమావేశంలో మాజీ బిజెపి నేత అన్నామలై



చెన్నై,జూన్5 :తమిళనాడు రాజకీయాల్లో కొంతకాలంగా ఆసక్తి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇంతకాలం సీఎం విజయ్‌పై ఉన్న దృష్టి.. ఇప్పుడు అన్నామలై వైపు మళ్లింది. ఆయన ఇప్పటికే భాజపాను వీడగా.. తన రాజకీయ భవిష్యత్తు

మిగతా 2లో..

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం

- విశాఖలో సైకిల్ తొక్కిన చంద్రబాబు
- ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సైకిల్ సవారీ
- ఆంధ్రా వర్సిటీలో మొక్కలు నాటిన బాబు



విశాఖపట్నం,జూన్5 : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం నేతలు ఉత్సాహంగా సైకిలెక్కారు. చంద్రబాబు సహా నేతలంతా సైకిల్ తొక్కి పర్యావరణాన్ని ప్రచారం చేశారు. విశాఖలో

మిగతా 2లో..

## తృణమూల్ అధినేత్రికి మరో షాక్

- పార్లమెంట్ ఎంపిల్లోనూ తిరుగుబాటు
- అభిషేక్ బెనర్జీ నాయకత్వాన్ని వ్యతిరేస్తున్న మెజార్టీ ఎంపిలు



కోల్‌కతా,జూన్5 : పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ కు మరిన్ని కష్టాలు తప్పేలా లేవు. పార్టీ రెబల్ గ్రూప్ ఎమ్మెల్యేలతో 23 మంది ఎంపీలు ప్రస్తుతం సంప్రదింపులు సాగిస్తున్నట్టు ఆ పార్టీ వర్గాలు తాజాగా బాంబు పేల్చాయి. దీంతో రాబోయే రోజుల్లా టీఎంసీ పార్లమెంటరీ విభాగం నిట్టనిలువుగా చీలిపోయే

మిగతా 2లో..

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

- ప్రజాప్రతినిధులతో కలసి రామ్మోహన్ సైకిల్ ర్యాలీ

శ్రీకాకుళం,జూన్5 : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరికీ కేంద్ర మంత్రి

మిగతా 2లో..



## సీ-ఫుడ్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానం

- ఏటా 197 లక్షల మెట్రిక్ టన్నుల సీ-ఫుడ్ ఉత్పత్తి
- బ్లూ ఎకానమీ పెరిగితే దేశ ప్రగతికి దోహదపడుతుంది
- సముద్ర ఉత్పత్తులకు కేంద్రం సహకారం ఉండాలి
- నేషనల్ సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ వర్క్‌షాప్‌లో సిఎం చంద్రబాబు

విశాఖపట్టణం,జూన్5 : భారతదేశంలో సీ-ఫుడ్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రతి ఏటా 197 లక్షల మెట్రిక్ టన్నుల సీ-ఫుడ్ ఏపీ నుంచి ఉత్పత్తి అవుతోందని పేర్కొన్నారు. ఏపీలో బ్లూ ఎకానమీ పెరిగితే దేశ ప్రగతికి దోహదపడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. విశాఖలో సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్‌షాప్ ఘనంగా ప్రారంభ మైంది. సీఎం చంద్రబాబు నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను

మిగతా 2లో..




## ధరిత్రి రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- తల్లి పేరుతో ఒక్కొక్కరు ఓ మొక్క నాటాలి
- మూలపాడు పార్క్‌లో మొక్క నాటిని పవన్

మిగతా 2లో..



## తిరుమలలో ఎఐ ఆధారిత సేవలు భేష్

- టిటిడిని అభినందించిన మంత్రి పీయూష్ గోయల్



తిరుమల,జూన్5 : తిరుమలలో భక్తుల సౌకర్యార్థం కృత్రిమ మేధ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న తీరు ప్రశంసనీయమని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అన్నారు. శుక్రవారం ఆయన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించగా, తితిదే ఈవో ఎం.రవిచంద్ర శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఆయన ఆలయం ఎదుట మీడియాతో మాట్లాడుతూ, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)

మిగతా 2లో..

## ధరిత్రి రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

అమరావతి,జూన్ 5 : ధరిత్రి రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. మనం నాటే ప్రతి మొక్క మహావృక్షం కావాలని ఆయన ఆకాంక్షించారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా మూలపాడులోని బటర్‌ఫ్లై పార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తన తల్లి అంజనా దేవి పేరిట ఏపిలపాకిణి మొక్కను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాటడం ద్వారా 2.5 కోట్ల సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వర్షా కాలంలో రాష్ట్రమంతటా సీడ్ బాల్స్ చల్లడానికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసినట్లు చెప్పారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' థీమ్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరిట మొక్క నాటాల్సి ఉందన్నారు. ప్రతి చెట్టు వాతావరణ మార్పులపై రక్షణ కవచంగా నిలవాలని పేర్కొన్నారు. చెట్టు నాటడం ద్వారా రాష్ట్రాన్ని పచ్చగా మార్చి.. వాతావరణ మార్పుల నుంచి భూమిని కాపాడుకుందామని మానవాళికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.

## తిరుమలలో ఏఐ ఆధారిత సేవలు భేష్

ద్వారా వసతి గదుల ఆక్యుపెన్సీ వివరాలు, భక్తుల రాకపోకలు, దర్శన క్యూ లైన్లు, లడ్డూ ప్రసాదాల పంపిణీ వంటి అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ కేంద్రం ద్వారా గదుల లభ్యత, వివిధ కంపా÷ఉం÷మెంట్లలో వేచి ఉన్న భక్తుల సంఖ్య, గంటల వారీగా తిరుమలకు చేరుకుంటున్న భక్తుల వివరాలు, లడ్డూ ప్రసాదాల పంపిణీ సమాచారం తక్షణమే అందుబాటులోకి వస్తోందని తెలిపారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సాంకేతికతను ప్రోత్సహిస్తూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ ప్రాజెక్టుకు సహకరించిన ప్రవాస భారతీయ భక్తులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, కేవలం 100 రోజుల్లోపే ఏఐ ఆధారిత వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చిన టిటిడి అధికారులను అభినందించారు. అంతకుముందు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుమలలో తన తల్లి పేరిట మొక్క నాటారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీ కృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం అధికారులు పాల్గొన్నారు.

## క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణం

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు ఇంటి స్థలంలో యాజమాన్య హక్కులు కల్పిస్తున్నామన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 3.50 లక్షల ఇళ్లకు పరిపాలనా అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు. క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు నిర్మిస్తామని వివరించారు. ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విధానంపై ఈ సందర్భంగా మంత్రి విమర్శించారు. పేదల సంక్షేమం కోసం విలువైన ప్రభుత్వ భూముల వినియోగిస్తామని చెప్పారు. కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. పేదలకు గౌరవప్రదమైన జీవితమే లక్ష్యంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

## తృణమూల్ అధినేత్రికి మరో షాక్

అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో ఇప్పటికే రెబల్ ఎమ్మెల్యేలు పట్టు సాధించారు. పార్టీ బహిష్కృత నేత రితబ్రత బెనర్జీని అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా 57 మంది టీఎంసీ ఎమ్మెల్యేలు ఇటీవల ఎన్నుకున్నారు. ఆ ఎన్నికను స్పీకర్ రతీంద్ర బోస్ కూడా గుర్తించారు. తిరుగుబాటు ఎమ్మెల్యేలు మమతా బెనర్జీని గౌరవిస్తున్నామని చెబుతూనే, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ నాయకత్వాన్ని మాత్రం ఒప్పుకునేది లేదని కరాఖండిగా చెబుతున్నారు. తాజాగా టీఎంసీ ఎంపీల్లోనూ అసంతృప్తి పెల్లుబుకుతోంది. అభిషేక్ బెనర్జీ వల్ల పలువురు అసంతృప్తితో ఉన్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్లమెంటరీ ప్రత్యేక కూటమిగా ఏర్పాటయ్యేందుకు వీరు చర్చలు జరుపుతున్నారని, 12 మందికి పైగా ఎంపీలు ఇందుకు సుముఖంగా ఉన్నారని అంటున్నారు. టీఎంసీ పార్లమెంటరీ ప్రత్యేక కూటమిగా ఏర్పడేందుకు, చీలిక తెచ్చేందుకు తగిన సంఖ్యాబలంపై కూడా చర్చ జరుగుతోందని చెబుతున్నారు. టీఎంసీకి లోక్‌సభలో ప్రస్తుతం 29 మంది ఎంపీలు ఉన్నారు. ప్రత్యేక గ్రూపుగా ఏర్పడి ఫిరాయింపుల చట్టం నుంచి వేటుపడకుండా ఉండాలంటే కనీసం 23 మంది మద్దతు ఇందుకు అవసరమవుతుంది. రాజ్యసభ పరంగా చూస్తే టీఎంసీకి 13 మంది ఎంపీలున్నారు. ప్రత్యేక గ్రూపుగా గుర్తింపు పొందాలంటే కనీసం 9 మంది ఎంపీలు కలిసిరావాలి. ఈ పరిణామాలపై రెబల్ నేత రీతాబ్రత బెనర్జీని ప్రశ్నించగా, గత వారం రోజుల్లో తాను ఏ ఎంపీతోనూ మాట్లాడలేదని, అందువల్ల వాళ్లు ఏమి చేయాలనుకుంటున్నారో తనకు తెలియదని చెప్పారు. అయితే రేపటిరోజు ఏమి జరుగుతుందో ఎవరూ చెప్పలేరని అన్నారు. దీనిపై వెటరన్ రాజ్యసభ ఎంపీ సుఖేందర్ శేఖర్ రాయ్ మాట్లాడుతూ, ఇంత తక్కువ సమయంలో 60 మంది ఎమ్మెల్యేలు వెళ్లిపోవడం ఎప్పుడూ చూడలేదని, అదే స్పందన లోక్‌సభలోనూ ఉండే అవకాశాలు లేకపోలేదని అన్నారు.

## దేశంలో కొందరు నిరాశావాదులు ఉన్నారు

నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. ఇతర దేశాలపై ఆధారపడం వల్ల ఏ దేశం తాను నిజంగా సాధించాల్సిన అభివృద్ధిని అందుకోలేదన్న విషయాన్ని వీరు విస్మరిస్తున్నారని విమర్శించారు. గుజరాత్‌లోని సూరత్‌లో శుక్రవారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అలజడులు, అస్థిరతను వ్యాప్తి చేయడం ద్వారా అవకాశాలు పొందాలని కోరుకుంటోందని, అయితే దేశ ప్రజలకు వీరి పన్నాగాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వస్తున్నారని ప్రధాని అన్నారు. 'గుజరాత్ ప్రజలు కాంగ్రెస్ పార్టీని అడ్రెస్ లేకుండా చేసారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న చోట్ల కూడా వారి అవకతవకల పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల హిమాచల్ ప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే ఇందుకు ఉదాహరణ. అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ ఆ పార్టీ దారుణమైన ఓటమి చవిచూసింది. కాంగ్రెస్ అవకతవకల పాలనను హిమాచల్ ప్రజలు తిప్పికొట్టారు. దీనికి ముందు హర్యానాలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. పంజాబ్ ప్రజలు కూడా ఆ పార్టీకి స్పష్టమైన సందేశం ఇచ్చారు. అల్లకల్లోలంలో అవకాశాలు వెతుక్కోవడం అనే కాంగ్రెస్ రాజకీయం ఎప్పటికీ పనిచేయదు' అని మోదీ అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, అందుకే ముఖ్యమంత్రిని కూడా మార్చాల్సి వచ్చిందని ఇటీవల అక్కడ జరిగిన పరిణామలపై మోదీ వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు తమ కలలు, ఆకాంక్షలను కార్యరూపంలోకి రావాలనే పట్టుదలతో ఉన్నారని, దేశ ప్రజల సమష్టి సంకల్పంతో ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఇటీవల కాలంలో అనేక సంక్షోభాలను ప్రపంచం ఎదుర్కొందని, తొలుత కోవిడ్ సంక్షోభం, ఆ తర్వాత ఇంధన సంక్షోభం కుదిపేసిందని అన్నారు. పెట్రోల్ ధరల్లో నిలకడ లేకపోవడం, సప్లయ్ చైన్స్ కుప్పకూలడం వంటివి చోటచేసుకున్నాయని, అయితే ప్రతి సంక్షోభాన్ని 140 కోట్ల మంది ప్రజలు సమష్టిగా ఎదుర్కోవడం తనకెంతో తృప్తినిచ్చిందని అన్నారు. గుజరాత్ పర్యటనలో భాగంగా సూరత్‌లో రూ.18,800 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు.

## హైదరాబాద్‌లో ఎబోలా కలవరం

సంస్థ ప్రకటించింది. ఈ మహమ్మారి వ్యాప్తిని ఎదుర్కోవడం చాలా కష్టం. ఎందుకంటే, ఇది అత్యంత అరుదైన వైరస్ రకానికి చెందినది. దీనికి ఎలాంటి టీకా లేదు. డీఆర్ కాంగోలో అంతర్గత సంఘర్షణలు నెలకొన్న ప్రాంతంలో ఈ కేసులు నమోదవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ మహమ్మారి వ్యాప్తి ఊహించినదానికంటే వేగంగా ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేస్తోంది.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

రామ్మోహన్ నాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరి జీవితంలో ముఖ్యమైనది పర్యావరణ మన్నారు. పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి సైకిల్ ర్యాలీలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ... పర్యావరణ ప్రభావం మనం పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం మీద ఉంటుందన్నారు. చిన్న వయసు నుంచే పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలని తెలిపారు. ప్రధాని మోదీ గత 12 సంవత్సరాలుగా స్వచ్ఛభారత్ కార్యక్రమం చేస్తున్నారని కేంద్ర మంత్రి అన్నారు. ప్రధానిని ఆదర్శంగా తీసుకొని దేశ వ్యాప్తంగా స్వచ్ఛభారత్ కొనసాగుతోందన్నారు. మోదీ చేపట్టిన స్వచ్ఛభారత్‌ను ఆదర్శంగా తీసుకుని సీఎం చంద్రబాబు స్వచ్ఛఆంధ్రా కార్యక్రమం చేపట్టారని చెప్పారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని పిల్లలకు కూడా అలవాటు చేయాలన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఈరోజు 15 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. కాలుష్య నివారణ, ఇంధన పొదుపు చర్యల్లో భాగంగానే సీఎం చంద్రబాబు సైకిల్ తొక్కాలని పిలుపునిచ్చారని రామ్మోహన్ తెలిపారు. దీనికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. ఇటీవల 24 లక్షల మంది హైబ్రిడ్ విధానంలో పాల్గొని మహానాడు విజయవంతం చేయడం ఇంధన పొదుపు చర్యలకు ఒక అద్భుతమైన మోడల్ అని చెప్పుకొచ్చారు. ఎ÷-లాస్టిక్ రహిత ఆంధ్రాగా మారుద్దామన్నారు. ప్లాస్టిక్ మహమ్మారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో 59 పాఠశాలలను నెట్ జీరో స్కూల్స్‌గా తీర్చిదిద్ది.. విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ పెంపొందించామన్నారు. శ్రీకాకుళం పట్టణంలో రూ.కోటి వ్యయంతో ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ బోర్డును కేంద్రమంత్రి ఆవిష్కరించారు. ప్రకృతి పరిరక్షణకు ప్రజలందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సైకిల్ తొక్కడమనేది ఇంధన పొదుపు మాత్రమే కాదన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే సైకిల్ తొక్కాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# నీటి ప్రాజెక్టుల పేరుతో బిఆర్ఎస్ కోట్ల దోపిడీ

సీఎం అయ్యాక పాలమూరు ప్రాజెక్టులు పూర్తిచేస్తారనుకున్నాం. ప్రాజెక్టుల గురించి ప్రశ్నిస్తే అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారని ఎద్దేవా చేశారు. పాలమూరు-రంగారెడ్డి పూర్తయితే 26 లక్షల ఎకరాలకు ఆయకట్టు వచ్చేది. రూ.27వేల కోట్లు ఖర్చు చేసి పంపులు, లిఫ్ట్ పనులు పూర్తిచేశారు. ఈ పనులతో కేసీఆర్ ఇంట్లో కనకవర్షం కురిసింది. కమిషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదు. జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. కానీ.. ప్రాజెక్టులు పూర్తయినట్లు కేసీఆర్ ఎలా భావించారని అన్నారు. మేం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుల కోసం రూ.22వేల కోట్లు ఖర్చు చేశాం. వీటిలో రూ.8 వేల కోట్లు ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఇచ్చాం. ఈ జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కావాలంటే 4వేల ఎకరాల భూసేకరణ చేయాలి. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ చేయకుండా రిజర్వాయర్లలో నీళ్లు నింపగలమా?రెండేళ్లలో పనులు పూర్తిచేయాలని కంకణం కట్టుకుని ముందుకెళ్తున్నాం. గతంలో విపరీతంగా అప్పులు తేవడం వల్ల ఇప్పుడు ప్రాజెక్టులకు అప్పులు తెచ్చుకోలేని పరిస్థితి వచ్చింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.55వేల కోట్ల అంచనా వేసి రూ.27వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 50 శాతం నిధులూ ఖర్చు పెట్టకుండా 90 శాతం పనులెలా పూర్తవుతాయి? ఉన్నదంతా దోచుకుని మమ్మల్ని దోషులుగా నిలబెడదామనే భ్రమల్లో ఉన్నారు. నాపై కోపంతో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ తొక్కిపెట్టారని రేవంత్ రెడ్డి అన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం. భూసేకరణకు రూపాయి ఎక్కువైనా ఇచ్చి సమస్యలు పరిష్కరిస్తాం. జిల్లాలో ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణంగా కట్టుబడి ఉన్నాను. తక్కువ భూసేకరణతో ఎక్కువ నీళ్లు నిల్వ చేసుకునే ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేస్తాం. కర్ణాటకతో సమన్వయం చేసుకుని ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. బ్రిడ్జ్ కమ్ బ్యారేజీల కోసం అధ్యయనం చేస్తున్నాం. పనులకు అడ్డుపడకుండా ఉండాలని బీఆర్ఎస్ నేతలను కోరుతున్నా. ఆ పార్టీ నేతల వ్యాఖ్యలకు పైసా విలువ లేదు. కేసీఆర్ రద్దయిన వెయ్యి రూపాయల లాంటివారు. బీఆర్ఎస్ పార్టీకి, నేతలకు గతమే ఉంది.. భవిష్యత్తు లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ప్రాజెక్టయినా మొదలుపెట్టి పూర్తి చేసిందా చెప్పాలి. ప్రాణహిత-చేవెళ్ల పేరు, ఊరు మార్చి దోపిడీ చేయడమే కేసీఆర్‌కు తెలుసు. ఆయన సొంతంగా మొదలుపెట్టిన ప్రాజెక్టు ఒక్కటీ రాష్ట్రంలో లేదు. కాళేశ్వరం కూలిన తర్వాత చుక్క నీళ్లు తీసుకోకుండా ఎక్కువ వరి ఉత్పత్తి చేశాంఅని రేవంత్ అన్నారు. జిల్లాకు కారు పార్టీ అధినేత తీరని అన్యాయం చేశారని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. నీటి ప్రాజెక్టులపై బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారం చేస్తోందని.. వారి పాలనలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేశారని రేవంత్ పేర్కొన్నారు. ఒక్క కాళేశ్వరంపైనే రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టారని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును తీవ్ర నిర్లక్ష్యం చేశారన్నారు. అది పూర్తి చేసి ఉంటే 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చే అవకాశం ఉండేదన్నారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.27 వేల కోట్లు ఖర్చు చేశారని.. వేల కోట్లు పెట్టి కేవలం పంపులు, లిఫ్టులు మాత్రమే నిర్మించారని సీఎం రేవంత్ మండిపడ్డారు.నీటి పారుదల శాఖలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు ఇప్పటికీ నగదు చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. గత 30 నెలల్లో రూ.52 వేల కోట్లకు పైగా అసలు, వడ్డీ చెల్లించినట్లు ఆయన పేర్కొన్నారు.తమ ప్రభుత్వంలో ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రతి 6 నెలలకోసారి ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకెళ్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ పర్యటనలో సిఎం వెంట మంత్రులుఉ ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తదితరులు ఉన్నారు.

# ఆసక్తికరంగా తమిళనాడు రాజకీయాలు

గురించి తాజాగా మీడియాతో మాట్లాడారు. బిజెపికి రాజీనామా చేసిన మాజీ ఐపీఎస్ అధికారి అన్నామలై కొత్త పార్టీ పెట్టబోతున్నట్లు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. కొత్త రాజకీయ ఉద్యమం చేయబోతున్నట్లు అన్నామలై తెలిపారు. భారతీయుడిగా, తమిళుడిగా గర్విస్తున్నానని, తన ఆలోచనలకు అనుగుణంగా ముందుకెళ్తానని స్పష్టం చేశారు. తమిళనాడు అభివృద్ధే తన ప్రథమ ప్రాధాన్యమన్నారు. అన్నామలై శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మార్పు కోసమే బీజేపీలో చేరానన్నారు. రాజీనామా ఆమోదించిన బీజేపీ హైకమాండ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని అన్నారు. 'తమిళనాడులో బీజేపీ ఒంటిరిగా పోటీ చేయాలని ఆశించా. 18 నెలలుగా బీజేపీతో విభేదాలు ఉన్నాయి. బీజేపీకి నేను భారంగా ఉండాలనుకోవడం లేదు. అందుకే బీజేపీకి రాజీనామా చేశా. 2025 డిసెంబర్ నెలలోనే అధిష్ఠానానికి రాజీనామా గురించి చెప్పా. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యే వరకు పార్టీలో ఉన్నా'అని అన్నారు. 'ఈ సమయంలో తమిళనాడుకు కొత్త పార్టీ అవసరమా అని అడిగితే.. కచ్చితంగా అవసరమే అని అన్నామలై అన్నారు. ఓ షాపునకు వెళ్లి టూత్‌పేస్టో.. బియ్యమో.. కందిపప్పో కొంటున్నపుడు పది షాపులు తిరుగుతాము. రేటు, నాణ్యత చెక్ చేసి కొంటాం. ఎందుకంటే అవి మన శరీరంలోకి పోయేవి. ఇప్పుడు ఎన్ని పార్టీలు ఉన్నా కూడా పార్టీ నాయకుడు ఎలాంటి వాడో ప్రజలు చూస్తారు. పక్కంటి వాళ్లను చూసినట్లే ప్రజలు మమ్మల్ని చూడబోతున్నారు. దూరం నుంచి ప్రజలకు అభివాదం చేసే రాజకీయాలకు మేము దూరం. కల్ట్ పాలిటిక్స్ నుంచి బయటకు రావాలి. రాజకీయాలను మారుస్తాం అంటున్నారు.. మళ్లీ అదే కల్ట్ పాలిటిక్స్ చేస్తున్నారు. కామన్ మ్యాన్ పాలిటిక్స్ ముందుకు తీసుకురావాలనుకుంటున్నా. కేవలం ముఖ్యమంత్రి కారణంగా మార్పు సాధ్యం కాదు. సర్పంచ్ దగ్గరి నుంచి ముఖ్యమంత్రి వరకు అందరూ నిబద్ధత కలిగిన వాళ్లు ఉంటేనే మార్పు సాధ్యం అవుతుందని అన్నామలై అన్నారు. ఈసందర్భంగా ప్రముఖ నటుడు రజనీకాంత్ ప్రస్తావన తెచ్చారు. తనతో చేతులు కలపమని గతంలో సూపర్‌స్టార్ అడిగారన్నారు. 2024లో తాను భాజపాలో చేరడానికి ఒకరోజు ముందు రజనీకాంత్ నాకు ఫోన్ చేశారు. ఆయన నేతృత్వం వహిస్తున్న రాజకీయ ఉద్యమంలోకి రావాలని ఆహ్వానించారు. కానీ, నేను అప్పటికే భాజపా సీనియర్ నేత బీఎల్ సంతోష్‌కు మాటిచ్చా. అందుకే రజనీ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించా. నేను రాజకీయాల్లోకి రావడానికి కారణం బీఎల్ సంతోష్ ఇచ్చిన హామీనే. నా రాజకీయ ప్రవేశంపై ఉన్న ఊహాగానాలకు ముగింపు పలికేందుకు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాను. అయితే తమిళనాడు విషయంలో నా అభిప్రాయాలు.. భాజపా నాయకత్వం అభిప్రాయాలతో సరిపోలలేదు. ఈ విభేదాలను పరిష్కరించు కునేందుకు పార్టీ అగ్రనాయకత్వంతో 18 నెలలుగా ఎన్నో చర్చలు జరిపాను. ఇంక భాజపాకు భారంగా ఉండకూడదని అనుకున్నాను' అని అన్నామలై వివరించారు. ఇకపై స్వతంత్ర రాజకీయ మార్గంలో ముందుకువెళ్తానని, తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త బాటలు వేసేందుకు పోరాడతానని తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లోనే నా రాజీనామా గురించి చెప్పాను. అయితే పార్టీ పెద్దలు నన్ను ఆపారు. ఎన్నికల బాధ్యతలు నిర్వహించమని సూచించారు. ఇప్పుడు నా రాజకీయాలు సామాన్యుడి లక్ష్యంగా ఉంటాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సొంతంగా పోటీ చేస్తాను. అప్పటివరకు అందరినీ ఏకతాటిపైకి తీసుకుని వచ్చేందుకు ప్రయత్నిస్తాను. అలాగే అన్నామలై మక్కల్ ఇయక్కమ్ పేరిట రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించారు. దానికి భారీ స్పందన వస్తోందని చెప్పారు. ఇదిలావుంటే అన్నామలై వెళ్లిపోవడం వల్ల పార్టీకి ఎలాంటి నష్టం లేదని భాజపా తమిళనాడు చీఫ్ నైనార్ నాగేంద్రన్ వెల్లడించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు.

# సీ-ఫుడ్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానం

ప్రారంభించారు. రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆక్వా ఉత్పత్తుల నాణ్యతను పెంచుతామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. దేశంలోని మత్స్యసంపదలో 28 శాతం ఏపీ నుంచే వస్తోందని చెప్పారు. విశాఖపట్నంలో 'నేషనల్ సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్'పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. సముద్ర ఉత్పత్తుల ఎగుమతులను పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. పదేళ్లలో 5 శాతం నుంచి 70 శాతం పెరుగుదల కనిపించింది. తక్కువ వ్యవధిలో ఎక్కువ ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి వెళ్లాం. ఆక్వా ఉత్పత్తుల ఎగుమతిలో దేశంలో ఏపీదే అగ్రస్థానం. రొయ్యల ఉత్పత్తిలో 66 శాతం, సీఫుడ్ ఆదాయంలో 38 శాతం మన రాష్ట్రం నుంచే వస్తోంది. రాష్ట్రంలో ఆక్వా ఉత్పత్తులు పెరిగేందుకు కేంద్రం అండగా నిలబడాలి. రొయ్యల ఉత్పత్తి మరింత పెరిగేందుకు ఏపీ అన్నివిధాలా అనుకూలం. విశాఖపట్నం, భీమవరం, కాకినాడ, నెల్లూరు, కృష్ణపట్నం ప్రాంతాలు ఆక్వా ఉత్పత్తి కేంద్రాలుగా ఉన్నాయి. రైతులు పొలాల్లో తీసిన కుంటలు కూడా సంపద సృష్టిస్తున్నాయి. రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలకు ఎప్పుడూ డోర్లు తెరిచే ఉంటాయి. వారు ఎప్పుడైనా నన్ను కలవొచ్చు.. ఫోన్ చేసి రావొచ్చని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా కాకినాడ పోర్టును ఆధునికీకరణ చేస్తామని కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రకటించడంపై ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర మత్స్యశాఖ ప్రాంతీయ కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని 15 రోజుల్లో ఇస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. 'భారతదేశంలో మొత్తం చేపల ఉత్పత్తిలో ఏపీ వాటా 28 శాతంగా, రొయ్యల ఉత్పత్తిలో 66 శాతంగా ఉంది. దేశ సముద్రపు ఆహార ఎగుమతుల్లో ఏపీ నుంచే కేంద్రానికి దాదాపు 38 శాతం ఆదాయం వస్తోంది. సంవత్సరానికి రూ.28,000 కోట్లకు పైగా సీ-ఫుడ్ ఎగుమతులు ఏపీ నుంచే జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందితే భారతదేశ సముద్ర ఆహార ఎగుమతులూ అభివృద్ధి చెందుతాయి. ఆక్వా రంగంలో ఏపీ ఆవిష్కరణలు చేస్తే భారతదేశ బ్లూ ఎకానమీ నిస్సందేహంగా ముందుకు సాగుతుంది. ప్రపంచవ్యాప్తంగా జరిగే సీ-ఫుడ్ బిజినెస్‌లో భారత్ వాటా కేవలం 5 శాతం మాత్రమే. ఈ రంగంలో దేశానికి పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయి. బ్లూ ఎకానమీ ద్వారా ఆర్థిక వృద్ధి సాధ్యం. నీరు ఉన్న చోట నాగరికతలు విలసిల్లుతాయి. ఏపీలో గోదావరి, కృష్ణ వంటి జీవనదులు ఉన్నాయి. భవిష్యత్ అంతా బ్లూ ఎకానమీదే' అని పేర్కొన్నారు. ÷ూగా, ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, చిరాగ్ పాశ్వాన్, రాజీవ్ రంజన్ సింగ్, మంత్రులు అచ్చెన్నాయుడు, డోలా బాల వీరాంజనేయస్వామి, ఎంపీ బీద మస్తాన్ రావు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నిర్లక్ష్యంతో ప్రమాదంలో జలహక్కులు

ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. ఎత్తిపోతల పంపుల నిర్వహణ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. దీంతో పంపులు దెబ్బతిని, కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం చోటుచేసుకుందని తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ జల హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఆరోపించారు. కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయిందన్నారు.

ఆంధ్రప్రదేశ్ 74 శాతం వినియోగిస్తుంటే.. తెలంగాణ 25 శాతానికి పరిమితమైందని లేఖలో తెలిపారు. రైతులు, తాగునీటి అవసరాలు, పరిశ్రమల భవిష్యత్తును కాంగ్రెస్ ప్రమాదంలో పడేసిందని మాజీ మంత్రి విమర్శించారు. సోలార్ ఆధారిత విద్యుత్ విధానాలు సాగునీటి రంగానికి ముప్పుగా మారాయని లేఖలో స్పష్టం చేశారు. అందుకే రైతు డిస్కం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణకు తగిన నిధులు కేటాయించాలని అన్నారు. తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయకుండా జల హక్కులను సమర్థంగా కాపాడాలని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

### నిధులు,నియామకాలు, నీళ్లలో వైఫల్యం

ప్రభుత్వం.. అవినీతి, నిర్లక్ష్యంతో పాలన సాగిస్తోందని వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీ హామీ పూర్తిగా అమలు కాలేదని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి 'డబుల్ ఇంజిన్ సర్కార్' అవసరమని వెల్లడించారు. 2014 తర్వాత దేశంలో సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో ముందుకు సాగుతోందని రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ కార్యకర్తలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతికతతో పాటు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగించాలన్నారు. శిక్షణా తరగతుల్లో చర్చించిన 12 అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీజేపీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయాలని నేతలకు రాంచందర్‌రావు సూచించారు.

# యధాతథంగా ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు

వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. ఇంతకుముందు ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో జరిగిన ద్రవ్య పరపతి సమీక్షల్లోనూ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను మార్చకుండా ఇలాగే ఉంచింది. అంతర్జాతీయ మార్కెట్లో అస్థిరత, పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతున్న తరుణంలో దేశీయ ఆర్థిక వ్యవస్థను సురక్షితంగా ఉంచేందుకే ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించింది. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తు న్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం.ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన సమీక్షల్లోనూ ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. సవాళ్ల నడుమ ప్రపంచ ఆర్థికవ్యవస్థ అనిశ్చితిలో కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మనకు ఎదురయ్యే ఆటుపోట్లను తక్కువ నష్టంతో తట్టుకోగలమని విశ్వాసంతో ఉన్నాం. ఇంధన ధరలు అధికంగా ఉండటంతో వృద్ధి నెమ్మదించింది. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. దీనికి తోడు ఈ ఏడాది వర్షపాతం సాధారణం కన్నా తక్కువ ఉండటం కూడా ప్రభావం చూపించనుంది. అయితే, ఆహార నిల్వలు సరిపడా ఉండటం ఊరటనిచ్చే అంశం. అంతర్జాతీయంగా బలహీన డిమాండ్, రవాణా ఖర్చులు పెరగడం వంటివి ఎగుమతులకు సవాల్‌గా మారాయి. అయితే, దేశీయ ఆర్థిక కార్యకలాపాలు మాత్రం చాలావరకు స్థిరంగా ఉన్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 6.9శాతం నుంచి 6.6శాతానికి తగ్గిస్తున్నాం. రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను కూడా 4.6 శాతం నుంచి 5.1శాతానికి పెంచుతున్నాం. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లకు నిబంధనలను సరళీకరించాం. ఈక్విటీ మార్కెట్‌లో ఎన్ఆర్ఐలు, ఓవర్సీస్ సిటిజన్స్ పెట్టుబడుల పరిమితిని పెంచాం. ఎక్స్ఛేంజ్ రేట్‌పై ఆర్‌బీఐ విధానాల్లో ఎలాంటి మార్పు లేదు. మన దేశీయ కరెన్సీ రూపాయికి నిర్దిష్టమైన రేటును నిర్ణయించాలనుకోవడం లేదు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఆర్థికంగా ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు ఆర్‌బీఐ సిద్ధంగా, అప్రమత్తంగా ఉంది.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. ఐదున్నర కిలో మీటర్ల దూరాన్ని 21 నిమిషాల 18 సెకండ్లలో చేరుకున్నారు. విశాఖ ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సీఎం సైకిల్ సవారీ చేశారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, పోలమాంబ గుడి, వాల్తేరు, బీచ్ రోడ్ మీదుగా నోవాటెల్‌కు ముఖ్యమంత్రి చేరుకున్నారు. ఎర్రటి ఎండ కాస్తున్నా ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. సైకిల్ తొక్కుతూ ప్రజలకు అభివాదం చేసుకుంటూ సీఎం సైకిల్ ప్రయాణం సాగింది. సైకిల్ ర్యాలీలో సీఎం చంద్రబాబు వెంట జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు ఉన్నారు. శ్రీకాకుళంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, విజయవాడలో హోంమంత్రి అనిత కూడా సైకిలెక్కారు. విశాఖ ఏయూ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ మొక్కని నాటారు. తిరుమలలో గ్రీనరీ త్వరలో 90 శాతానికి చేరుకోబోతోందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. విశాఖ ఏయూలో మాత్రం కేవలం 25 శాతం మాత్రమే గ్రీనరీ ఉందని.. గ్రీనరీ పెంచేలా చర్యలు తీసుకోవాలని ఏయూ వీసీకి ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. మొక్కలు బాగా పెంచిన వాళ్లకే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లంటూ చంద్రబాబు సరదా వ్యాఖ్యానించారు. ఆంధ్రా యూనివర్సిటీని ఆదర్శంగా తయారు చేయాలని అన్నారు. చరిత్ర గల యూనివర్సిటీ.. ఎంతోమంది నాయకులు, విద్యావేత్తలు, ప్రముఖులను అందించిందని తెలిపారు. నెట్ జీరో కాన్సెప్ట్‌ను ఏయూలో ప్రవేశపెడుతున్నట్లు సీఎం చెప్పారు. వాతావరణ మార్పులపై అందరూ దృష్టి సారించాలన్నారు. యూనివర్సిటీకి కావాల్సిన 100శాతం విద్యుత్ ఇక్కడి నుంచే ఉత్పత్తి చేయాలన్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో చెట్లను పెంచాలన్నారు. పిల్లలకు ఎక్స్‌పీరియన్స్ సెంటర్లుగా యూనివర్సిటీలను మార్చాలన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో కమిటీ ఆఫ్ ప్రొఫెసర్స్‌ను పెట్టి ఇన్‌హౌస్ నాలెడ్జ్‌ని అభివృద్ధి చేయాలని అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ అన్ని ఇతర కాలేజీలను గైడ్ చేయాలన్నారు. యూనివర్సిటీ అభివృద్ధికి బ్లూ ప్రింట్ తయారుచేస్తామని తెలిపారు. యాక్షన్ ఎ÷-లాన్‌లో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. లెక్చరర్స్, స్టూడెంట్స్ అందరూ ఇందులో భాగస్వామ్యం కావాలన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా తాను కూడా సైకిల్ మీద వెళ్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఫొటోల కోసం కాదని.. ఒక అలవాటు కావాలనే ఉద్దేశంతోనే సైకిల్‌పై వెళ్తున్నట్లు తెలిపారు. సైకిల్ తొక్కడం వలన ఎక్సర్సైజ్, ఫిట్నెస్ రెండూ అవుతాయన్నారు. ఏపీలో 33శాతం గ్రీన్ కవర్ ఉందని.. దీన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యమన్నారు. నెట్ జీరో తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా మని.. దీన్ని ఒక ఆదర్శంగా చేస్తామని సీఎం అన్నారు. నెట్ జీరో కార్యక్రమంలో భాగంగా సైకిల్‌పై నోవాటెల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వెళ్లారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# ఏటేటా పెరుగుతున్న పర్యావరణ విధ్వంసం!

ఏటా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నా..మన వాతావరణంలో మార్పులు రావడం లేదు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏటా జూన్ 5న మొక్కలు నాటడం, ఫోటలకు పోజులు ఇవ్వడం, సైకిల్ తొక్కడం వంటివన్నీ చేస్తున్న పాలకులు చిత్తశుద్ధితో పర్యావరణ పరిరక్షణ చర్యలకు పూనుకోవడం లేదు. పర్యావరణ విధ్వంసాన్ని ఆపేందుకు ఉపక్రమిచకపోవడం వల్ల ఎల్నినో లాంటి సమస్యలు ఉత్పాతంలా వచ్చి పడుతున్నాయి. ఈ యేడు కూడా నైరుతి ఆలస్యంగా ప్రవేశించింది. ఇంకా ఎండల తీవ్రత కొనసాగుతోంది. ఒకప్పుడు జూన్ మాసం వచ్చే వరకు జోరు వర్షాలు పడేవి. కానీ ఆ పరిస్థితి ఇప్పుడు ఎక్కడా కానరావడం లేదు. పెరుగుతన్న జనాభే పర్యావరణ విధ్వంసానికి మొదటి చేటుగా గుర్తిచాలి. పెరిగిన జనాభా తమ అవసరాల కోసం పర్యవరణ విధ్వంసానికి పాల్పడుతోంది. దీనికి పాలకులే బాధ్యత వహించాలి. ఊరూరా చెరువులను మింగేస్తున్నారు. ఇసుకను,మట్టిని తోడస్తున్నారు. చెట్లను ఎడాపెడా నరికేస్తున్నారు. అడవులను ధ్వంసం చేస్తున్నారు. కొండలను ఆనవాళ్లు లేకుండా చేసేస్తున్నారు. నదీ, సముద్ర జలాలను కలుషితం చేస్తున్నారు.

నాలాలను ఆక్రమిస్తున్నారు. ఇవన్నీ కూడా పర్యావరణ విధ్వంసానికి పరాకాష్ఠగా చూడాలి. పర్యావరణం అంటే భూమి, నీరు, గాలి, చెట్లు, జీవ జంతు జాతుల రూపంలో మన చుట్టూ ఉన్నది ప్రకృతి అని అర్థం చేసుకోలేక పోతున్నాం. అడవుల విధ్వంసం వల్ల చిరుతలు, పెద్దపులుల జానావాసాల్లోకి వచ్చి పడుతున్నాయి. పంచభూతాలను రక్షించుకోవడం అన్నది మానవ మనుగడకు, అభివృద్ధికి అత్యంత ఆవశ్యకం. మన చుట్టూ ఉన్న బాహ్య పర్యావరణం, రెండవది అంతర్గత పర్యావరణం. ఈ రెండింటినీ కూడా భగవంతుడే సృష్టించాడు. ఈ రెండింటి మధ్య సంబంధం ఉంది. దానిని మనం అర్థం చేసుకోవడం లేదు. పర్యావరణంలో జీవనానికి హాని కలిగించే భౌతిక, రసాయనిక, జీవ సంబంధమైన పదార్థాలు అవసరానికి మించిన పరిమాణంలో పోగయ్యాయి. దీనివల్ల ప్రతీ చోట వీటి సాంద్రత పెరిగి, పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడి కాలుష్యం సంభవిస్తోంది. అందుకే నేడు ఈ పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది, దీనికి కారణం కాలుష్యం. హోలీ, దీపావళి, శరత్ పూర్ణిమ, వైశాఖి, మకర సంక్రాంతి, జన్మాష్టమి,రామ నవమి వంటి పర్వదినాలు ఆయా ఋతువులను అనుసరించి ప్రకృతి గొప్పతనాన్ని, సౌందర్యాన్ని మనకు తెలియ చేస్తున్నాయి. భారతీయ మహర్షులు యావత్ ప్రకృతిని, ప్రాకృతిక శక్తులను దైవ స్వరూపాలుగా ఆరాధించారు. సౌరశక్తిని సూర్యదేవునిగా కొలిచారు. భారతీయ సంస్కృతిలో జలాన్ని కూడా దేవీ స్వరూపం గా భావించారు.

నదులను జీవనదాయిని అయిన మాతలుగా భావించారు. అందుచేతనే ప్రాచీన సంస్కృతి నదీ తీరాల వెంబడి ఉద్భవించి ముందుకు కొనసాగింది. భారతీయ సంస్కృతిలో అరటి, రావి, మర్రి, తులసి, మామిడి మొదలైన చెట్లను పూజిస్తారు. వీటిని రక్షించుకోవడం కోసమే వీటిని పూజించేవారు. చెట్టు జాతులను ఇలా పూజించి రక్షించుకోవడం మన సంస్కృతికి మూలాధారం. పర్యావరణం అంటే మనల్నీ, మనపరిసరాలనూ, చెట్టూ,పుట్టా, గాలీ, నీరు, కొండాకోనా, వాగూవంకా,పిట్టాపిచికా, అన్నిటినీ రక్షించుకోవడం అన్న అర్థంలో చెప్పారు. అయితే కాలక్రమేణా మనమే మన పరిసరాలను దెబ్బతీసు కుంటూ వస్తున్నారు. ఏది చేసినా ఆలోచన చేయడం లేదు. పాలకుల విధ్వంసకర విధానాలవల్ల భారతదేశంలో పర్యావరణం దెబ్బతింటోందనడంలో సందేహం లేదు. పర్యావరణ పరిరక్షణలో కఠిన చట్టాలు ఉండాల్సిందే. వాటిని అమలు చేయాల్సిందే. కానీ అలా జరగడం లేదు. జూన్ 5న విశ్వవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటారు. దీన్ని పురస్కరించుకొని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పర్యావరణ కార్యక్రమాలు నిర్వహిస్తూ జాగృతపరిచే ప్రయత్నాలు చేస్తుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి 1972లో ప్రారంభించింది. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రపంచ సమ్మేళనం ఒకటి నిర్వహించింది. అన్ని దేశాలను ఆహ్వానించింది. స్వీడన్ లో నిర్వహించిన ఈ సమ్మేళనంలో సుమారు 119 దేశాలు పాల్గొన్నాయి. అలా ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నాం. ద

ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం ప్రజలకు పర్యావరణం పట్ల అవగాహన కలిగించడం అని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. భూగోళంపై 80శాతం జలం విస్తరించి ఉంది. అయినప్పటికీ తాగడానికి ఉపయోగపడే శుద్ధమైన నీరు దొరకడం లేదు. స్వచ్ఛమైన నీటి లభ్యత మూడు శాతం కంటే తక్కువగా ఉంది. ఎక్కువ శాతం నీరు కలుషితమై లేదా ఉప్పు నీటి రూపంలో ఉంది. లభించే కొద్దిపాటి శుద్ధజలం మానవ చర్యలవల్ల పనికిరాకుండా పోతోంది. దీనివల్ల కేవలం మనుషులేకాక సమస్త ప్రాణికోటి, ముఖ్యంగా జలచరాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. భూగర్భజల కాలుష్యాన్ని ఆపడానికి మనం తీవ్రంగా ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే వ్యవసాయానికి, త్రాగడానికి స్వచ్ఛమైన నీరు అత్యంత ఆవశ్యకం. జలాన్ని సంరక్షించడం, పరిశుభ్రంగా ఉంచడం మనందరి నైతిక బాధ్యత. మన సంస్కృతిలో నదులను మాతగా పూజిస్తారు. కానీ తల్లిగా భావించే గంగ, యమున, గోదావరి వంటి నదుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూడవచ్చు.నివాస ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు, చెత్త చెదారం, పరిశ్రమల నుండి వచ్చే విషతుల్య రసాయనాలు నదులలో కలుస్తున్నా, పాలకులు పట్టించుకోవడంలేదు. ప్రజలు అంతకు మించి అన్నట్లు మిన్నకుంటున్నారు. దీని పర్యవసానంగా దేశంలో ఉన్న ప్రముఖ నదులన్నీ పెద్ద మురికి కాలువలుగా మారిపోయాయి. కాబట్టి నదులను కాపాడుకోవడానికి మనమంతా సంకల్పబద్ధులం కావాలి. వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికి వేయడం కారణంగా నీటిని సంరక్షించే వృక్షజాతులు తరిగిపోయి అనావృష్టి సమస్య ఉత్పన్నమవుతుంది.

కాబట్టి పట్టణాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి. నదుల కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ వాటిని సంరక్షించుకోవాలి. ప్రస్తుతం పెరుగుతున్న పట్టణీకరణ, వాహనాల నుండి వచ్చే పొగతో వాయు కాలుష్యం పెరిగిపోతోంది. మానవ ప్రేరిత చర్యల వల్ల వాతావరణంలో కొన్ని విషపూరితమైన వాయువులు చేరి, ప్రాణవాయువు తగ్గిపోతోంది. మనకు జీవితాన్ని ప్రసాదించి, జీవనం కోసం ఉపయోగ పడుతున్న భూమిని తన స్వార్థ ప్రయోజనాలు, సుఖభోగాల కోసం అనేక రకాలుగా నష్టపరుస్తున్నాడు. ఆహారం, జీవనాన్ని ఇచ్చే భూమిని నాశనం చేస్తున్నాడు. గృహ వ్యర్థాలు, చెత్తాచెదారం వల్ల భూసారం దెబ్బ తింటోంది. మన దేశంలో ప్రతి రోజూ 15 వేల టన్నుల కంటే ఎక్కువగా చెత్త ఉత్పత్తి అవుతోంది. వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాలు కొన్ని వందల సంవత్సరాల వరకు భూమిలో నాశనం కాకుండా నిల్వ ఉండి భూమి ఉత్పాదక శక్తిని తగ్గిస్తున్నాయి. పశుపక్ష్యాదులు వీటిని తినడం వల్ల చనిపోతున్నాయి.

పెరుగుతున్న జనాభా, తరుగుతున్న ఉత్పాదకత మానవ జాతి మనుగడకే ప్రమాదం. దీని ప్రభావం పర్యావరణంపై పడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణకు పాలుపడాల్సిన అవసరం ఉంది.

# పర్యావరణ పరిరక్షణకు సింగరేణి మరో ముందడుగు

**- గనుల ప్రాంతాల్లో పచ్చదనం పెంపుకు సింగరేణి ప్రత్యేక కార్యాచరణ**



కొత్తగూడెం బ్యూరో జూన్ 06(విజన్ ఆంధ్ర) : ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2026 సందర్భంగా కొత్తగూడెం ఏరియాలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ హై డెన్సిటీ మిక్స్డ్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో పర్యావరణ దినోత్సవ వేడుకలు నిర్వహించగా, సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ అటవీ శాఖ సహకారంతో వి.కె. కోల్ మైన్‌లో విస్తృత స్థాయిలో మొక్కల నాటకం చేపట్టారు. ఈ కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ (ఐఏఎస్), జిల్లా ఎస్పీ బి. రోహిత్ రాజు (ఐపీఎస్), సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ, డైరెక్టర్ (పీ అండ్ పీ) కె. వెంకటేశ్వర్లు, కొత్తగూడెం డీఎఫ్‌వో జి. కిష్టా గౌడ్, అడ్వైజరీ ఫారెస్ట్రీ అధికారి మోహన్ చంద్రా పర్గెన్, కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేమ్ రాజు తదితరులు హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం వంటి సవాళ్లను అధిగమించాలంటే విస్తృత స్థాయిలో మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. నేడు నాటిన మొక్కలను సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ఏడాది హరితహారం కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తోందని డైరెక్టర్ (పీ అండ్ పీ) కె. వెంకటేశ్వర్లు తెలిపారు. గనుల ప్రాంతాలను పచ్చదనంతో నింపేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను తమ బాధ్యతగా భావించి మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక పరిస్థితులకు అనుకూలమైన వివిధ రకాల మొక్కలను నాటి, వాటి సంరక్షణకు అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వి. మల్లికార్జున్ రావు, ఐఎన్‌టీయూసీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్, సింగరేణి ఉన్నతాధికారులు, అటవీ శాఖ సిబ్బంది, వి.కె. కోల్ మైన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# సర్కార్బడులోనే సకల సౌకర్యాలు

**- ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ**

**- మండల విద్యాశాఖ అధికారి ఏ రాందాస్**



నెల్లికుదురు, జూన్ 5. విజన్ ఆంధ్ర : ప్రభుత్వ బడులోనే ఉచిత పాఠ్యపుస్తకాలు ఏకరూప దుస్తులు మధ్యాహ్న భోజనం లాంటి ఉచిత సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని మండల విద్యాశాఖ అధికారి ఏ రాందాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శుక్రవారం వివిధ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కార్బడుల్లోని అనుభవద్యులైన ఉపాధ్యాయులు ఉంటారని నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఏకరూప దుస్తులు మధ్యాహ్న భోజనం తదితర ఉచిత సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తుందని, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి ప్రభుత్వ బడుల సంరక్షణలో భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల ఎమ్ఐఎస్ కోఆర్డినేటర్ మస్కపురి సుధాకర్, కంప్యూటర్ ఆపరేటర్ ఐఆర్పి పెరమల్లె యాకయ్య, సిఆర్పిలు ఆశోద భాస్కర్ రావు, బొడ్డు వీరస్వామి, బైరు కవిత, జంపాల కవిత, మెసెంజర్ రత్నపు యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా కోర్టుల ప్రాంగణంలో ఘనంగా వనమహోత్సవం



ఖమ్మం జిల్లా బ్యూరో, జూన్ 5 (విజన్ ఆంధ్ర): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నాడు ఖమ్మం జిల్లా కోర్టుల ప్రాంగణంలో హరితోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ న్యాయవాదులు, జిల్లా అటవీ శాఖ అధికారులు కలిసి మొక్కలు నాటారు. జిల్లా అదనపు న్యాయమూర్తులు, జామ, మామిడి, ఉసిరి, మర్రి, రావి, కానుగ ఇతర మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు పాల్గొన్నారు. ఖమ్మం బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం పరిధి రేంజర్ మరియు సిబ్బంది మొక్కలు నాటి ట్రీ గార్డులు, ఎరువులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తులు మాట్లాడుతూ కాలుష్యం కోరలు చాస్తున్న నేటి కాలంలో పర్యావరణ పరిరక్షణ అత్యంత అవసరం అన్నారు. 'మొక్కలు నాటుదాం - భవిష్యత్‌ను కాపాడుదాం' అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మొక్క నాటడమే కాదు, అది వృక్షంగా ఎదిగే వరకు సంరక్షించే బాధ్యత తీసుకోవాలని అన్నారు. న్యాయ స్థానాలు న్యాయంతో పాటు పచ్చదనానికి కూడా నెలవు కావాలి అని ఆకాంక్షించారు. అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా ఈనెల 1వ తేదీ నుంచి 12వ తేదీ వరకు పర్యావరణ దినోత్సవం వారోత్సవాలు జరగనున్నాయని తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో 50 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, జిల్లా కోర్టు వంటి ప్రభుత్వ కార్యాలయాలు ముందుకు రావడం శుభపరిణామం అన్నారు. నాటిన మొక్కలకు మూడు సంవత్సరాల పాటు అటవీ శాఖ సహకారం ఉంటుంది అని తెలిపారు.

## జర్నలిస్ట్ కూతురి చదువు కోసం ఆర్థిక సహాయం

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి ( విజన్ ఆంధ్ర): జూన్ 04 పదరా మండలానికి చెందిన సీనియర్ జర్నలిస్టు రామస్వామి కూతురు హైదరాబాదులో ఏజీబీఎస్సీ చదువుతుంది. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఫీజు,మెస్ బిల్లు చెల్లించలేనన్న విషయం తెలపడంతో ఐజేయు నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన నేషనల్ కౌన్సిల్ సభ్యులు గోలి సుదర్శన్ రెడ్డి, 10వేలు ,మరో జర్నలిస్టు ఐజేయూ సభ్యుడు 5వేల రూపాయలు మొత్తం 15 వేల రూపాయలను రామస్వామికి గురువారం నాగర్ కర్నూల్ లో అందజేయడం జరిగింది .

గతంలో క్లాస్మేట్ క్లబ్ తరపున కూడా కొంత ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టి యు డబ్ల్యు జే ఐజేయు నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు పి. విజయకుమార్ , జిల్లా కౌన్సిల్ సభ్యులు రమణ ,అవుట వెంకటస్వామి, జయ ప్రసాద్, పాలాది యాదయ్య,సీనియర్ నాయకులు కొండకింది మాధవరెడ్డి, నాగర్ కర్నూల్ తాలూకా ఉపాధ్యక్షులు జంగిటి రాంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు గడ్డ సాక్షిగా రేవంత్ పచ్చి అబద్ధాలు

**- పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కేసీఆర్ హయాంలో రూ.35,200 కోట్ల పనులు చేసింది నిజం కాదాలి ?**

**- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**



వనపర్తి జూన్ 05 (విజన్ ఆంధ్ర బ్యూరో):పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు వ్యతిరేకంగా వందల కేసులు వేసింది కాంగ్రెస్ పార్టీ కాదానీ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రశ్నించ్చారు. 27 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారని రేవంత్ స్వయంగా ఒప్పుకున్నాడనీ అన్నారు. 52,121 కోట్లు సాగు నీటి ప్రాజెక్టుల కోసం చేసిన అప్పులకు వడ్డీ, అసలు కింద చెల్లించామని చెబుతున్న రేవంత్ రెడ్డి దమ్ముంటే దానికి సంబంధించిన వివరాలు విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. ఒక టీఎంసీకి వరి వేస్తే ఆరు వేల ఎకరాలు, ఒక టీఎంసీకి వేరుశనగ, మిర్చి, ఉద్యానపంటలు, మొక్కజొన్న పంటలు వేస్తే పదివేల ఎకరాలు, డ్రిప్, స్ప్రింక్లర్ ఉపయోగించి పంటలు పండిస్తే 15 వేల ఎకరాలుగా లెక్క కడతారన్నారు. పాలమూరు పర్యటనలో మీడియా ప్రశ్నకు టీఎంసీ అంటే గతంలో పదివేల ఎకరాలుగా, ఇప్పుడు 15 వేల ఎకరాలుగా లెక్కకడుతున్నారని చెప్పడం మరో పచ్చి అబద్ధమన్నారు. ఇదే మాట కేంద్ర జలసంఘం సమావేశాల్లో చెబితే పరువు పోవడమే కాకుండా, టీఎంసీకి 15 వేల ఎకరాలు లెక్కగట్టి కేటాయిస్తే తెలంగాణ శాశ్వతంగా నీటి హక్కులు కోల్పోతుందన్నారు. రేవంత్ రెడ్డి అబద్ధాల లెక్కలు నమ్ముకుంటే రాష్ట్ర రైతాంగం డ్రిప్పులు, స్ప్రింక్లర్ల మీదనే ఆధారపడాలన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కాల్వల టెండర్లు రద్దు చేయడం కారణంగా ఇప్పుడు 4 వేల కోట్ల భారం పెరగడం నిజం కాదన్నారు. దశాబ్దాల పాటు కాంగ్రెస్ హయాంలో పెండింగ్ లో పెట్టిన ప్రాజెక్టులను పూర్తి చేసింది కేసీఆర్ పాలనలోనే కాదన్నారు. కమీషన్ల కోసమే పంపులు, లిఫ్టులు పూర్తి చేశారని రేవంత్ చెప్పడం ఆయన అజ్ఞానానికి, అవగాహనా రాహిత్యానికి నిదర్శనమన్నారు. ఎత్తిపోతల పథకాల్లో మొదట చేయాల్సింది పంపులు, లిఫ్ట పనులే అవగాహన లేకుండా రేవంత్ రెడ్డి మాట్లాడాడశీ విందూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ హయాంలో కల్వకుర్తి ఎత్తిపోతల, నెట్టెంపాడు, భీమా తదితర పథకాల్లో మొబిలైజేషన్ అడ్వాన్సులు తీసుకుని కాలువలు తవ్వి పంపులు, లిఫ్టు పనులను గాలికి వదిలేసి వెళ్లిపోయారన్నారు. ఇప్పటికీ అప్పటి పనులు రద్దు చేయలేని, కొనసాగించలేని పరిస్థితి నెలకొన్నదన్నారు. 2006లో కాంగ్రెస్ వదిలేసిన కేఎల్ఐ ఎత్తిపోతల పనులను 2016లో బీఆర్ఎస్ పూర్తి చేసింది వాస్తవం కాదన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కోసం 27,100 ఎకరాల భూసేకరణకు గాను 26,800 ఎకరాలు కేసీఆర్ హయాంలోనే సేకరించడం జరిగిందన్నారు. భూసేకరణలో మిగిలింది 300 ఎకరాలు మాత్రమేనన్నారు. భూసేకరణ చేయలేదని రేవంత్ రెడ్డి చెప్పడం సిగ్గుచేటన్నారు. ఆర్టీఐ లో ఆరితేరిన రేవంత్ రెడ్డి ఇరిగేషన్ శాఖకు ధరఖాస్తు చేసి వివరాలు తెప్పించుకోవాలన్నారు. కాంగ్రెస్ హయాంలో మొదలుపెట్టిన మొబిలైజేషన్ అడ్వాన్సుల వ్యవస్థను రద్దు చేసింది కేసీఆర్ హయాంలోనే అన్నారు. దాని స్థానంలో చేసిన పనులకు బిల్లులు చేసే పద్ధతి తీసుకువచ్చారన్నారు. పాలమూరు బిడ్డను అని చెప్పుకునే రేవంత్ రెడ్డి 30 నెలల్లో ప్రాజెక్టుల పూర్తి చేసింది ఏంటినీ ప్రశ్నించ్చారు. 30 నెలల్లో మూడు లక్షల కోట్లు అప్పుచేసిన రేవంత్ రెడ్డి అప్పుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ అప్పుల గురించి రేవంత్ రెడ్డి రెండేళ్లుగా చెబుతున్న అబద్ధాలను కాగ్ నివేదిక స్పష్టం చేసిందన్నారు. 30 నెలల్లో పాలమూరు ప్రాజెక్టుల్లో తట్ట మట్టి ఎత్తకుండా తీరిగ్గా పరిశీలనకు వచ్చిన రేవంత్ రెడ్డి పాత అబద్ధాలనే వల్లె వేశాడన్నారు. 30 నెలల్లో రేవంత్ రెడ్డి ఏం పనులు చేశాడని బీఆర్ఎస్ అడ్డుకున్నదనీ, వేగంగా పనులు పూర్తి చేసి రైతాంగానికి నీళ్లు ఇవ్వాలనే బీఆర్ఎస్ డిమాండ్ చేస్తున్నదన్నారు. పాలమూరు పర్యటనలో ఇన్ని మాటలు మాట్లాడిన రేవంత్ రెడ్డి కేంద్రం వెనక్కి పంపిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్ గురించి ఎందుకు మాట్లాడలేదన్నారు. సీఎం స్థాయిని మరచి రేవంత్ రెడ్డి పాలమూరు పర్యటనలో అబద్ధాలు, అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. వలసల పాలమూరులో సాగునీరు పారించి, వలసల జిల్లాకే వలసలు వచ్చేలా చేసిన ఘనత కేసీఆర్ దేన్నారు. అబద్ధానికి అంగీ, లాగు వేస్తే అది రేవంత్ రెడ్డి.. ప్రాజెక్టుల మీద, పాలమూరు మీద ఆయనకున్న అవగాహన శూన్యమన్నారు. రేవంత్ రెడ్డి అబద్ధాలకు కాలం చెల్లిందనీ,మిగిలిన పదవీకాలం అయినా నిజాలు మాట్లాడితే బాగుంటుందన్నారు. అబద్ధాలు చెప్పడానికి రెండు రోజుల పర్యటన ఎందుకు ? హైదరాబాద్ లోనే ఇదే స్క్రిప్టు చదివితే ప్రజలకు కొంచెం భారమైనా తగ్గేదన్నారు. పాలమూరు పర్యటన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గత ప్రభుత్వంలో ప్రాజెక్టుల్లో జరిగిన పనులపై చేసిన ఆరోపణలను మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఖండించారు.

# పరిశ్రమల అభివృద్ధికి అధికారులు మార్గదర్శకులుగా వ్యవహరించాలి

**- జిల్లా కలెక్టర్ అంకిత్**



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, జూన్ 06(విజన్ ఆంధ్ర) : జిల్లాలో పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం, ఉపాధి అవకాశాల పెంపే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా పరిశ్రమల ప్రమోషన్ కమిటీ సమావేశంలో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పరిశ్రమల స్థాపన, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాల అమలు, ఉపాధి కల్పన కార్యక్రమాల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన సలహాలు, సహాయ సహకారాలు అందించి కొత్త పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం కల్పించాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రభుత్వ సబ్సిడీలు, ప్రోత్సాహక పథకాలు అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో అందేలా చూడాలని సూచించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు వైటీసీ, పాలిటెక్నిక్ మరియు ఇతర సాంకేతిక విద్యా కోర్సులపై విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నూతన కోర్సుల వివరాలతో కూడిన కరపత్రాలను అందుబాటులో ఉంచి విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో టీజీ-ఐపాస్ (TG-iPASS) ద్వారా పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం 50 దరఖాస్తులు అందగా, వాటిలో 39 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఒక దరఖాస్తు తిరస్కరించబడగా, మిగిలిన దరఖాస్తులు వివిధ దశల్లో పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల సేవా రంగ సంస్థలకు పెట్టుబడి రాయితీ పథకం అమలు, దరఖాస్తుల పురోగతిపై కూడా చర్చించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఆలస్యం లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) స్థాపనకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. స్థానిక వనరుల ఆధారంగా పరిశ్రమల స్థాపన, క్లస్టర్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కలిఓంచేలా ఉద్యోగ మేళాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాను పారిశ్రామికంగా మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, ఎల్‌డీఎం రామిరెడ్డి, మెప్మా పీడీ రాజేష్, జిల్లా క్రీడాశాఖ అధికారి పరంగాం రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత - అదనపు కలెక్టర్ రవి

**ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వనమహోత్సవం నిర్వహణ**



హనుమకొండ జిల్లా ప్రతినిధి జూన్ 05 ( విజన్ ఆంధ్ర ) : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎల్కతుర్తి మండల కేంద్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ మరియు చెట్ల పెంపకం నేటి కాలంలో అత్యంత అవసరమని అన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్య ప్రభావాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, పచ్చని వాతావరణాన్ని అందించేందుకు సమాజంలోని ప్రతి వర్గం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు రూపొందించిన అవగాహన పోస్టర్‌ను అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రకృతి వనరుల సంరక్షణ, నీటి పొదుపు, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, చెట్ల పెంపకం వంటి అంశాలపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## అనుమానస్పదంగా మహిళ మృతి

**- కేసు నమోదు విచారణ చేస్తున్న పోలీసులు**



నెల్లికుదురు, జూన్ 5. విజన్ ఆంధ్ర: అనుమానాస్పదంగా ఉరి వేసుకుని మహిళ మృతి చెందిన సంఘటన మహబూబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని బ్రాహ్మణ కొత్తపల్లి లో చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం బ్రాహ్మణ కొత్తపల్లి గ్రామానికి చెందిన జెల్ల కృష్ణవేణి శుక్రవారం ఇంటిలో ఉరి వేసుకుని మృతి చెందగా మృతురాలు తల్లి ప్రమీల తన కూతురు మరణం అనుమానాస్పదంగా ఉందని పరశు రాములతో 14 సంవత్సరాల క్రితం పెళ్లి చేయగా వారికి ఇద్దరు కుమారులు ఉండగా భార్య భర్తల మధ్య గత కొన్ని రోజులు సంవత్సరాల నుండి గొడవలు జరుగుతున్నాయని అందుకే భర్త పరశురాములు చంపి ఉరి వేసుకున్నట్టుగా చేశారని అనుమానం ఉందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు .

# గ్రీన్ మిషన్ ఏ ఆర్ఎఫ్‌సిఎల్!!

- ప్రతి మొక్క.. భవిష్యత్‌కు భరోసా
- మొక్కల పెంపకమే ప్రకృతికి సేవ
- గ్రీన్ ఫ్యూచర్ కోసం సమష్టి కృషి చేద్దాం
- సీఈఓ సంజీవ్ గులాటి, యూనిట్ హెడ్ ఎస్.కె. జిందాల్, జీఎం ప్రేమ్ కుమార్





పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 5 (విజన్ ఆంధ్ర) : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సిఎల్)లో పచ్చదనం పరిరక్షణకు అంకితభావాన్ని చాటేలా మొక్కల నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రకృతి సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అనే సందేశంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో సంస్థ సీఈఓ సంజీవ్ గులాటి, యూనిట్ హెడ్ ఎస్.కె. జిందాల్, జీఎం (ఓ & ఎం) ప్రేమ్ కుమార్‌తో పాటు వివిధ విభాగాల అధిపతులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంస్థ ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో మొక్కల పెంపకం అత్యంత అవసరమని అధికారులు పేర్కొన్నారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం కూడా సమానంగా ముఖ్యమని వారు తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆర్ఎఫ్‌సిఎల్‌లో మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉంది అని అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి మొక్కల పెంపకాన్ని అలవాటుగా మార్చుకోవాలి. పరిశ్రమల అభివృద్ధితో పాటు ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవడం కూడా అత్యంత అవసరం అని తెలిపారు. ప్రతి ఉద్యోగి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించేందుకు ముందుకు రావాలి. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించడమే మా లక్ష్యం అని స్పష్టం చేశారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి మన వంతు భాగస్వామ్యం అందించాలి:ఎస్పీ అఖిల్ మహాజన్**

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,జూన్ 05, (విజన్ ఆంధ్ర) మారుతున్న వాతావరణ పరిస్థితులు, గ్లోబల్ వార్మింగ్ సవాళ్లను ఎదుర్కోవడానికి అడవులను రక్షించుకోవడం ఒక్కటే మార్గమని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" లో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆదిలాబాదు గ్రామీణ మండలం యాపల్‌గూడ బీట్‌లో అడవుల పునరుజ్జీవనం కోసం సరికొత్త హై డెన్సిటీ మిక్స్ ప్లాంటేషన్ విధానంలో భారీగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించబడింది. ఈ బృహత్తర కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ లతో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రపంచ పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తీర్ణం పెంపుదలే ధ్యేయంగా ప్రభుత్వం అటవీ శాఖ ఆధ్వర్యంలో విస్తృతం అవగాహన కల్పిస్తూ సంరక్షిస్తుందని అన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, గ్లోబల్ వార్మింగ్ సవాళ్లను ఎదుర్కోవడానికి అడవులను రక్షించుకోవడం ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యంతో పచ్చదనం - ప్రగతికి ప్రణాళిక" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ఒక ఉద్యమంలా మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటిని వృక్షాలుగా మార్చే వరకు సంరక్షించడం అంతకంటే ముఖ్యమని, నాటిన ప్రతి మొక్కను బ్రతికించుకునేలా అధికారులు, ప్రజలు సమిష్టిగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ



మాట్లాడుతూ, సమాజంలో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. పాస్టిక్ వినియోగాన్ని తగ్గించి తమ వంతు బాధ్యత గా మెలగని సూచించారు. ప్రకృతి సమతుల్యత దెబ్బతింటే మానవాళి మనుగడకే ప్రమాదమని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తుచేశారు. పోలీస్ శాఖ తరపున జిల్లా వ్యాప్తంగా మొక్కల పెంపకానికి, అడవుల రక్షణకు పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఈ హరిత సంకల్పం విజయవంతం అవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, ఆదిలాబాదు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ నిరోష, డిఎస్పీ జీవన్ రెడ్డి, ఎఫ్డిఓ అరవింద్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు. విద్యార్థులు, అటవీ, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విహార యాత్రలో విషాదం

- మారేడుమిల్లి ఘాట్ రోడ్ లో రోడ్డు ప్రమాదం...
- బ్రేక్ ఫెయిల్ అవ్వడంతో ప్రమాదానికి గురైన మినీ గూడ్స్ వ్యాన్
- తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 24 మంది సందర్శకులు...
- క్షతగాత్రులను చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించిన సిఆర్పిఎఫ్ బలగాలు
- ఘటన స్థలానికి చేరుకున్న చింతూరు ఏ ఎస్ పి హేమంత్
- ఆరుగురికి తీవ్ర గాయాలు కావడంతో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలింపు







భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో ( విజన్ ఆంధ్ర ) :- మారేడుమిల్లి ఘాట్ రోడ్ లో విహార యాత్రకు వచ్చిన మినీ గూడ్స్ వ్యాన్ బ్రేక్ ఫెయిల్ అవడంతో బోల్తా పడిన ఘటనలో వివరాలను పరిశీలిస్తే శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట మండలం వేమగిరి గ్రామానికి చెందిన 24 మంది సందర్శకులు మారేడుమిల్లి విహారయాత్రకు రావడం జరిగింది. మారేడుమిల్లి జలతరంగిని నందు నీళ్ల లేకపోవడంతో మోతుగూడెం పొల్లూరు జలపాతం సందర్శించడానికి బయలుదేరిన మినీ గూడ్స్ వ్యాన్ ప్రమాదవశాత్తు బ్రేక్ ఫెయిల్ కావడంతో మారేడుమిల్లి ఘాట్ రోడ్డు నందు బోల్తా పడటం జరిగింది . ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే సిఆర్పిఎఫ్ బలగాలు క్షతగాత్రులను చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించి సేవలు అందిస్తున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న చింతూరు ఏ ఎస్ పి హేమంత్ ప్రమాద స్థలాన్నికి చేరుకొని బాధితుల్లో త్రివంగా గాయపడిన ఆరుగురినీ మెరుగైన వైద్య సేవల నిమిత్తం వారిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చింతూరు, మోతుగూడెం ఏరియా పోలీసులు ప్రమాద బాధితులకు సహాయాన్ని అందిస్తున్నారు. డ్రైవర్ పై కేసు నమోదు చేసి, గూడ్స్ వ్యాన్ సిజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించి ఘటనపై పోలీసు అధికారులు విచారణ చేపట్టారు.

# గెలుపు వైపు తొలి అడుగు.. జెమ్-2026!!

- ఆత్మవిశ్వాసమే అమ్మాయిల అసలైన శక్తి
- చదువు,ధైర్యం,సాధన లక్ష్యాలను చేరుకునే బలాలు
- కలలు కనండి.. సాధించి చూపండి...విజయం పొందండి
- ఈడీ చందన్ కుమార్ సమంత







పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 5 (విజన్ ఆంధ్ర) : ఎన్టీపీసీ రామగుండంలో నెలరోజుల పాటు నిర్వహించిన గర్ల్ ఎంపవర్‌మెంట్ మిషన్ కార్యక్రమం శుక్రవారం ఘనంగా ముగిసింది. కాకతీయ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ముగింపు వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. చిన్నారుల ప్రతిభ, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకతకు ఈ కార్యక్రమం అద్దం పట్టింది. ఆహ్వానితులకు పర్యావరణ హిత మొక్కలను అందజేసి స్వాగతం పలకగా, దీపప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం జెమ్2026లో జరిగిన విశేషాలు, విద్యార్థినుల అభ్యాస ప్రయాణాన్ని ప్రతిబింబించే వీడియో ప్రదర్శించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం నేపథ్యంగా విద్యార్థినులు ప్రదర్శించిన నాటిక అందరినీ ఆలోచింపజేసింది. జానపద నృత్యాలు, యోగా విన్యాసాలు, ఉత్సాహభరితమైన పంజాబీ డ్యాన్స్, రాజస్థానీ నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కరాటే, నంచాకు ప్రదర్శనల ద్వారా బాలికలు తమ ఆత్మరక్షణ నైపుణ్యాలను చాటిచెప్పారు. ఈ సందర్భంగా ఈడి చందన్ కుమార్ సమంత మాట్లాడుతూ, జెమ్-2026 విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థినులందరికీ హృదయపూర్వక అభినందనలు. ఈ కార్యక్రమం మీలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించిందని నమ్ముతున్నాను అని అన్నారు. విద్యే భవిష్యత్తుకు బలమైన పునాది. కలలు కనడమే కాదు, వాటిని సాధించే దిశగా నిరంతరం కృషి చేయాలి. పట్టుదల, క్రమశిక్షణ, ఆత్మస్థైర్యం ఉంటే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చు అని తెలిపారు. జెమ్ ద్వారా పొందిన అనుభవాలు మీ జీవిత ప్రయాణంలో మార్గదర్శకంగా నిలుస్తాయి. ప్రతి విద్యార్థిని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాను. మీ విజయాలే దేశ అభివృద్ధికి నిజమైన బాటలు వేస్తాయి అని ఆనందం వ్యక్తం చేశారు. చివరగా కృతజ్ఞతా ప్రసంగంతో కార్యక్రమం ముగిసింది. ఆనందం, అభ్యాసం, ఆత్మవిశ్వాసం, సాంస్కృతిక వైభవం కలగలిసిన జెమ్2026 చిన్నారుల జీవితాల్లో మరపురాని మధుర జ్ఞాపకాలను మిగిల్చింది.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు సహకరించాలి

**బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాను వెంటనే అందించాలి**

**రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి**

నిజామాబాద్, జూన్ 05 :( విజన్ ఆంధ్ర ) పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పన కోసం ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం జిల్లా స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ అమలు విధానాన్ని వివరిస్తూ, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యల గురించి కలెక్టర్ తెలియజేశారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ జిల్లాలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను అమలు చేసేందుకు అధికార యంత్రాంగం ఎంతో బాధ్యతాయుతంగా పని చేస్తుందని తెలిపారు. మరణించిన వారి పేర్ల తొలగింపు, శాశ్వతంగా వలస వెళ్లిన వారిని గుర్తించడం, అర్హులైన కొత్త ఓటర్ల పేరును జాబితాలో చేర్చడం కోసమే ఎస్.ఐ.ఆర్ అమలు జరుగుతోందని అన్నారు. ఇప్పటికే నిజామాబాద్ అర్బన్ మినహా మిగతా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో 90శాతం ప్రీ-మ్యాపింగ్ పూర్తయ్యిందని, అర్బన్ సెగ్మెంట్ లో 68 శాతం జరిగిందని వివరించారు. జూన్ 25 నుండి క్షేత్రస్థాయిలో జరుగనున్న ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలన జరపాలని, ప్రతి ఓటరు తప్పనిసరిగా మ్యాపింగ్ చేసుకునేలా చొరవ చూపాలని అన్నారు. ఎస్.ఐ.ఆర్ అమలులో బీ.ఎల్.ఓలతో పాటు బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర కూడా అత్యంత క్రియాశీలకం అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ నెల 15 నుండి 24వ తేదీ లోపు బీ.ఎల్.ఏలు, బీ.ఎల్.ఓలకు ఎస్.ఐ.ఆర్ అమలు తీరుపై ఆయా ప్రాంతాల వారీగా శిక్షణా తరగతులను సైతం నిర్వహించాల్సి ఉందన్నారు. అంతేకాకుండా ఓటరు జాబితా విషయమై ఏవైనా అభ్యంతరాలు ఉంటే, కేవలం బీ.ఎల్.ఓలు మాత్రమే వాటిని తెలియజేయాల్సి ఉంటుందని, వారి నుండి వచ్చే క్లెయిములు, అభ్యంతరాలను మాత్రమే స్వీకరించడం జరుగుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తక్షణమే బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకుని, నిర్ణీత ఫార్మాట్ లో వివరాలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో భాగంగా ఈ నెల (జూన్) 25 నుంచి జూలై 24 వరకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి సమగ్ర విచారణ చేపడతారని



తెలిపారు. ఈ సందర్భంగా ఓటరు పేరుతో ముద్రితమై ఉండి, క్యూఆర్ కోడ్ కలిగిన ఎన్యుమరేషన్ ఫారంలను అందజేస్తారని, ప్రతి ఓటరు తప్పనిసరిగా ఆ ఫారంలో వివరాలను పూరించి తిరిగి బీ.ఎల్.ఓలకు అందించేలా చొరవ చూపాలని కోరారు. ఈ విషయంలో క్షేత్రస్థాయిలో ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఎస్.ఐ.ఆర్ కోసం ఇంటికి వచ్చే బీ.ఎల్.ఓలు, సూపర్వైజర్లకు ప్రజలు సహకరించేలా చూడాలని అన్నారు. బీ.ఎల్.ఓలు పక్కాగా ప్రతి ఇంటిని తప్పనిసరి సందర్శించేలా ఆన్ లైన్ యాప్ ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఇళ్ళ సందర్శన విషయంలో బీ.ఎల్.ఓలకు బీ.ఎల్.ఓలు సహకరించేలా చూడాలన్నారు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ బీ.ఎల్.ఓల నుండి ఓ.టీ.పీలు తీసుకుని బీ.ఎల్.ఏలు ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను చేపట్టకూడదని, ఇలా చేయడం నేరంగా పరిగణించబడుతుందని, ఇలా చేసినందుకు సంబంధిత బీ.ఎల్.ఓ, బీ.ఎల్.ఏలు శిక్షార్హులు అవుతారని కలెక్టర్ స్పష్టం చేశారు. కాగా, ఎస్.ఐ.ఆర్ షెడ్యూల్ ప్రకారం జూలై 24న పోలింగ్ కేంద్రాలను ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించడం జరుగుతుందని, జూలై 31న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురిస్తామని వివరించారు.జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు ముసాయిదా జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అభ్యంతరాలు తెలియజేయవచ్చని, అక్కడ సంతృప్తి చెందని పక్షంలో పక్షం రోజుల అనంతరం జిల్లా ఎన్నికల అధికారికి అభ్యంతరాలు తెలుపవచ్చని సూచించారు. దాఖలైన అభ్యంతరాలు, క్లెయిములను సెప్టెంబర్ 28 వరకు పరిష్కారం చేస్తామని తెలిపారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ముధోల్ లో డీఏపీ ఎరువుల కొరత

-ఇబ్బందుల్లో రైతులు
-డీఏపీని సరఫరా చేయాలని రైతుల ఆవేదన




ముధోల్:05జూన్:విజన్ ఆంధ్ర. : రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నప్పటికీ ముధోల్ మండలంలో ఎరువుల కొరత తీవ్రంగా ఏర్పడుతోంది. ఖరీఫ్ సీజన్ లో పంటలను వేసేందుకు రైతన్న సన్నద్ధమయ్యారు.ఎరువులు కొరత ఏర్పడటంతో వ్యవసాయం సాగు చేసే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో పీఏసీఎస్ కార్యాల యంలో డీఏపి లేకపోవడంతో ప్రైవేట్ డీలర్ల వద్ద ఎరువులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం డీఏపీ రూ.1300 ఉండగా ప్రైవేటు దళారులు రూ. 1700 నుండి 1800 విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట సాగుకు డిఏపి ఎరువును ఉపయోగించాలని రైతులు ఏమి చేయాలో తోచక దళారుల వద్ద అధిక ధరలకు తీసుకునే దుస్థితి ఏర్పడింది. తప్పని పరిస్థితుల్లో ఎరువుల కోసం రైతులు పక్క మండలాలు, మహారాష్ట్ర లకు ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో కొనుగోలు చేసి తీసుకొచ్చి ఉపయోగిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి డిఏపి ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# భూసమస్యల పరిష్కారానికి అధికారులందరూ జవాబుదారీగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

బద్వేలు,జూన్ 05: (విజన్ ఆంధ్ర) జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను త్వరితగతిన పరిష్క రించేందుకు రెవెన్యూ శాఖ ప్రత్యేక చొరవ చూపుతోందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.శుక్రవారం బద్వేలు లో "ఒక నెల - ఒక నియోజకవర్గం" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ అధికారులు ప్రజా సమస్యల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ సమావేశం లో స్వీకరించిన సుమారు 200 పిటిషన్లను పరిష్కరించేందుకు అధికారులకు స్పష్టమైన గడువును విధించామని తెలిపారు.ప్రతి దరఖాస్తును ఒక సమస్యగా పరిగణించి, యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.రాబోయే మూడు నుంచి నాలుగు వారాల్లో ఈ పిటిషన్లన్నింటినీ పరిష్కరించి,తుది నివేదికను దరఖాస్తుదారులకు అందజేయాలని ఆయన స్పష్టం చేశారు.నోటీసులు జారీ చేయడం, దరఖాస్తుదారుల నుంచి వివరణలు తీసుకోవడం వంటి ప్రక్రియలకు 15 రోజుల సమయం కేటాయించాలని అధికారులకు సూచించారు. సివిల్ వివాదాలు లేదా కోర్టు పరిధిలో ఉన్న



అంశాలను మినహాయించి, మిగిలిన సమస్యలన్నింటినీ చట్టబద్ధంగా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు.వచ్చే గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఈ పిటిషన్లపై 'యాక్షన్ టేకన్ రిపోర్ట్' సమీక్ష ఉంటుందని తెలిపారు. వివిధ శాఖల అధికారులు ఒకే చోట అందుబాటు లో ఉండటంతో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గుతుందనన్నారు ఈ సమీక్ష సమావేశానికి సంబంధిత అధికారులు ప్రతి కేసు వివరాలతో హాజరుకావాలని ఆయన హెచ్చరించారు.భూపరిపాలన లో జవాబుదారీతనం ముఖ్యమని, గ్రాస్ రూట్ స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలనీ అన్నారు.ప్రజలు సమర్పించిన ప్రతి దరఖాస్తును పూర్తిస్థాయిలో పరిశీలించి, చట్టపరంగా ఉన్న అవకాశాలను వినియోగించి, నిబంధనలకు అనుగుణంగా త్వరితగతిన పరిష్కారం అందించేందుకు అధికారులు కట్టుబడి ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు.భూ సమస్యల పరిష్కారంలో పారదర్శకత,బాధ్యతాయుతమైన పరిపాలనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ వేదిక ద్వారా ప్రజలకు భూ సంబంధిత సేవలు మరింత చేరువ కావడం తో పాటు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు కూడాపరిష్కారం లభించే అవకాశం ఉందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.దాదాపు గా 200 అర్జీలు రావడం జరిగిందని,ఈ అర్జీలపై తీసుకున్న చర్యలపై వచ్చే వారం మరలా మీటింగ్ లో చర్చించడం జరుగు తుందనీ,ప్రతి అర్జీ వారీ గా తీసుకోవలసిన చర్యలపై యాక్షన్ ప్లాన్ ను సిద్ధం చేయాలని,సివిల్ డిస్ప్యూట్స్, కోర్టు పరిధి లో ఉన్న కేసులలో పరిష్కారం చూపేందుకు అవకాశం ఉన్న వాటిని పరిశీలించాలని తెలిపారు సివిల్ కేసుల్లో ఎంక్వైరీ చేసిన అనంతరం అన్ని రికార్డులను పరిశీలించి సంతృప్తి స్థాయిలో అర్జీ దారులకు పరిష్కారం చూపించాలని తెలిపారు. వచ్చే శుక్రవారం పోరుమామిళ్లలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు కడప డిసీసీబి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గంలో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని జిల్లా కలెక్టర్ ను కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు,ఆర్డీఓ చంద్రమోహన్,బద్వేల్ నియోజకవర్గ తాసిల్దార్లు ఎంపీడిఓ లు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

- నిజామాబాద్ సీపీ పి. సాయి చైతన్య సమగ్ర సమీక్షా సమావేశం

నిజామాబాద్ జూన్05:( విజన్ ఆంధ్ర) రాబోయే వర్షాకాలాన్ని పురస్కరించుకుని తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, అత్యవసర సహాయక చర్యలపై నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య శుక్రవారం పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ అధికారులతో ఒక సమగ్ర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. భారీ వర్షాలు, హఠాత్తుగా వచ్చే వరదలు, పొంగిపొర్లే చెరువులు, వాగులు, దెబ్బతిన్న రోడ్లు, విరిగిపడిన చెట్లు లేదా విద్యుత్ స్తంభాల వల్ల ఎదురయ్యే సవాళ్లను కమిషనర్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల ప్రాణాలను, ఆస్తులను రక్షించడమే పోలీస్ శాఖ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన నొక్కి చెప్పారు. తమ తమ పోలీస్ స్టేషన్ల పరిధిలో వరదలు వచ్చే ప్రమాదం ఉన్న లోతట్టు ప్రాంతాలు, బలహీనమైన వంతెనలు, పొంగిపొర్లుతున్న జలాశయాలు, శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి, వాటిపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, వెంటనే అవసరమైన ట్రాఫిక్ మళ్లింపులను




చేపట్టాలని పోలీస్ కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. ప్రమాదాల నివారణకు రాత్రి వేళల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాల్సిన ప్రాధాన్యతను ఆయన గుర్తుచేశారు. పొంగిపొర్లుతున్న వాగులు, వరద నీరు చేరిన రోడ్లను ప్రజలు, వాహనాలు దాటకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు వీలుగా ప్రతి పోలీస్ స్టేషన్‌లో లైఫ్ జాకెట్లు, తాళ్లు, టార్చ్ లైట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్ (మైకులు), సమాచార సాధనాలతో కూడిన ప్రత్యేక రెస్క్యూ (సహాయక) బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం, రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక, వైద్య, విద్యుత్ శాఖలతో సన్నిహిత సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలని కమిషనర్ సాయి చైతన్య అధికారులకు సూచించారు. అంతేకాకుండా, పౌరులకు ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు, భద్రతా మార్గదర్శకాలను అందించడానికి సోషల్ మీడియా వేదికలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని, అదే సమయంలో తప్పుడు సమాచారాన్ని, వదంతులను గట్టిగా తిప్పికొట్టాలని సీపీ అధికారులను కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని, అవసరమైనప్పుడు వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను తగ్గించడానికి పోలీస్ సిబ్బంది అంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని, 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, అత్యవసర కాల్స్‌కు తక్షణమే స్పందించాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్ రెడ్డి, మల్లేష్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ వీరయ్యలతో పాటు పలువురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్ హెచ్‌ఓలు), ఐటీ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీ

**- పాఠశాలలో పుస్తకాలు మరియు యూనిఫాం విక్రయాలపై చర్యలు తీసుకోవాలి ఏబీవీపీ ప్రేమ్ కుమార్ డిమాండ్**



భూపాలపల్లి జిల్లా 05 జూన్ (విజన్ ఆంధ్ర) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పాఠశాలలు ప్రారంభం కాకముందే అనేక ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జిల్లా కన్వీనర్ గుజ్జుల ప్రేమ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల యాజమాన్యాలు పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలను అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నాయని ఆయన పేర్కొన్నారు. పుస్తకాల విక్రయానికి సరైన అనుమతులు లేకుండానే కొంతమంది పాఠశాలలు వ్యాపారం నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. జిల్లా విద్యాశాఖ అధికారి వెంటనే స్పందించి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు అధిక ఫీజుల వసూళ్లు, పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలను నిలిపివేయాలని నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బుక్ స్టాల్స్‌తో ఒప్పందాలు కుదుర్చుకుని పుస్తకాల విక్రయం చేపట్టే విధానాన్ని కూడా నిషేధించాలని కోరారు. జిల్లాలోని ప్రతి ప్రైవేట్ పాఠశాలను విద్యాశాఖ అధికారులు తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘిస్తూ పుస్తకాలు మరియు ఇతర విద్యా సామగ్రి విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## బదిలీపై వెళ్తున్న అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి...



నిర్మల్ జిల్లా, జూన్ 05 (విజన్ ఆంధ్ర) : బదిలీపై వెళ్తున్న అదనపు కలెక్టర్ ను నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అప్పాల గణేష్ చక్రవర్తి మాట్లాడుతూ... జిల్లాలో అదనపు కలెక్టర్ ఇప్పటివరకు అందించిన సేవలను కొనియాడారు. ప్రజా పరిపాలనలో వారు అందించిన సహకారం అభినందనీయమని ప్రశంశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎస్పీ రాజు, గోపు గోపి, నాయకులు ఆయిటి కృష్ణ పాల్గొన్నారు.

# బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా,జూన్ 05,(విజన్ ఆంధ్ర); బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో, శుక్రవారం 2025-26 ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికానికి సంబంధించిన డిసిసి, డిఎల్ఆర్ సి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బ్యాంకుల సహకారం వల్ల ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని, దీనికోసం కావలసిన సహకారం బ్యాంకులు అందించాలన్నారు. పేద ప్రజల ఉన్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకులతో ముడిపడి ఉన్న ఎన్నో రకాల పథకాలు అమలు పరుస్తున్నాయని, ఇవి క్షేత్రస్థాయిలో అర్హులైన పేదలందరికీ అందివ్వాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందన్నారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తత, పొదుపు, బ్యాంకింగ్ పై అవగాహన కలిగేలా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వెనుకబడిన తరగతుల ప్రజలకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు, రైతులకు, వీధి వ్యాపారస్తులకు, విద్యార్థులకు అందించు రుణాల మంజూరులో ఆలస్యం చేయకూడదన్నారు. వివిధ రకాల రుణాలకు అర్హులైన దరఖాస్తుదారులకు సంబంధిత రుణాలను అందజేయాలన్నారు. అనంతరం 2026 - 27 వార్షిక రుణ ప్రణాళిక నివేదికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, ఎస్బిఐ, టిజీబి రీజినల్ మేనేజర్లు రంజన్ కుమార్, నవీన్ కుమార్, ఆర్బిఐ లింక్డ్ బ్యాంకింగ్ ఆఫీసర్ రాములు, ఇతర అధికారులు, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు "అమ్మ పేరు"తో మొక్కను నాటండి

**- జీజీహెచ్ లో మొక్కలు నాటిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...**



నిజామాబాద్ జూన్05:( విజన్ ఆంధ్ర) ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు ప్రతి ఒక్కరు అమ్మ పేరుతో మొక్కలు నాటాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా పిలుపునిచ్చారు. ప్రధానిగా మోదీ 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కేవలం మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మొక్కలు నాటడం అంటే రాబోయే తరాలకు ఇచ్చే గొప్ప ఆస్తి అని చెప్పారు. మొక్కలు నాటడం వల్ల ఆక్సిజన్ పుష్టిగా లభిస్తుంది అన్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుందని గుర్తు చేశారు. మిషన్ లైఫ్ పేరుతో ప్లాస్టిక్ వాడకం తగ్గించడం, నీటి సంరక్షణ పై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. పాఠశాలలు కళాశాలలో ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటడం విరివిగా కొనసాగుతుందన్నారు. ప్రధాని మోదీ ఇటీవల ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని పిలుపునివ్వడం జరిగిందని గుర్తు చేశారు. ఇప్పటికే అనేకమంది మోదీ పిలుపును పాటిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగమోహన్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, కార్పొరేటర్ లు నాగోల్ల లక్ష్మీనారాయణ, బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి, డాక్టర్ హరీష్ స్వామి, డాక్టర్ రాఘవేంద్ర చిద్రావార్, నాయకులు మాయావార్ కృష్ణ, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కోలేటి బర్త్‌డే సేవా కార్యక్రమాల సందడి!!

**- ఘనంగా అన్నదానం**

**- ప్రజాసేవలో దామోదర్ ఆదర్శం**

**- శుభాకాంక్షలు తెలిపిన ముఖ్య అతిధులు**

పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 5 (విజన్ ఆంధ్ర) : రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ కార్యదర్శి కోలేటి దామోదర్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తబిత ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం, కేక్ కటింగ్ నిర్వహించగా, ముఖ్య అతిథితులుగా రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కోలేటి సోదరులు శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గోదావరిఖనిలోని అమ్మ పరివార్‌లో నిరుపేదలకు అన్నదానం చేశారు. అతిథులు మాట్లాడుతూ, కోలేటి దామోదర్ ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తూ అందరి మన్ననలు పొందారని కొనియాడారు. ప్రజా సేవలో ఆయన చేసిన కృషి, పార్టీ పట్ల ఆయనకున్న అంకితభావం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది అని, సమాజ సేవను తన జీవిత లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగుతున్న దామోదర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నాను అని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో నిర్వాహకులు అన్వేష్, రామగుండం పట్టణ మహిళా సోదరీమణులు, 26వ డివిజన్ కార్పొరేటర్ సారయ్య నాయక్, మాడిశెట్టి రవీందర్, సబ్బు శంకర్, ముత్యాల శంకర్, గుజరాత్ రామకృష్ణ, జాపతి శ్రీనివాస్, వెంకటేష్, నిఖిల్, అరవింద్, సాగర్, సాయి చరణ్, అక్షిత్, వినయ్ తదితరులు పాల్గొని దామోదర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# నార్లాపూర్ ప్యాకేజ్ - 2,3 కాలువ సాగునీటి ప్రాజెక్టుల పనులను పరిశీలించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



కొల్లాపూర్ జూన్ 5 : (విజన్ ఆంధ్ర) : ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా రెండవ రోజైన శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, సహచర మంత్రివర్గ సభ్యులతో కలిసి పలు ప్రాజెక్టులను సందర్శించారు. ముందుగా ముఖ్యమంత్రి కొల్లాపూర్ లోని రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ ,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నివాసంలో అల్పాహారం తీసుకొన్నారు. అక్కడే స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇతరులు రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిశారు. అనంతరం పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం లోని ప్యాకేజీ -2,3 హెడ్ రెగ్యులటరీ వద్ద ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఇంజనీర్లు, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి ముఖ్యమంత్రికి పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని ప్యాకేజీ 2,3 ల గురించి వివరించారు. అనంతరం పి ఆర్ ఎల్ ఐ లో భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్ (అంజనగిరి రిజర్వాయర్ )డెలివరీ సిస్టర్ ను ముఖ్యమంత్రి పరిశీలించి అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. నార్లాపూర్ రిజర్వాయర్(అంజనగిరి రిజర్వాయర్) 6.4 టిఎంసిల సామర్థ్యం కలిగి ఉండగా ,మొత్తం 8 పంపుల ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు రూపొందించడం జరిగింది. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద మొత్తం 12 లక్షల 30 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు లక్ష్యంగా నిర్ణయించగా, శ్రీశైలం తిరుగుజలాల ద్వారా నీటిని ముందుగా నార్లాపూర్ రిజర్వాయర్ కు, డెలివరీ సిస్టన్స్ ద్వారా నీరు చేరుకున్న అనంతరం అక్కడి నుండి ఇదే ఎత్తిపోతల పథకంలోని పప్యాకేజీ4,5 లకు పంపించడం జరుగుతుంది. కాగా ఈ పథకం కింద డెలివరీ సిస్టంలో నాలుగు పంపుల ద్వారా ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోసేందుకు నాలుగు పంపులు సిద్ధంగా ఉండగా, మరో నాలుగు పంపులు కూడా నీటి ఎత్తివేతకు సిద్ధంగా ఉన్నాయి. ప్యాకేజీ -2,3 సుమారు 8.3 కిలోమీటర్లు,ప్యాకేజి -4,,16 కిలోమీటర్ల పొడవు కలిగి ఉంది. ప్యాకేజి -5 లో ఉన్న ఏదుల పంప్ హౌస్ కు నీటిని తరలించేందుకు డిజైన్ చేయడం జరిగింది. నార్లాపూర్ రిజర్వాయర్ నుండి ప్యాకేజీ 2 ,3, 4 ద్వారా ఏదుల పంప్ హౌస్ కు సాగునీటిని పంపించడంలో ఉన్న ఇబ్బందులు,ప్రస్తుత పరిస్థితులను రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా పరిశీలించారు. పూర్తి వివరాలను రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి అధికారులు రాష్ట్ర ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి ఎం జి కే ఎల్ ఐ పంప్ హౌస్ ను పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రొహిబిషన్ , ఎక్సైజ్ ,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పాడి పరిశ్రమ, క్రీడల అభివృద్ధి శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ శాసనసభ్యులు ఏన్నం శ్రీనివాస్ రెడ్డి ,రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి, ఇరిగేషన్ సెక్రటరీ శ్రీధర్, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్, ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ విజయభాస్కర్ రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు .




# ప్రైవేట్ ఫీజుల బాదుడు..!

## మోత మోగిస్తున్న ప్రైవేట్ స్కూల్ ఫీజులు..!

*ఒకప్పుడు నాణ్యమైన విద్య కోసం ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయించిన తల్లిదండ్రులు, నేడు వాటి ఫీజుల భారం మోయలేక ఆవేదన చెందుతున్నారు. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే ప్రైవేట్ పాఠశాలలు ఫీజులను పెంచడం ఆనవాయితీగా మారింది. గత ఏడాది చెల్లించిన ఫీజులతో పోలిస్తే ఈ ఏడాది వేల రూపాయల మేర పెంపు ఉండటంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.*

**- చదువు ఖరీదు...బోధన....?**

**- ఏడాదికేడాది ఫీజుల మోత**

**- చదువు కోసం అప్పులు... ఫీజుల కోసం తల్లిదండ్రుల అవస్థలు**

**- ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంల పేరుతో వేలాది రూపాయల అదనపు భారం**

**- నియంత్రణ లేను ప్రైవేట్ విద్యాసంస్థలు**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో జూన్ 06(విజన్ ఆంధ్ర)**

విద్యను హక్కుగా భావించాల్సిన పరిస్థితిలో, అది నేడు ఒక ఖరీదైన వస్తువుగా మారిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. చిన్న ఉద్యోగులు, కార్మికులు, ప్రైవేట్ ఉద్యోగులు, పెన్షనర్లు తమ పిల్లలకు మంచి విద్య అందించాలనే ఆశతో ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తుంటే, ప్రతి సంవత్సరం పెరుగుతున్న ఫీజులు వారి ఆర్థిక పరిస్థితిని కుదేలు చేస్తున్నాయి.

**ఫీజుల పేరిట భారీ వసూళ్లు**

ట్యూషన్ ఫీజు, అడ్మిషన్ ఫీజు, రీ-అడ్మిషన్ ఫీజు, బిల్డింగ్ ఫండ్, కంప్యూటర్ ఫీజు, యాక్టివిటీ ఫీజు, ట్రాన్స్‌పోర్ట్ ఫీజు, పరీక్ష ఫీజు, ప్రత్యేక కార్యక్రమాల ఫీజు అంటూ అనేక రకాల పేర్లతో తల్లిదండ్రుల నుంచి భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక విద్యార్థిపై ఏడాదికి లక్ష రూపాయలకు పైగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి కొన్నిచోట్ల నెలకొంది.

పిల్లలు చదివే తరగతి పెరిగే కొద్దీ ఫీజులు కూడా భారీగా పెరుగుతుండటంతో ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలు ఉన్న కుటుంబాల పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. ఒకవైపు ఇంటి అద్దెలు, విద్యుత్ బిల్లులు, నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతుంటే, మరోవైపు విద్యా ఖర్చులు కూడా అమాంతం పెరగడం తల్లిదండ్రులకు తలకుమించిన భారంగా మారింది.




కొంతమంది తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తుండగా, మరికొందరు బంగారం తాకట్టు పెట్టి పిల్లల చదువు కొనసాగిస్తున్నారు. ఇంకొందరు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను మార్చే పరిస్థితికి చేరుకుంటున్నారు.

**పుస్తకాలు, యూనిఫాంల పేరుతో అదనపు దోపిడీ**

ఫీజులతోనే ఆగకుండా పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, షూస్, టైలు, బెల్టులు, స్కూల్ బ్యాగులు కూడా పాఠశాలలు సూచించిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని కొన్ని విద్యాసంస్థలు ఒత్తిడి తెస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. మార్కెట్లో తక్కువ ధరలకు లభించే వస్తువులను అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఒకే తరగతి పుస్తకాల కోసం వేల రూపాయలు, యూనిఫాంల కోసం మరో కొన్ని వేల రూపాయలు ఖర్చు చేయాల్సి రావడం కుటుంబాలపై అదనపు భారాన్ని మోపుతోంది. ప్రతి ఏడాది కొత్త పుస్తకాలు, కొత్త యూనిఫాంలు తప్పనిసరి చేయడం వల్ల గతంలో కొనుగోలు చేసినవి ఉపయోగపడకుండా పోతున్నాయి.

**మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ప్రభావం**

మధ్యతరగతి కుటుంబాలు ప్రస్తుతం అత్యంత క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తే నాణ్యమైన విద్య అందుతుందా అనే సందేహం, ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తే ఫీజుల భారం అనే ద్వంద్వ సమస్యతో వారు సతమతమవుతున్నారు.

**నియంత్రణలో విఫలమవుతున్న వ్యవస్థ**

ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణకు చట్టాలు, నిబంధనలు ఉన్నప్పటికీ వాటి అమలులో లోపాలు కనిపిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఫీజుల పెంపుపై పర్యవేక్షణ లేకపోవడం, తల్లిదండ్రుల ఫిర్యాదులపై తగిన చర్యలు లేకపోవడం వల్ల పాఠశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విద్యా శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, ఫీజుల పెంపుపై స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. పుస్తకాలు, యూనిఫాంల విక్రయాల్లో పారదర్శకత తీసుకురావాలని, అనధికారిక వసూళ్లను అరికట్టాలని కోరుతున్నారు.

**విద్య హక్కు.. వ్యాపారం కాదు**

దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యా రంగం వ్యాపార ధోరణిలో నడవడం ఆందోళన కలిగించే అంశమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రతి చిన్నారి నాణ్యమైన విద్యను అందుకునే అవకాశం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, విద్యను లాభార్జన సాధనంగా మార్చకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఎంతటి త్యాగాలకైనా సిద్ధపడుతున్నా, అదే పరిస్థితిని ఆసరాగా చేసుకుని ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంల పేరుతో అధిక వసూళ్లు చేయడం సమంజసం కాదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

**- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,జూన్ 05, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, అడవులు, జల వనరుల సంరక్షణే ధ్యేయంగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవా వేడుకలను శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ లతో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు గీతాలాపన, స్థానిక కళాకారుల స్వాగత నృత్యం ప్రదర్శనలు ఆహ్వానితులను ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణాన్ని కాపాడటం అనేది కేవలం అటవీ శాఖ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ప్రభుత్వ శాఖతో పాటు జిల్లాలోని ప్రతి పౌరుడు ఇందులో భాగస్వాములు కావాలని అన్నారు. గతంలో ప్రతి ఇంటికి పంపిణీ చేసిన ఆరు మొక్కలను ఇంటి యజమానులు తమ కుటుంబ సభ్యుల్లా బాధ్యతగా సంరక్షించుకోవాలని సూచించారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో నాటిన మొక్కలు పెరిగేలా విధిగా సర్పంచులు, కౌన్సిలర్లు, స్థానిక అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి దుకాణదారుడు తమ షాపుల ముందు మొక్కలను పెంచాలని, పిల్లల్లో చిన్నతనం నుంచే పర్యావరణ స్పృహ పెంపొందించేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని కోరారు. అడవుల సంరక్షణతో పాటు స్థానిక గిరిజనులు, ప్రజల ఉపాధి మెరుగుపరచడమే తమ ప్రాధాన్యతని తెలిపారు. అటవీ సంరక్షణ సమితి ద్వారా లాక్ కల్టివేషన్ ను ప్రోత్సహిస్తూ అటవీ ఉత్పత్తుల ద్వారా స్థానికులకు పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే జిల్లాలోని చిత్తడి నేలలను గుర్తించి, నోటిఫై చేయడం ద్వారా పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేసి, స్థానిక యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు యోచిస్తున్నట్లు వెల్లడించారు. మన నీటి నిల్వలకు ప్రధాన ఆధారమైన చెరువులు కబ్జాల బారిన పడకుండా స్థానిక నాయకులు, ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండి కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వ్యవసాయ రంగంలో పంట కోత అనంతరం మిగిలిన వ్యర్థాలను పొలాల్లో కాల్చడంపై కఠిన హెచ్చరికలు జారీ చేశారు. వ్యర్థాలను దహనం చేయడం వల్ల గాలి పూర్తిగా కాలుష్యమవడమే కాకుండా, భూమిలోని మిత్రపురుగులు చనిపోయి భూసారం తీవ్రంగా దెబ్బతింటుందని, పక్క రైతుల పంటలకు కూడా ప్రమాదకరంగా మారుతుందని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి పంట వ్యర్థాలను తగులబెడితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. రైతులు ఈ వ్యర్థాలను కాల్చడానికి ప్రత్యామ్నాయంగా ఆధునిక యంత్రాల ద్వారా భూమిలోనే కలియదున్నుకోవాలని లేదా పశువులకు మేతగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. భూగర్భ జలాలు, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగంపై జిల్లా ప్రజలు దృష్టి పెట్టాలని కోరారు. రాబోయే కాలంలో బోర్లు ఎండిపోకుండా ఉండాలంటే ఇళ్ల వద్ద, బోర్ల వద్ద తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, ఇందుకు ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే, కరెంటు బిల్లుల భారం తగ్గించుకుంటూ శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ పథకాలైన పిఎం సూర్య ఘర్ యోజన, కుసుమ్ యోజనలను సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరూ సోలార్ ప్యానెల్స్, రూఫ్ టాప్ సిస్టమ్స్ అమర్చుకోవాలని పిలుపునిచ్చారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం రూపొందించిన ప్రత్యేక పోస్టర్లను ఈ సందర్భంగా విడుదల చేసిన కలెక్టర్..



జిల్లాలోని జీవవైవిధ్య ప్రాంతాల ప్రాముఖ్యతను విద్యార్థులు, ప్రజలు క్షేత్రస్థాయిలో తెలుసుకునేలా 'వన దర్శనం' లాంటి అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని వెల్లడించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, దుకాణదారుడు తమ షాపుల ముందు మొక్కలను పెంచాలని, పిల్లల్లో చిన్నతనం నుంచే పర్యావరణ స్పృహ పెంపొందించేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని కోరారు. అడవుల సంరక్షణతో పాటు స్థానిక గిరిజనులు, ప్రజల ఉపాధి మెరుగుపరచడమే తమ ప్రాధాన్యతని తెలిపారు. ఇంట్లో, మార్కెట్, ఇతర పనుల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ అధికారి పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా పర్యవరణ కాలుష్యం జరుగుతున్న తీరును, నియంత్రణకు చేపట్టాల్సిన అంశాలను వివరించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న సర్పంచ్ లకు, అధికారులకు, ప్రముఖులకు ప్రశంస పత్రాలను కలెక్టర్, ఎస్పీ, అటవీ అధికారి, అతిథులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎక్సిబిషన్ ను, కాలుష్య నియంత్రణ మండలి స్టాల్ లను కలెక్టర్, ఎస్పీ కలిసి సందర్శించారు. అంతకుముందు అటవీశాఖ యొక్క పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పోస్టర్ ను, తెలుగు ప్రభ బుక్ లెట్ ను ఇతర అతిథులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాదు మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జడ్పీ సీఈఓ రవి, డిఆర్డీఓ రవీందర్, డిపిఆర్ఓ ఇ.విష్ణువర్ధన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, డివైఎస్ఓ శ్రీనివాస్, పశు సంవర్ధక శాఖ అధికారి రామరావు, ఎఫ్డిఓ అరవింద్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు. విద్యార్థులు, అటవీ, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల పేరుతో లక్షల రూపాయల వసూళ్లు..?

- వంద మందికి పైగా నిరుద్యోగుల నుంచి డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు
- రూ.20 లక్షలకుపైగా వసూళ్లు చేసినట్లు బాధితుల ఫిర్యాదు
- సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్..!

కాప్రా/జూన్ 5 (విజన్ ఆంధ్ర ప్రతినిధి ): ఉద్యోగాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చి పలువురు నిరుద్యోగుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు వెలువడుతున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంపై బాధితులు వివిధ జిల్లాల్లో పోలీసులకు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. బాధితుల కథనం ప్రకారం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన కొమ్ము కార్తీక్, మందల వెంకటేష్, గజ్జి శేఖర్ యాదవ్, భువనగిరి జిల్లాకు చెందిన బాబీ వేణు మాధవ్, నల్గొండ జిల్లాకు చెందిన పల్లె వెంకన్న తదితరులు ఓ ప్రైవేటు సంస్థలో భద్రతా సిబ్బంది ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నిరుద్యోగుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉద్యోగంలో చేరిన తర్వాత రెండు నుంచి మూడు సంవత్సరాల వరకు ఉద్యోగ భద్రత ఉంటుందని హామీ ఇవ్వడంతో పలువురు అప్పులు చేసి డబ్బులు చెల్లించినట్లు బాధితులు తెలిపారు. అనంతరం ఉద్యోగాల విషయంలో స్పష్టత లేకపోవడం, సంబంధిత వ్యక్తులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో అనుమానాలు వ్యక్తమైనట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సంస్థ యాజమాన్యానికి సమాచారం అందడంతో అంతర్గతంగా విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. బాధితుల నుంచి వరుస ఫిర్యాదులు రావడంతో విషయం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. వంద మందికి పైగా నిరుద్యోగుల నుంచి రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వసూలు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. తమ వద్ద ఉన్న రసీదులు, వీడియోలు, ఫోన్ సంభాషణల వివరాలు తదితర ఆధారాలను పోలీసులకు, సంస్థ యాజమాన్యానికి అందజేసినట్లు తెలిపారు. నల్గొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కూడా ఈ వ్యవహారానికి సంబంధించి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. బాధ్యులపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగాల పేరుతో డబ్బులు చెల్లించే ముందు సంబంధిత సంస్థల నియామక ప్రక్రియ, అధికారిక పత్రాలు, సంస్థ విశ్వసనీయతను తప్పనిసరిగా పరిశీలించాలని యాజమాన్యం సూచించింది. ఇలాంటి మోసాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని కోరింది.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుంది

- రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య.

నిర్మల్ జిల్లా,జూన్ 05,(విజన్ ఆంధ్ర); దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో, దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ, దివ్యాంగులు తమ సొంత కాళ్ల మీద నిలబడేలా ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తుందని అన్నారు. దివ్యాంగుల కొరకు రాష్ట్రంలో ప్రత్యేకంగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిందన్నారు. 11 వేల దివ్యాంగ పొదుపు సంఘాల్లో దాదాపు 80 వేల మంది దివ్యాంగులు లబ్ధిపొందుతుందన్నారు.



దివ్యాంగుల సహాయ ఉపకరణాల పంపిణీ విషయంలో ఉన్న కఠిన నిబంధనలు సవరించామని, దీని ద్వారా ఎక్కువ మంది దివ్యాంగులు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఆరు సంవత్సరాల లోపు దివ్యాంగుల ఆరోగ్యం మెరుగు కోసం బాల భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, దివ్యాంగుల ఉన్నతికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ఎన్నో అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. ఈ అవకాశాలు ఉపయోగించుకొని, దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. దివ్యాంగుల కొరకు స్కూటీలు, అడ్వాన్స్ చక్రాల కుర్చీలు, ల్యాప్ టాప్ లు, స్మార్ట్ ఫోన్లు, వినికిడి యంత్రాలు, తదితర పరికరాలు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని అన్నారు. వీటి ద్వారా దివ్యాంగులకు ఎంతో మేలు కలుగుతుందని చెప్పారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అర్హులైన పలువురు దివ్యాంగులకు కార్పొరేషన్ చైర్మన్, కలెక్టర్ లు ల్యాప్ టాప్ లు, స్మార్ట్ ఫోన్ లు, అడ్వాన్స్ చక్రాల కుర్చీలు అందించారు. అనంతరం కలెక్టర్ ప్రాంగణంలో కార్పొరేషన్ చైర్మన్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ లు కలిసి 38 మంది దివ్యాంగ లబ్ధిదారులకు ప్రత్యేక స్కూటీలు అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ అధికారి వినూత్న, ఇతర అధికారులు, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనం పెంపు సామాజిక బాధ్యతే కాదు వ్యక్తిగత బాధ్యత కూడా

- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప,జూన్ 5 (విజన్ ఆంధ్ర) మొక్కల పెంపకం, పచ్చదనం పరిరక్షణ వంటి కార్యక్రమాలను.సామాజిక బాధ్యతగానే కాకుండా వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం – 2026 నుపురస్కరించుకుని కడప నగర వనంలో జిల్లా అటవీశాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనమహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి విచ్చేశారు. ఈ సందర్భంగా.జిల్లా కలెక్టర్, డిఎఫ్ఓ లు పలువురు అధికారులు, విద్యార్థులు, మహిళలతో కలిసి వారికి కేటాయించిన స్థలంలో అడవి జాతి మొక్కలు నాటి 'హరితాంధ్ర ప్రదేశ్' లక్ష్య సాధనలోభాగస్వాముల య్యారు. అనంతరం సీడ్ బాల్స్ విశిష్టతను తెలుసుకుని డ్రోన్ ద్వారా సీడ్ బాల్స్ విసిరే కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ స్వచ్ఛందంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రకృతి తల్లిలాంటిదని, ప్రకృతికి ప్రాణాధారం అయిన చెట్లు ప్రాణికోటికి ప్రాణాధారం అని మొక్కల విశిష్టతను క్షుణ్ణంగా తెలియజేశారు. పర్యావరణ పరంగా గతంలో జరిగిన నష్టాలను పూరించే దిశగా ఈ తరం యువత సమాజాన్ని పునర్నిర్మించాలని పిలుపునిచ్చారు. వాతావరణ సమతుల్యతలో ప్రతి జీవికి ఒక్కో పాత్ర ఉందన్నారు. ప్రస్తుతం మనకు అందుబాటు లో ఉన్న



ఆధునిక సాంకేతికత ను సద్వినియోగం చేసుకుంటూ.డ్రోన్ ద్వారా వ్యవసాయ, సామాజిక అటవీ అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలు ప్రత్యేక శ్రద్ధ తో రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దే క్రమంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఎంతో ప్రాముఖ్యతతో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం గర్వించదగ్గ విషయం అన్నారు. హరితాంధ్ర ప్రదేశ్ సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు ప్రతి ఇల్లు, ప్రతీ ఊరూ పచ్చదనంతో సింగారిద్దామన్నారు. రాష్ట్రాన్ని 50% పచ్చదనంతో నింపాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు.. జూన్ 5 పర్యావరణ దినోత్సవం రోజు నుండి వచ్చే కార్తీక మాసం వరకు వర్షాలు విరివిగా కురిసే సీజన్ కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం విరివిగా మొక్కలను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. అదే స్ఫూర్తితో.మన జిల్లాలో డ్రోన్ సహకారంతో దాదాపు 1000 హెక్టార్లలో సీడ్ బాల్స్ త్రోయింగ్ ద్వారా విరివిగా మొక్కలను నాటే లక్ష్యంను నిర్దేశించుకోవడం జరిగిందన్నారు. సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ.. తమ చుట్టూ వున్న పరిసరాలను పచ్చదనంతో నింపాలని ఆయన ఆకాంక్షించారు.పర్యావరణం అనేది మన ఇంటితో మొదలై సామాజికమవుతుందన్నారు. వాతావరణ సమతుల్యతను కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. మనతో పాటు మన చుట్టూ ఉన్న జీవరాశులను కాపాడుకోవడంలో వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలన్నారు. డిఎఫ్ఓ వినీత్ కుమార్ మాట్లాడుతూ జిల్లా విస్తీర్ణంలో అడవులు 33% విస్తరించి ఉన్నాయని, అటవీ విస్తీర్ణంలో జిల్లా అగ్రస్థానంలో ఉందన్నారు.జిల్లాలో పచ్చదనాన్ని మరింత రెట్టింపు చేసేందుకు సామాజిక అడవుల పెంపకం ద్వారా, గ్రామీణ ఉపాధి హామీ పథకం, స్వయం సహాయక సంఘాల మహిళల భాగస్వామ్యంతో ప్రజలకు ఓ వైపు ఉపాధి కల్పిస్తూనే.. పచ్చదనాన్ని పెంచడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం చేపట్టే వనమహోత్సవం ద్వారా జిల్లాలో విస్తృతంగా మొక్కలు నాటి.. అటవీ విస్తీర్ణాన్ని 50% కు పెంచేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారికి వివిధ రకాల మొక్కలను పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మురళీ, స్వాడ్ డిఎఫ్ఓ రాజశేఖర్, కేఎంసి అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం,డీఏవో సుబ్రహ్మణ్యేశ్వర రావు, డిసిహెచ్ఎస్ డా. హిమదేవి. అటవీశాఖ, డ్వామా, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, మహిళలు, విద్యార్థులు తదితరుల పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 3కె వాక్

- కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటిన న్యాయమూర్తులు, న్యాయవాదులు



కాప్రా/జూన్ 05(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2026 సందర్భంగా తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ వారి ఆదేశాల మేరకు శుక్రవారం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా 3కె వాక్ నిర్వహించారు. జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వి. బాల భాస్కర్ రావు ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ప్రపంచ పర్యావరణ దినోత్సవం యొక్క అధికారిక థీమ్ "ప్రకృతి స్ఫూర్తితో.. వాతావరణం కోసం.. మన భవిష్యత్తు కోసం" అంటూ కోర్టు ఆవరణలో వివిధ రకాలైన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రాముఖ్యతను న్యాయమూర్తులు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వి. బాల భాస్కర్ రావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పర్యావరణ హిత జీవనశైలి, ప్రకృతి సంరక్షణ, కాలుష్య నియంత్రణ వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి సట్టు రవీందర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాల కోసం పచ్చదనాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని అధికారులు ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి. రత్నయ్యతో పాటు పలువురు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, న్యాయ సేవ అధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశం

- బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం, ఓటరు జాబితా సవరణ పై దిశ నిర్దేశం.

అందోల్ /సంగారెడ్డి జూన్ 05(విజన్ ఆంధ్ర ): వట్ పల్లి మండల కేంద్రంలో అందోల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో అందోల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, ఓటరు జాబితా సవరణ పైఅందోల్ నియోజకవర్గం అన్ని మాడలాల ముఖ్య నాయకులతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ కార్యమానికి ముఖ్య అతిథిగా అందోల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కోర్డినేటర్ పట్నం మాణిక్యం విచ్చేసి దిశ నిర్దేశం చేశారు.ఈ సందర్బంగా క్రాంతి కిరణ్,అందోల్ కోర్డినేటర్ పట్నం మాణిక్యం మాట్లాడుతు బిఆర్ఎస్ పార్టీకి నిబద్ధతగా,పార్టీ ఆదేశాలను పాటిస్తూ పార్టీ గెలుపుకు కృషిచేసే వారికీ మాత్రమే బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వన్ని ఇవ్వాలని,ప్రతి బూత్ స్థాయిలో పార్టీని



బలోపేతం చేయాలని పిలునిచ్చారు.రానున్న రోజుల్లో పార్టీ కోసం పనిచేసిన వారికీ ప్రాముఖ్యత ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పట్లోళ్ళ జైపాల్ రెడ్డి, నారాయణ, సాయి కుమార్,లింగా గౌడ్,వీరారెడ్డి,బుచ్చయ్య, భక్తుల వీరప్ప, విట్టల్,నర్సింలు, విజయ్ కుమార్, శివ కుమార్, చాపల వెంకటేశం,వెంకట్ రెడ్డి,శివాజీ రావు,శశి కుమార్,సుంకే రమేష్,రాజు యాదవ్, అమర్ సింహ రెడ్డి, అశోక్ గౌడ్,శ్రీనివాస్ గౌడ్, ఘని,మధు, ప్రకాశం,అన్ని మండలాల బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు,పార్టీ సీనియర్ నాయకులు,యువ నాయకులు,సోషల్ మీడియా వారియర్స్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అవ్వాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ జిల్లా,జూన్ 05,(విజన్ ఆంధ్ర); పర్యావరణ పరిరక్షణలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు. "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" పర్యావరణ వారోత్సవాలు, అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ వేడుకలు శుక్రవారం మామడ మండలం ఆరేపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అధికారులందరికీ పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ అనేది మనందరి బాధ్యత అని తెలిపారు. పర్యావరణ కాలుష్యం కారణంగా నేడు పర్యావరణ సమతుల్యత దెబ్బతిని వాతావరణ పరిస్థితుల్లో ప్రమాదకరమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడాలన్నారు. పుట్టినరోజు నాడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వివరించారు. రైతులు పంట వ్యర్థాలను కాల్చడం వల్ల కూడా పర్యావరణానికి ఎంతో హాని కలుగుతుందని తెలిపారు. రైతులు పంట వ్యర్థాలకు నిప్పు పెట్టవద్దని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడటమే కాకుండా ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు కారణం అవుతుందని తెలిపారు. ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయ



మార్గాలను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ అనేది తమ తమ ఇంటి నుంచే ప్రారంభం అవ్వాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని ప్రతి ఏడాది అడవులు దగ్ధమవుతున్నాయని, దీని ద్వారా పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని అన్నారు. అడవులు కాలిపోకుండా ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ప్రతిజ్ఞ చేశారు. కళాజాత బృందాలు పర్యావరణం పరిరక్షణపై అవగాహన కలిగేలా వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కలెక్టర్, ఇతర అధికారులు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, సీనియర్ సివిల్ జడ్జి రవీందర్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఎఫ్డిఓ నాగిని బాను, ఇతర అధికారులు, గ్రామస్థులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లోని మల్లారం అడవిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు



నిజామాబాద్ జూన్05:( విజన్ ఆంధ్ర) : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, నిజామాబాద్ జిల్లా అటవీ అధికారి శ్రీ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ఐఎఫ్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించబడింది. కాలుష్య నియంత్రణ మండలి నోడల్ అధికారి, స్వచ్ఛంద సంస్థలు (చీ+ూలు), ప్రజా ప్రతినిధులు మరియు స్థానిక సంఘాల సమన్వయంతో మల్లారం అడవిలో ఈ కార్యక్రమం జరిగింది. మల్లారం మరియు గాంధీనగర్ గ్రామ సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ, అటవీకరణ మరియు సహజ వనరుల రక్షణ యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. పాల్గొన్నవారు అటవీ ప్రాంతంలో మొక్కలు నాటి, పచ్చని మరియు ఆరోగ్యకరమైన పర్యావరణం కోసం వాటిని రక్షించి, పోషిస్తామని ప్రతిజ్ఞ చేశారు. భవిష్యత్ తరాలకు సుస్థిర అభివృద్ధి మరియు పర్యావరణ సమతుల్యతను నిర్ధారించడానికి, మొక్కలు నాటడం మరియు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని శ్రీ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ఐఎఫ్ఎస్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ప్రైమరీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం!!

- రామగుండంలో 8 ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలు
- ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల నియామకం
- జూన్ 9 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఎంఈఓ జింక మల్లేష్




పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 5 (విజన్ ఆంధ్ర) : రామగుండం మండలంలోని 8 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి జింక మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని పి.కె.రామయ్య కాలనీ, మల్కాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల పోస్టుల కోసం ఎన్‌టీపీసీ జడ్‌పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులకు, మార్కండేయ కాలనీ, మల్లిఖార్జున్‌నగర్, గాంధీ పార్క్, విద్యుత్‌నగర్, రామగుండం, ఆటోనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల పోస్టుల కోసం గాంధీ పార్క్ జడ్‌పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులకు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులకు ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హతతో పాటు ఆధార్ కార్డు ద్వారా స్థానిక నివాస ధ్రువీకరణ కలిగి ఉండాలని, ఆయా పోస్టులకు ఏడో తరగతి ఉత్తీర్ణతతో పాటు స్థానిక నివాస ధ్రువీకరణ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 9వ తేదీ సాయంత్రం లోపు సంబంధిత కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు అందజేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభమవుతున్న ప్రీ-ప్రైమరీ తరగతుల నిర్వహణకు ఈ నియామకాలు కీలకంగా మారనున్నాయని మండల విద్యాశాఖ అధికారి తెలిపారు.

# ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సాకారంతో పిప్పలదరి గ్రామంలో తీరిన నీటి కష్టాలు

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కి కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు



బోథ్ ,జూన్ 05, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పిప్పల దరి గ్రామంలో నీటి సమస్య ఉందని గ్రామస్తులు మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి ద్వారా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గ్రామంలో బోరు వేయించి గ్రామస్తుల నీటి కష్టాలు తీర్చినందుకు గ్రామస్తులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బోర్వెల్ వెయిస్తున్న స్థానిక సర్పంచ్ మెస్రం అనసూయ, ఉప సర్పంచ్ బండారి స్వామి గ్రామస్తులు తదితరులు ఉన్నారు

# టెక్‌తో టఫ్ పోలీసింగ్..!!

- దర్యాప్తు నైపుణ్యాల పెంపునకు ప్రత్యేక శిక్షణ
- డిజిటల్ ట్రాక్.. క్రైమ్‌కు షాక్
- సైబర్, ఫోరెన్సిక్ అంశాలపై అవగాహన
- టెక్నాలజీపై పట్టు అవసరం
- స్మార్ట్ ఇన్వెస్టిగేషన్‌దే భవిష్యత్
- అడిషనల్ డీసీపీ అడ్మిన్ కే.శ్రీనివాస్



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 5 (విజన్ ఆంధ్ర) : రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పోలీసు అధికారుల దర్యాప్తు నైపుణ్యాలను మరింత మెరుగుపరచేందుకు శుక్రవారం ప్రత్యేక సాంకేతిక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) కే. శ్రీనివాస్ అధ్యక్షతన పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లకు చెందిన సీఐలు, ఎస్సైలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. నేరాల స్వరూపం రోజురోజుకూ మారుతున్న నేపథ్యంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి కేసులను వేగంగా ఛేదించేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది. "టెక్ టీమ్ వర్టికల్" అంశంపై నిర్వహించిన ఈ శిక్షణలో సైబర్ నేరాల దర్యాప్తు, డిజిటల్ సాక్ష్యాల సేకరణ, ఫోరెన్సిక్ ఆధారాల పరిరక్షణ, తాజా చట్టాలు, న్యాయపరమైన మార్పులపై అధికారులకు అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, సీసీటీవీ ఫుటేజీలను శాస్త్రీయ పద్ధతుల్లో సేకరించడం, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా నేరాలను గుర్తించడం వంటి అంశాలపై ప్రాక్టికల్ శిక్షణ అందించారు. అదనంగా నాణ్యమైన చార్జిషీట్ల తయారీ, కోర్టులో బలమైన సాక్ష్యాధారాల సమర్పణ, డేటా నిర్వహణ, సైబర్ భద్రత, డిజిటల్ కమ్యూనికేషన్ వ్యవస్థల వినియోగంపై కూడా సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించినప్పుడే ఆధునిక నేరాలను సమర్థవంతంగా ఎదుర్కోగలమని తెలిపారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడంతో పాటు నిందితులకు కోర్టుల్లో తగిన శిక్షలు పడేలా దర్యాప్తు ప్రమాణాలు పెంచడమే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. సాంకేతికత ఆధారిత పోలీసింగ్ ద్వారా ప్రజల భద్రత, పారదర్శక దర్యాప్తు, సమర్థవంతమైన సేవలందింపు మరింత బలోపేతం అవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ పోలీసు వ్యవస్థను మరింత ఆధునికంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



# నూతనంగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



బద్వేలు, జూన్ 5 (విజన్ ఆంధ్ర) బద్వేలు నియోజకవర్గ పర్యటనలో భాగంగా బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని చెన్నకేశం పల్లె జడ్పీ హైస్కూల్, గోపవరం జిల్లా పరిషత్ హైస్కూల్, అట్లూరు మండలంలోని వెంకటాపురం జడ్పీ హైస్కూల్, సిద్ధవటం జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న సెంట్రలైజెడ్ స్మార్ట్ కిచెన్ బిల్డింగుల నిర్మాణ పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ సర్కారి పరిశీలించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కిచెన్ చెడ్ల నిర్మాణ పనులు చేపడుతున్న ఇంజనీరింగ్ అధికారులకు సెంట్రలైజ్డ్ మోడల్ కిషన్ షెడ్ నిర్మాణ పనులపై పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది అనంతరం పాఠశాలల పునః ప్రారంభం నాటికి స్మార్ట్ కిచెన్ షెడ్లను నిర్వహణలోకి తీసుకురావాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు ఈ కార్యక్రమంలో బద్వేల్ రెవిన్యూ డివిజనల్ అధికారి చంద్రమోహన్ పంచాయతి రాజు ఏఈ చిట్టిబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు

## జన్మదిన వేడుకల సందర్భంగా శ్రీ భీమేశ్వర స్వామి దర్శించుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



వేములవాడ (విజన్ ఆంధ్ర బ్యూరో), జూన్ 5: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారిని చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు శ్రీ మేడిపల్లి సత్యం గారు తన జన్మదిన సందర్భంగా శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గారికి ఆలయ అర్చకులు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజల సంక్షేమం, సుభిక్షం కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ మండపంలో వేద పండితులు ఎమ్మెల్యేకు వేదాశీర్వచనం అందజేయగా, తీర్థ ప్రసాదాలు సమర్పించారు. ఆలయ ప్రోటోకాల్ పర్యవేక్షకులు గౌరీభట్ల శ్రీనివాస్ శర్మ స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని అందజేసి సత్కరించారు. జన్మదిన వేడుకల సందర్భంగా స్వామివారి ఆశీస్సులు పొందిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గారు ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు.

## ప్రకృతిని కాపాడకపోతే మనిషికి మనుగడే లేదు

**- ఎంపి.డి కే.అరుణ**



నారాయణపేట, జూన్ 5 (విజన్ ఆంధ్ర) : మన జీవనానికి ఆధారమైన గాలి, నీరు, నేల, చెట్లు జీవ వైవిధ్యాన్ని పరిరక్షిస్తేనే భవిష్యత్తు సురక్షితమని మనిషి మనుగడ సాధ్యమని పాలమూరు ఎంపీ డి కే అరుణ అన్నారు. శుక్రవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా నారాయణపేట మండలం సింగారం చౌరస్తా సమీపంలో ప్రధాని 12 ఏళ్ల విశ్వాసం. అభివృద్ధి,ప్రజా సంక్షేమం ప్రచార సేవా కమిటీ జిల్లా కన్వీనర్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీ డి కే అరుణ మాట్లాడుతూ ప్రకృతి పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, అడవుల నరికివేత, వాతావరణ మార్పులు మానవాళి భవిష్యత్తుకు సవాళ్లుగా మారుతున్నా యనీ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరం తల్లి పేరున కనీసం ఒక మొక్కను నాటి, దాన్ని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పరిశుభ్రమైన పచ్చని వాతావరణ నిర్మాణానికి కృషి చేద్దామని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు కే.రతంగ్ పాండురెడ్డి ,ప్రతాప్ రెడ్డి,జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్,మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్, వైస్ చైర్ పర్సన్ మంజుల జి ఆర్ రెడ్డి ,ప్రజాప్రతినిధులు, జిల్లా,మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గన్ పార్క్‌లో మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



జగిత్యాల, జూన్ 5 (విజన్ ఆంధ్ర జిల్లా బ్యూరో):ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణ కేంద్రంలోని గన్ పార్క్‌లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూపర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన మరియు హరిత వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కలెక్టర్ సూచించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్న కలెక్టర్, మొక్కల పెంపకం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు జీవ వైవిధ్యాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. జిల్లాలో హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## టీ పొడిలో కల్తీపై అప్రమత్తంగా ఉండాలి

**-టీ బోర్డ్ ఆఫ్ ఇండియా, ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచనలు**

హైదరాబాద్, జూన్ 05 (విజన్ ఆంధ్ర) : టీ పొడిలో కల్తీపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని టీ బోర్డ్ ఆఫ్ ఇండియా, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సూచించాయి. టీ ఆకుల రూపం, రంగు, బరువును కృత్రిమంగా మెరుగు పరచేందుకు బిస్మార్క్ బ్రౌన్, పొటాషియం బ్లూ, ఇండిగో వంటి అనుమతిలేని రంగులు కలపడం ఆరోగ్యానికి హానికరమని పేర్కొన్నాయి. చల్లటి నీటిలో లేదా తడి ఫిల్టర్ పేపర్‌పై టీ ఆకులను ఉంచి పరీక్షించడం ద్వారా కల్తీని గుర్తించవచ్చని తెలిపాయి. నిజమైన టీ రంగును నెమ్మదిగా విడుదల చేస్తే, కల్తీ టీ వెంటనే రంగు వదులుతుందని వివరించాయి. ప్యాకెట్ లేకుండా విక్రయించే టీతో పోలిస్తే, నాణ్యత నియంత్రణ ప్రమాణాలు పాటించే గుర్తింపు పొందిన బ్రాండ్ల ప్యాక్ చేసిన టీని కొనుగోలు చేయడం సురక్షితమని సూచించాయి. వినియోగదారులు నమ్మకమైన విక్రేతల నుంచి మాత్రమే టీ పొడిని కొనుగోలు చేసి, నాణ్యత ధ్రువీకరణలను పరిశీలించాలని అధికారులు సూచించారు.

## వేగంగా ధాన్యం కొనుగోలు జరగాలి

**- పక్కగా జనగణన జరగాలి : జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



విజన్ ఆంధ్ర మెదక్ బ్యూరో : వేగంగా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నర్సింగ్ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని , జన గణనను డిఎంసిఎస్, డిఎస్ఓ, ఆర్డిఓ, తాహాసిల్దార్, జన గణన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. అత్యంత వేగంగా ధాన్యం కొనుగోలు జరగాలని, ధాన్యం పూర్తి అయిన కేంద్రాల్లోని సిబ్బంది, వాహనాలు , వస్తు సామాగ్రిని, హమాలిలను ధాన్యం నిలువ ఉన్న కేంద్రాల్లో పని చేయించాలన్నారు. మిల్లులో అతి త్వరగా ధాన్యం అన్లోడింగ్ జరగాలని అధికారులను ఆదేశించారు. జన గణన పక్కగా చేయాలన్నారు. జన గణన లో ప్రజల యొక్క సమాచారం పక్కగా నమోదు చేసి ఆన్లైన్ ఆప్ లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన గ్రామాలకు మంత్రి సీతక్క భరోసా

# రూ 70,80 కోట్లతో అభివృద్ధి పనులు

**- తాడ్వాయిలో ప్రజా దర్బార్‌లో 10 గ్రామాలకు చెందిన 200+ దరఖాస్తులు స్వీకరణ**



తాడ్వాయి, ములుగు జూన్ 05, విజన్ ఆంధ్ర ప్రతినిధి: గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. ప్రజల వద్దకు పాలన తీసుకెళ్లే "99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళిక"లో భాగంగా శుక్రవారం తాడ్వాయి మండలం పోచాపూర్ ఆశ్రమ పాఠశాల, లింగాల గ్రామపంచాయతీ ఆవరణలో ప్రత్యేక ప్రజా దర్బార్‌లు నిర్వహించి 10 గ్రామాల ప్రజల నుంచి 200కి పైగా దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి పోచాపూర్‌లో బిట్టుపల్లి, బంధాల, పోచాపూర్, నర్సాపూర్ పి.ఎల్., బొల్లెపల్లి గ్రామాల ప్రజల నుంచి, లింగాల వద్ద ఒడ్డుగూడెం, లింగాల, బోటి లింగాల, లవ్వల, కోడిశాల గ్రామాల ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు.

**రూ.70 - 80, కోట్లతో రోడ్లు, చెరువుల అభివృద్ధి**

ఏజెన్సీ ప్రాంతాల మౌలిక సదుపాయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు. పోచాపూర్‌నర్సాపూర్-అల్లిగూడెం ప్రధాన రహదారి అభివృద్ధితో పాటు పలు అంతర్గత రహదారుల నిర్మాణ పనులు చేపట్టామని చెప్పారు. రహదారులకు రూ.11 కోట్లు, చెక్‌డ్యామ్‌లు, చెరువులు, వాగుల అభివృద్ధికి సుమారు రూ.70 నుంచి రూ.80 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. గతంలో అటవీ అనుమతుల కారణంగా పెండింగ్‌లో ఉన్న రహదారి పనులకు అన్ని అనుమతులు సాధించి పనులను వేగవంతం చేశామన్నారు.

గ్రామాలకు రెండు పంటలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా చెరువులు, కుంటల పునరుద్ధరణ చేపడతామని, ఇందుకు రైతుల సహకారం కావాలని కోరారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి లింగాల ప్రాంతంలో నూతన 33/11 కెవి సబ్‌స్టేషన్ మంజూరు చేసి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

**మహిళలకు ఉపాధి కేంద్రాలు**

మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సీతక్క చెప్పారు. మూడు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన ఈ ఏజెన్సీ ప్రాంతంలో మహిళా సంఘాలకు ఉపాధి కల్పించే ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటు అవకాశాలను పరిశీలిస్తున్నామని ప్రకటించారు. చేపల పెంపకం, పచ్చళ్లు, అటవీ ఉత్పత్తుల విక్రయాలకు శిక్షణ, ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. గిరిజన మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు.

**ఇందిరమ్మ ఇళ్లు, ఆర్ఓఎఫ్ఆర్ హామీ**

ములుగు నియోజకవర్గంలో ఇప్పటికే 5 వేలకుపైగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, రెండో విడతలో మరో 2 వేల ఇళ్లను కూడా ప్రభుత్వం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో గృహ అవసరాలు అధికంగా ఉన్నందున ఐటీడీఏ పరిధిలో మరిన్ని ఇళ్లు మంజూరు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు కలిగిన రైతులకు సాగునీటి అవసరాల కోసం బోర్లకు అనుమతులు కల్పించే అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని తెలిపారు. ప్రజా దర్బార్‌లో అందిన ప్రతి దరఖాస్తును అధికారులతో సమీక్షించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు.

**రూ.11 కోట్ల పనులకు శంకుస్థాపన**

అంతకుముందు మంత్రి సీతక్క, కలెక్టర్ హేమంత్ బందాల గ్రామంలో రూ.10 లక్షల నిధులతో నిర్మించిన అంతర్గత రహదారిని, రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. బొల్లెపల్లి నుంచి పోచాపూర్ వరకు రూ.5 కోట్లతో, పోచాపూర్ నుంచి అల్లిగూడెం వయా నర్సాపూర్ వరకు రూ.6 కోట్లతో చేపట్టిన బీటీ రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం వివిధ గ్రామాల లబ్ధిదారులకు 20 కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.

**ప్రతి సోమవారం గ్రామాల్లో ప్రజా దర్బార్...**

కలెక్టర్ హేమంత్ మాట్లాడుతూ, దూర ప్రాంతాల ప్రజలు కలెక్టరేట్‌కు రాకుండా గ్రామాల వద్దకే ప్రజావాణి తీసుకెళ్లేందుకు రెండు-మూడు గ్రామపంచాయతీలను సమూహంగా తీసుకుని ప్రజా దర్బార్‌లు నిర్వహిస్తున్నామన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 60% లేబర్, 40% మెటీరియల్ నిబంధనలు పాటించి గ్రామాల్లో సీసీ రోడ్లు, పంచాయతీ భవనాల వంటి శాశ్వత ఆస్తులు సృష్టించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్, సంపత్ రావు, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ములుగు జిల్లా 64% అడవులతో రాష్ట్రంలోనే అగ్రస్థానం

**- పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం: మంత్రి సీతక్క**



ములుగుజూన్ 05, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ములుగు జిల్లా ఇంచర్ల ఏకో పార్క్‌లో శుక్రవారం జరిగిన "99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళిక" కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క, ముఖ్య అటవీ సంరక్షణాధికారి బి. ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అడవుల పరిరక్షణతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యమని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సరస్సు, అటవీ, ఆధ్యాత్మిక, పర్వత పర్యాటక ప్రాంతాలు ఒకేచోట ఉన్న ఫోర్-ఇన్-వన్ అరుదైన జిల్లా ములుగు అని అన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన జిల్లాగా ములుగు అగ్రస్థానంలో ఉందని, జిల్లాలో 64 శాతం, నియోజకవర్గంలో 77 శాతం అడవులు ఉన్నాయని తెలిపారు. మేడారాన్ని మరింత పచ్చదనంతో తీర్చిద్ది, మాస్టర్ ప్లాన్ ప్రకారం కంక వనాలు, ఇప్ప చెట్ల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో వన సంరక్షణ కమిటీల తరహాలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి అడవుల రక్షణ బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఇప్ప పువ్వ ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలు ఉన్నందున గిరిజనులకు శిక్షణ ఇచ్చి జీవనోపాధిగా మార్చుతామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, సీసీఎఫ్ ప్రభాకర్, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్, ఇంచర్ల సర్పంచ్ కుమార్ గౌడ్ మొక్కలు నాటారు. అటవీ శాఖ ఫోటో ప్రదర్శనను సందర్శించారు. అడవి పందుల దాడిలో మరణించిన దేవగిరిపట్నం రైతు వెంకటేశ్వర రెడ్డి కుటుంబానికి రూ.10 లక్షల చెక్కు అందజేశారు. సమ్మక్క-సారలమ్మ స్మృతి వనం, తాడ్వాయి హట్స్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారులకు డ్రోన్ కెమెరాలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, ఐటిడిఏ పీవో లెనిన్ వస్సల్ టోప్పో తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రవీణ్ డ్యాన్స్ కంపెనీ నాలుగవ వార్షికోత్సవ వేడుకలు

**- ముఖ్యఅతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**





కాప్రా /జూన్ 05 (విజన్ ఆంధ్ర ప్రతినిధి ): ప్రవీణ్ డ్యాన్స్ కంపెనీ నాలుగవ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్ లోని ప్రవీణ్ డ్యాన్స్ కంపెనీ(పిడిసి)లో కన్నుల పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతలో ప్రతిభను వెలికితీసి కళలకు ప్రోత్సాహం అందిస్తున్న ప్రవీణ్ డ్యాన్స్ కంపెనీ నిర్వాహకులు అభినందనీయులని అన్నారు. నృత్య కళ ద్వారా యువతకు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత పెంపొందుతాయని పేర్కొన్నారు. నాలుగు సంవత్సరాలుగా విజయవంతంగా సంస్థను నిర్వహిస్తూ అనేక మంది యువ కళాకారులను తీర్చిదిద్దుతున్న కొరియోగ్రాఫర్ ప్రవీణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం సంస్థ వార్షికోత్సవ కేక్ కట్ చేసి, విద్యార్థుల నృత్య ప్రదర్శనలను ఎమ్మెల్యే వీక్షించి వారిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమ శేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, ఆకుల మహేందర్, కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, సలహాదారులు బెలిదే అశోక్ గుప్తా, ఉపాధ్యక్షులు యావాపురం రవి, జర్నలిస్ట్ సుధాకర్, పిడిసి యజమాని ఉల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వానికి 'ప్రకృతి' ఎందుకు అంతిమ సహ-రచయిత

**- 'మనుగడకై ఒక కాన్వాస్'**



హైదరాబాద్ 2026, (ఎం ఎస్ ఆర్ . ప్రబోధ సుమేర్) : మనం గణాంకాలు రాజ్యమేలుతున్న యుగంలో జీవిస్తున్నాం. వాతావరణ మార్పుల గురించిన భయంకరమైన లెక్కలు మన మెదడుకు అందుతున్నా, ఆ నష్టాన్ని హృదయపూర్వకంగా అనుభవించలేకపోతున్నాం. ఈ మేధస్సుకు, హృదయానికి మధ్య ఉన్న అగాధాన్ని పూడ్చడానికి మానవజాతి ఎంచుకున్న పవిత్ర మాధ్యమమే 'కళ'. ప్రకృతి కళకు మూలకారణం ఆదిమానవుల గుహల గోడల చిత్రాల నుండి నేటి ఆధునిక పర్యావరణ కళల వరకు, ప్రకృతి ఎన్నడూ కేవలం ఒక నేపథ్యం కాదు, అది ఒక విశాలమైన కాన్వాస్. 'బయోఫిలియా పరికల్పన' ప్రకారం, ప్రకృతి పట్ల సానుకూలంగా ప్రతిస్పందించే జన్యుపరమైన ప్రవృత్తి మానవులలో ఉంటుంది. ఇదే కళా సృష్టికి మూలం ఒక ప్రాంతం యొక్క భౌగోళిక పరిస్థితులే అక్కడి కళను నిర్దేశిస్తాయి. ఆస్ట్రేలియా స్థానిక మట్టి రంగుల కళలు. జపాన్ మినిమలిజం, కలప ఆధారిత కళలు. ఉత్తర ఐరోపా కాంతి, నీడలకు ప్రాధాన్యతనిచ్చే ఇంప్రెషనిజం కాబట్టి, మనం ప్రకృతిని నాశనం చేస్తే జీవవైవిధ్యాన్ని మాత్రమే కాదు, మానవాళి యొక్క సౌందర్య పదజాలాన్ని కూడా చెరిపివేస్తున్నట్లే. భారతీయ సంప్రదాయాలలో సుస్థిరత పాశ్చాత్య దేశాలు "జీరో వేస్ట్" గురించి మాట్లాడక ముందే, భారతదేశం పర్యావరణ సుస్థిరతను దైనందిన కళలో భాగం చేసింది కలంకారీ కళ. గేదె పాలు, కరక్కాయ, బెల్లం వంటి పూర్తిగా పర్యావరణ అనుకూల పదార్థాలతో కూడిన 23 దశల రసాయన రహిత అద్దక విధానం. కోలం (ముగ్గులు) బియ్యం పిండితో వేసే ఈ ముగ్గులు చిన్న జీవులకు ఆహారంగా మారి, మట్టిలో కలిసిపోతాయి. ఇది ఉన్నతమైన పర్యావరణ తత్వానికి ప్రతీక. పర్యావరణ కళ (ఎన్విరాన్మెంటల్ ఆర్ట్ ) ఉద్యమం పారిశ్రామికీకరణ వల్ల కళకు, ప్రకృతికి మధ్య బంధం దెబ్బతిన్నప్పుడు పాశ్చాత్య దేశాలలో 'పర్యావరణ కళ' ఉద్యమంగా వచ్చింది. మొదట్లో రాబర్ట్ స్మిత్సన్ వంటి వారు ప్రకృతిపై మానవ ఆధిపత్యాన్ని చూపేలా 'స్పైరల్ జెట్టీ' నిర్మించినా, ఆ తర్వాత ఈ ఉద్యమం ప్రకృతిని స్వస్థపరిచే (హీలింగ్ ) దిశగా సాగింది. ఆగ్నెస్ డెనెస్: మన్హట్టన్ చెత్తకుప్పల ప్రాంతంలో గోధుమ పంట పండించి పెట్టుబడిదారీ వ్యవస్థను ప్రశ్నించారు. విభా గల్హోత్రా: కలుషితమైన యమునా నది స్థితిని గజ్జెల (ఘుంగురూ ) ద్వారా కళ్లకు కట్టారు. ఓలాఫుర్ ఎలియాసన్ 'ఐస్ వాచ్' ద్వారా నిజమైన మంచుగడ్డలను ప్రజల ముందుకు తెచ్చి వాతావరణ మార్పులను స్పర్శ ద్వారా అనుభవించేలా చేశారు. ఇవి కేవలం ప్రదర్శనలు కావు, నేటి యువతలోని 'ఎకో-యాంగ్జయిటీ' కి (వాతావరణ భయాందోళనలకు) భావోద్వేగ విరుగుడు. వాతావరణ డేటాను ప్రజల హృదయానికి తాకేలా చేయడంలో శాస్త్రవేత్తల కంటే కళాకారుల సామాజిక జోక్యం మిన్న. ప్రకృతిని మన సృజనాత్మకతలో 'సహ-రచయిత'గా గుర్తించడమే దీనికి ఏకైక మార్గం. ప్రకృతి అన్ని కళలకూ తల్లి, ఆమె తన చివరి శ్వాస విడిస్తే, మానవ చరిత్ర కాన్వాస్ శాశ్వతంగా చీకటిగా మిగిలిపోతుంది.

## పర్యావరణ ప్రేమికుడు"కోల రవీందర్" కు 'సేవాస్ఫూర్తి అవార్డు' ప్రధానం







హైదరాబాద్ జూన్ 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్ ) : శ్రేష్ఠత, సేవ, అంకితభావం యొక్క వేడుకగా సమాజ, సాంస్కృతిక రంగాలలో విశేష సేవలందిస్తున్న ప్రముఖులను సత్కరించే ఈ ఘన సన్మాన కార్యక్రమం శ్రేష్ఠతను గౌరవించడం, తరతరాలను ప్రేరేపించడం అని అతిథులు అభిప్రాయపడ్డారు. ఆదివారంనాడు సూర్య చంద్ర సాంస్కృతిక సంస్థ నిర్వహించిన చిరస్మరణీయంమైన, స్ఫూర్తిదాయకమైన ఈ కార్యక్రమం భారత్ వికాస్ పరిషత్ హాల్, బీజేపీ ఆఫీసు దగ్గర, కూకట్‌పల్లి, హైదరాబాద్ లో 'సూర్య చంద్ర అవార్డులు - 2026' పేరిట నిర్వహించారు. ఈ ప్రతిభ గుర్తింపు కార్యక్రమంలో వివిధ రంగాలలో విశిష్ట సేవలందిస్తున్న వారికి సూర్య చంద్ర అవార్డులను అందజేశారు. ఇందులో భాగంగా ప్రముఖ పర్యావరణ ప్రేమికుడు, సేవా తాత్పరుడు, నగరంలోని సూరారం కాలనీకి చెందిన సామాజిక వేత్త 'కోల రవీందర్' కరోనా సమయంలో ప్రజలను అప్రమత్తత చేస్తూ వారికి నిత్యావసర సరుకులు అందించడంలో ప్రముఖ పాత్ర వహిస్తూ, ప్రతిరోజు ప్రజలను ఉత్తేజపరుస్తూ, పాఠశాలలకు వెళ్లి విద్యార్థులు ఈత నేర్చుకోవాలని వారిలో స్ఫూర్తిని నింపుతూ, ఇంటిలో నీటిని కాపాడుకొనుటకై ఇంకుడు గుంతలు తీయించాలని, ప్రతి విద్యార్థి ఇంటి ముందర రెండు మొక్కలు నాటాలని పాఠశాలలకు వెళ్తూ చెప్పడం, ఎప్పుడూ ప్రజల మధ్యనే ఉంటూ, ప్లాస్టిక్ వస్తువులకు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తూ, ప్రజలకు సహాయపడుతూ , పర్యావరణ పరిరక్షణ మీద అలుపెరుగని ఉద్యమం చేస్తూ ఎప్పుడూ సమాజ హితం గురించి ఆలోచించే వ్యక్తి కోల రవీందర్ ముదిరాజ్ అని ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు గమనించి, గుర్తించి 'కోల రవీందర్ ముదిరాజ్' కు ప్రత్యేక సేవాస్ఫూర్తి అవార్డును అందజేసి ఆయనను ఘనంగా సన్మానించారు, సూర్య చంద్ర సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు మోహన్ చంద్ర, కార్యదర్శి అనిల్ కుమార్, చల్లా రాజశేఖర్ రెడ్డి, కృష్ణమాచార్యుల, జయంత్ రెడ్డి, ఆర్.ఆర్ రాజేందర్ పిల్లయి. ఈ సంధర్భంగా కోల రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, ఈ అవార్డు తన బాధ్యత పెరిగిందని ఈ అవార్డు తీసుకోవడంతో తాను రెట్టింపు ఉత్సవంతో ప్రజలకు సేవ చేస్తానని ప్రమాణం చేయుచున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తన తండ్రి ఈశ్వరయ్య రిటైర్డ్ హెడ్మాస్టర్ పాల్గొనడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు.

# మంచిర్యాలను ఆగం చేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

**- రంగపేట కాజ్ వే బ్రిడ్జి ఎత్తుపెంచి నిర్మిస్తే చాలు**
**- బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 05,(విజన్ ఆంధ్ర ) : మంచి మంచిర్యాల ను ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆగం చేస్తున్నారని, అయన చేస్తున్న పనితీరును ప్రజలు గమనిస్తున్నారని భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు విమర్శించారు. శుక్రవారం రంగపేట కాజ్ వే బ్రిడ్జి వద్ద జరుగుతున్న పనులను పర్యవేక్షించిన అనంతరం విలేకరుల సమావేశం లో దివాకర్ రావు మాట్లాడారు.ఎమ్మెల్యే కు తనకున్న కోపంతో గోదావరి పై మంచిర్యాల అంతర్గాం బ్రిడ్జి ని రద్దు చేస్తూ అక్కడి డబ్బులను వేరే వాటికీ మలించడం పై తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని అన్నారు. ఆసిఫాబాద్, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లా ప్రజలకు ఎంతో ప్రాధాన్యత గల బ్రిడ్జి ని తనకున్న అక్కసుతోనే రద్దు చేయడం దుర్మర్గాని ఆరోపించారు బ్రిడ్జి అని, మంచిర్యాల పై తనకున్న ద్వేషంతోనే అబ్రిడ్జి ని రద్దుచేయడం దూర్మరాగమని అన్నారు. గోదావరిపై బ్రిడ్జి నిర్మిస్తే 18 కిలోమీటర్లు తగ్గుతుందని పేర్కొన్నారు. పాపం అని ఓటేస్తే సర్వనాశనం చేస్తున్నారని మండిపడ్డారు. రంగపేట కాజ్ వే బ్రిడ్జి ఎత్తు పెంచి నిర్మిస్తే చాలు అని, కాని ఎమ్మెల్యే పిఎస్ఆర్ మాత్రం హైటెక్ సిటీ లోని తన ఇంటి నుండి రంగపేట లో మరో నూతన ఇంటి వరకు ఆరు లైన్ల రహదారి నిర్మించుకోవడం ఎంత వరకు సమాజసం అని ఆరోపించారు. గత ఇరవై ఏడు నెలలకింద కిందట



మంజూరైనా కాజ్ వే బ్రిడ్జి నిర్మాణం పనులను ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు.ఎమ్మెల్యే కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడవద్దని అది మంచి పద్ధతి కాదని సూచించారు రంగపేట లోని ఓ భూమి డిస్ట్రిబ్యూషన్ ఉండటంతో ఆ భూమిని 40 కోట్ల తో భయానా సైతం అందజేశారాణి అన్నారు.ఎమ్మెల్యే పిఎస్ఆర్ కు పుక్కిటికి డబ్బులు వస్తాయని,బైపాస్ రోడ్ లోని ఓ బినామీ పేరుతో సెటిల్మెంట్ లు చేస్తూ డబ్బులు సంపాదిస్తున్నారని అన్నారు. అన్యాయంగా, అక్రమంగా డబ్బులు సంపాదనతో నూతనంగా ఇల్లు నిర్మించుకుంటున్నారని ఆరోపించారు. గోదావరి పై అంతర్గాం బ్రిడ్జి ఎప్పుడైతే రద్దు అయిందో అప్పుడే ఎమ్మెల్యే పతనం మొదలైందని సూచించారు. ఇప్పటికైన రంగపేట కాజ్ వే బ్రిడ్జి ఎత్తు పెంచితే చాలు అని ఇష్టానుశారంగా వ్యవహారిస్తే ప్రజలు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ నాయకులు గాదె సత్యం, సుబ్బన్న, రవీందర్ రెడ్డి, ఎర్రం తిరుపతి, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ ఫారెస్ట్ ను టూరిస్ట్ హబ్ గా రూపొందించాలి

**- జిల్లావ్యాప్తంగా గ్రీన్ యాక్షన్ ప్లాన్ తయారీకి పటిష్ట ప్రణాళిక**
**- ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు కలెక్టర్**
**- 200 చెట్లతో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం ప్రారంభోత్సవం**
**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

విజన్ ఆంధ్ర మెదక్ బ్యూరో : 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామం వన్ యోజన అటవీ పార్కు నందు నిర్వహించిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్). హైదరాబాదు నుండి రత్నాకర్, డి ఎఫ్ ఓ జోజి, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి ఈ ఈ వేణు, సంబంధిత ఎఫ్ ఆర్ ఓ ,రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు, యాదగిరి, శర్మ రాజశేఖర్ సర్పంచ్ యాదగిరి, ఉపసర్పంచ్ ప్రసాద్ లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటారు. అనంతరం అటవీ శాఖ ఏర్పాటు పర్యావరణ పరిరక్షణపై జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అటవీ వారోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ప్రకారం జిల్లాలో ఈ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఏక్ పెడ్ మా కే నామ్' ప్రతి భారతీయుడిని తమ తల్లి మరియు భూమాత గౌరవార్థం



ఒక మొక్కను నాటమని ప్రోత్సహించే ఒక హృదయపూర్వక దేశవ్యాప్త పర్యావరణ ఉద్యమం. అన్నారు. ఇది మాతృత్వంలోని పోషణ స్ఫూర్తిని, ప్రకృతి యొక్క జీవనాధార శక్తితో అనుసంధానించి, మరింత పచ్చని గ్రహాన్ని పెంపొందుతుంది అన్నారు.మొక్కలు నాటుతున్నప్పుడు, మీ అమ్మ ప్రేమను, త్యాగాలను గౌరవించడానికి ఒక్క క్షణం కేటాయించాలని హితవు పలికారు. మానవాళి మనుగడకు మొక్కలే జీవనాధారాల అనే నినాదంతో ప్రతి ఒక్కరూ అమ్మ పేరు మీద ఒక మొక్క నాటినీ సంరక్షించి భవిష్యత్తులో వృక్షాలుగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. అటవీ సంపద సంరక్షణ, జీవ వైవిధ్యం పరిరక్షణ, వన్యప్రాణుల రక్షణకు సంబంధించి అంశాలపై విద్యార్థి దశ నుండే తెలుసుకోవాలన్నారు. జిల్లాలో 24% అటవీ సంపద ఉందని ,జిల్లాలో నర్సాపూర్, వడియారం, పరికిబండ, మనోరాబాద్ అర్బన్ ఫారెస్ట్ పార్కులను హైలెట్ చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ఫారెస్ట్ కు పిల్లలకు ప్రత్యేక టూర్ అరేంజ్ చేసి వారందరికీ జిల్లాలో అటవీ సంపద ఫారెస్ట్ పార్కులు మొక్కల వల్ల భావితరాలకు ఉపయోగం సంబంధిత విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో అటవీ సంపదను



పరిరక్షించడంలో అటవీశాఖ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. భవిష్యత్ తరాలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించేలా అడవులను సంరక్షించేందుకు ఒక నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం ముందుకు పోతున్నారని వివరించారు. జిల్లాస్థాయి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా అర్బన్ ఫారెస్ట్ పార్కుల పర్యాటకులకు ప్రాచుర్యం పెంపొందించే విధంగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రత్నాకర జోహారీ మాట్లాడుతూ.. జిల్లాలో వరల్డ్ ఎన్విరాన్మెంట్ కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని మానవాళి మనుగడకు చెట్లే ప్రతిరూపంగా ఉంటాయన్నారు విశాఖపట్నంలో సునామీ ఏర్పడినప్పుడు చెట్లు ఉన్న ప్రాంతాలలో దాని యొక్క తాకిడి చాలా తక్కువ మొత్తంలో ఉన్నది అంటే చెట్ల యొక్క ప్రాముఖ్యత తెలుసుకోవాలన్నారు. గ్రామీణ అభివృద్ధి శాఖ అటవీ శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు జిల్లా అధికారులు ,ప్రజా ప్రతినిధులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి శ్రీధర్ బాబు ఆత్మహత్య ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి

**- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి: మారపల్లి సుధాకర్**



హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 5 ( విజన్ ఆంధ్ర ): రంగారెడ్డి జిల్లా గిరిజన సంక్షేమ శాఖలో డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న శ్రీధర్ బాబు (39 సం.) ఇటీవల ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని, ఈ విషాద ఘటన యావత్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కలచివేసిందని తెలంగాణ గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు మారపల్లి సుధాకర్ ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.శ్రీధర్ బాబు అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ సేవలో ఉన్నప్పటికీ, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉన్న ఉద్యోగ భద్రత లేమి, ప్రతి నెలా జీతాల ఆలస్యం, రెన్యువల్ జీవోల జాప్యం, ఆర్థిక ఇబ్బందులు, అధికారుల వేధింపుల కారణంగా మానసిక క్షోభకు గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తోటి ఉద్యోగులు చెబుతున్నారని ఆయన తెలిపారు.ఒక ప్రభుత్వ ఉద్యోగి బతకలేక ఆత్మహత్య చేసుకోవడం వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి ఈ విషయాన్ని పురస్కరించుకొని గౌరవ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి కి కూడా మెయిల్ ద్వారా విజ్ఞప్తి చేయడం , జరిగిందని మారపల్లి సుధాకర్ తెలిపారు. శ్రీధర్ బాబు గారి ఆత్మహత్యకు దారి తీసిన పరిస్థితులపై సమగ్రమైన, నిష్పక్షపాత విచారణ జరిపించాలని, బాధ్యులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధాన డిమాండ్లు.. బాధిత శ్రీధర్ బాబు గారి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించాలి.. ఆయన భార్యకు లేదా కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలి.. రాష్ట్రంలోని లక్షలాది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, ప్రతి నెలా 1వ తేదీన జీతాలు వచ్చేలా శాశ్వత పరిష్కారం చూపాలి. ప్రజల కష్టాలను అర్థం చేసుకునే ముఖ్యమంత్రి గారు ఈ విషయంలో వెంటనే కలుగజేసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేసి, అన్ని విధాలా ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## పర్యావరణాన్ని కాపాడదాం.. భావితరాలను సంరక్షించుకుందాం

**- బీజేపీ జిల్లా కార్యదర్శి పద్మ మహేశ్వర్ రెడ్డి**
**- బోడుప్పల్ లో మొక్కలు నాటిన బీజేపీ నాయకులు**

బోడుప్పల్,జూన్ 05( విజన్ ఆంధ్ర): భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బోడుప్పల్‌లో భారతీయ జనతా పార్టీ బోడుప్పల్ డివిజన్ అధ్యక్షుడు తలారి రవి, పర్యావరణ పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఆదిమూలం కరుణాకర్ ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా బీజేపీ జిల్లా కార్యదర్శి పద్మ మహేశ్వర్ రెడ్డి, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సంధ్యా రెడ్డి బీజేపీ నాయకులతో పాల్గొని మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడదాం.. భావితరాలను సంరక్షించుకుందాం అనే లక్ష్యంతో పార్టీ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్నామని తెలిపారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంలో మొక్కల పాత్ర కీలకమని, ప్రతి ఇంటి వద్ద పచ్చదనం



పెంపొందించాలని సూచించారు.పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలంతా భాగస్వాములు కావాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో బోడుప్పల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి భానుగుంట వేణుగోపాల్, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు వేమునూరి మురళీధర్, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు ఆదిమూలం రమాదేవి,కార్యదర్శులు రోజా, తిరుమలేష్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి ధర్మపురి అరవింద్, బీజేవైఎం నాయకుడు వంశీ, జిల్లా ఎండోమెంట్ కో–కన్వీనర్ కే. శ్రీనివాస్ ముదిరాజ్, ఈస్ట్ జోన్ ఉపాధ్యక్షులు ధర్మారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు ఆర్. వేణుగోపాల్, బూత్ అధ్యక్షుడు పత్తి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# వైద్యాన్ని సేవాభావంతో అందించాలి

**- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**
**- ఘనంగా మేఘన ఆసుపత్రి ప్రారంభోత్సవం**
**- మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుల హాజరు**

వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 5 (విజన్ ఆంధ్ర) :




వైద్యులు వైద్యాన్ని వ్యాపార దృక్పథంతో కాకుండా, పూర్తి సేవాభావంతో ప్రజలకు అందించాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆర్గనైజింగ్ జనరల్ సెక్రెటరీ బ్రహ్మంచారి, రమేష్ సంయుక్తంగా వనపర్తి పట్టణంలోని గాంధీ చౌక్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మేఘన ఆసుపత్రిని శుక్రవారం ఆయన రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. దినదినాభివృద్ధి చెందుతున్న వనపర్తి పట్టణంలో ప్రజల ఆరోగ్య అవసరాలకు తగ్గట్టుగా ఇలాంటి ఆధునిక ఆసుపత్రులు రావడం ఎంతో అభినందనీయమన్నారు. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య చికిత్సలు అందించి ప్రాణాలు కాపాడాలని ఆయన సూచించారు. సమాజంలో భగవంతుని తర్వాత ప్రజలు అంతగా నమ్మేది, దేవుడిలా భావించేది కేవలం వైద్యులను మాత్రమేనని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, వనపర్తి పట్టణ అధ్యక్షుడు కదిరి రాములు, పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాపర్ల రాంరెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు వనపర్తి పట్టణ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పలువురు ప్రముఖులు హాజరై ఆసుపత్రి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.

# తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

**- ప్రభుత్వానికి ఎంత చెప్పినా చెవికెక్కడం లేదు**
**- రైతులకు ఇన్ని కష్టాలు వచ్చినా ఎమ్మెల్యే కు కనిపించడం లేదు**
**- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి**

విజన్ ఆంధ్ర మెదక్ బ్యూరో : భారీ వర్షాలకు తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయలపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం సందర్శించారు. అనంతరం మండల నాయకులు, రైతులతో కలిసి మెదక్ సిద్దిపేట హైవే పైన రోడ్డుపై మొలకెత్తిన ధాన్యం పోసి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో సుమారు 20 లారీల ధాన్యం నిల్వ ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోలు చేయలేదని రైతులు తమకు వివరించారని తెలిపారు.శుక్రవారం కురిసిన భారీ వర్షంతో 2 కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించినా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు.రైతులకు ఇంతటి కష్టాలు వచ్చినా స్థానిక ఎమ్మెల్యే కనిపించడం లేదని మండిపడ్డారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు కూడా ఎమ్మెల్యే ముందుకు రాకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి మాదిరిగానే ఎమ్మెల్యే కూడా రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.మరో రెండు రోజుల్లో మృగశిర కార్తె ప్రారంభం కానున్న నేపథ్యంలో మరిన్ని వర్షాలు కురిసే



అవకాశం ఉందని, దీంతో ధాన్యం పూర్తిగా పాడయ్యే ప్రమాదం ఉందన్నారు.తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు.లారీల కొరత, కూలీల కొరత కారణంగా ధాన్యం తరలింపు నిలిచిపోయిందని, దీనివల్ల రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైస్‌మిల్లర్లు సంచికి అదనంగా ఐదు కిలోల ధాన్యం వేస్తేనే తీసుకుంటామని చెప్పడం వల్ల రైతులు క్వింటాలుకు 12 కిలోల వరకు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు.రైతుల సమస్యలను ప్రభుత్వం, అధికారులు, స్థానిక ప్రజాప్రతిని ధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే అధికారులు స్పందించి రాయలపూర్‌లో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని, అవసరమైన లారీలను పంపి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రామాయంపేట సొసైటీ చైర్మన్ బాదే. చంద్రం,మున్సిపల్ మాజీ చైర్మన్ జితేందర్ గౌడ్,నిజాంపేట్ ఎంపీపీ సంపత్,సీనియర్ నాయకులు చౌదరి. సుప్రభాతారావు,మాజీ సర్పంచ్ నర్స గౌడ్, మాజీ ఎంపీటీసీ సత్యం ,బిక్షపతి,నాయకులు ఉమామహేశ్వర్,అబ్దుల్ అజీజ్, హస్నోద్దీన్,రొయ్యల నవీన్, మధుకర్ రాంకీ శ్రావణ్, మహేష్, రంజిత్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్,నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## చివరి దశలో ధాన్యం కొనుగోళ్లు

**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

విజన్ ఆంధ్ర మెదక్ బ్యూరో : ధాన్యం కొనుగోలు చివరి దశలో ఉందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. శుక్రవారం నాడు వరకు జిల్లా వ్యాప్తంగా 76,276 మంది రైతుల నుంచి 3,58,118,040 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 60,349 మంది రైతుల బ్యాంకు ఖాతాలో 644,98 కోట్ల రూపాయలు చెల్లింపులు చేసినట్లు తెలిపారు. 222 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. రైతులు అధైర్య పడొద్దు అని ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అన్ని కాలనీలలో

## అన్ని కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రాధాన్యత

**-: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**



అల్వాల్ ,జూన్ 5,(విజన్ ఆంధ్ర): అన్ని కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాజీ కార్పొరేటర్ సబితా అనిల్ కిషోర్ తో కలిసి . వెంకటాపురం డివిజన్ బృందావన్ నగర్ కాలనీ లో రూ.15 .5 లక్షల అంచనా వ్యయంతో కూడిన డ్రైనేజీ పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ...మీ కాలనీలో ఇంకా ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సాధ్యమైనంత త్వరగా ఆ పనులు పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. అధికారులతో కలిసి కాలనీలను మరింత అభివృద్ధి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కాలనీవాసులకు భరోసాని చ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిజిఎం వెంకటేష్, మేనేజర్ రమేష్, బీఆర్ఎస్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, కాలనీవాసులు కరుణాకర్ రాజేష్, శశాంక్, శ్రీనివాస్, శ్రీనాథ్, వెంకటేశం, స్వామియాదవ్, రజిని శివశ్రీ లక్ష్మి శైలజ స్థానిక నాయ కులు విజయశేఖర్ మోసిన్ ప్రభాకర్, సురేష్, ముత్యాలు, శరణుగిరి, మహి, సోమయ్య, ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## ప్రకృతిని కాపాడుకుందాం.. భవిష్యత్తును రక్షించుకుందాం..

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రమాకాంత్**

వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 5 (విజన్ ఆంధ్ర) : ప్రకృతి నుంచి ప్రేరణ పొందుదాం, వాతావరణ మార్పులను ఎదుర్కొందాం, మన భవిష్యత్తును కాపాడుకుందాం“ అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా న్యాయస్థానంలో పర్యావరణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మాత్రమే కాకుండా ప్రతిరోజు కూడా చెట్లను నాటడం వాటిని కాపాడుకోవడం భవిష్యత్ తరాలకు మంచి ప్రకృతిని అందించడం మన అందరి బాధ్యత అని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని భవిష్యత్తులో ప్లాస్టిక్ భూతం మానవాళికి ఎంతో హాని కలిగిస్తుందని తెలియజేశారు. వాతావరణ మార్పులను అడ్డుకోవడం, గ్లోబల్ వార్మింగ్ ను తగ్గించడం మరియు ప్రకృతి సమతుల్యతను కాపాడటం కోసం అని అర్థం.



మన భవిష్యత్తు కోసం మన రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన మరియు నివాసయోగ్యమైన భూమిని అందించాలని కోరారు. కావున అందరూ కూడా పర్యావరణ పరిరక్షణలో భాగం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.కలర్చన, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ కవిత మరియు జూనియర్ సివిల్ జడ్జి లు శ్రీలత, అశ్విని, కార్తీక్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ కుమార్, సెక్రటరీ వెంకట రమణ, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ మరియు అటవీ శాఖ అధికారులు విజయ్ రాజు కుమార్, బాల కిష్టమ్మ, సిబ్బంది న్యాయమూర్తులు కోర్టు సిబ్బంది లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

# ములుగులో ప్లాస్టిక్‌పై యుద్ధం

**- స్టీల్ పాత్రలు తప్పనిసరి చేయాలని డిమాండ్.**
**- పర్యావరణ దినోత్సవం రోజు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం.**
**- రీసైక్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి.**


ములుగు, జూన్ 05: విజన్ ఆంధ్ర ప్రతినిధి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ములుగు నగరపాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేస్తూ పర్యావరణ విభాగం నేతలు బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. వివాహాలు, శుభకార్యాలు, ఇతర వేడుకల్లో ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, విస్తర్లకు బదులు స్టీల్ పాత్రల వినియోగాన్ని తప్పనిసరి చేసేలా కఠిన నిబంధనలు రూపొందించాలని వినతిలో కోరారు. ఫంక్షన్ హాళ్లు, కన్వెన్షన్ సెంటర్లలో స్టీల్ ప్లేట్లు, గ్లాసుల వినియోగాన్ని తప్పనిసరి చేయాలని సూచించారు. ప్లాస్టిక్ దహనం వల్ల వాయు కాలుష్యం.. ప్రస్తుతం ములుగు పట్టణంలోని చాలా వాడల్లో ప్రజలు ప్లాస్టిక్



వ్యర్థాలను కాల్చివేస్తున్నారని, దీనివల్ల వాయు కాలుష్యం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ చెత్త వాహనాలు ప్లాస్టిక్ సేకరణకు సరిగా రావడం లేదని ఫిర్యాదు చేశారు. తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసి, ప్లాస్టిక్‌ను పునరుత్పత్తి చేసే రీసైక్లింగ్ మెకానిజంను మున్సిపాలిటీలో ఏర్పాటు చేయాలని కోరారు. వినతి స్వీకరించిన కమిషనర్ సానుకూలంగా స్పందించి ప్లాస్టిక్ నిషేధం, స్టీల్ పాత్రల వినియోగంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ విభాగం ప్రముఖులు కొండా గిరి వర్ధన్, 9వ వార్డు కౌన్సిలర్ గంద్రకోట వాణి కుమార్, కొత్తపల్లి పోషన్న, భాష బోయిన మహేందర్, కొండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం,వీవీప్యాట్ గోదామును పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో,జూన్5,(విజన్ ఆంధ్ర)



ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదామును జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అఖిల పక్ష ప్రతినిధులతో కలిసి శుక్రవారం పరిశీలించారు.జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న గోదామును ఆయన అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్,వివిధ పార్టీల రాజకీయ ప్రతినిధులతో కలిసి వారి సమక్షంలో తెరిపించారు. గోదాంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు,వీవీప్యాట్ యంత్రాలను పరిశీలించడంతో పాటు వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.ప్రతి మూడు నెలలకు ఒకసారి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు,వీవీప్యాట్‌లను పరిశీలించే కార్యక్రమంలో భాగంగా ఈ తనిఖీ చేపట్టినట్లు ఎన్నికల విభాగం అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్ నాయక్,టీఆర్ఎస్ నుండి పిచ్చయ్య,సీపీఐ(ఎం) నుండి నర్సిరెడ్డి,టీడీపీ నుండి ఏ.రవి,ఎంఐఎం నుండి ఎండి రఫీ,బీఎస్పీ నుండి యాదగిరి,ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

# అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 5, విజన్ ఆంధ్ర : జిల్లాలో సరైన అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండలంలోని కొత్తసార్సాలా గ్రామం వద్ద సార్సాలా వాగు నుండి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను నిలిపి అనుమతి పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సరైన అనుమతులు లేకుండా వాగుల నుండి ఇసుకను తరలించడం, చెరువుల నుండి మట్టిని తరలించడం చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఏప్రిల్ 1వ తేదీ నుండి మన ఇసుక వాహనం యాప్ ప్రారంభించిందని, ఇసుకను తరలించే వారు యాప్ లో స్లాట్ బుక్ చేసుకుని అనుమతి తీసుకోవాలని, సరైన అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ట్రాక్టర్ల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ కూరాకుల గోపికి డబ్ల్యూజేఐ, టీజేఏ నేతల నివాళి

**ఖమ్మం జిల్లా బ్యూరో, జూన్ 5(విజన్ ఆంధ్ర) :**

ఇటీవల మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్, జనంసాక్షి దిన పత్రిక ఖమ్మం జిల్లా బ్యూరో ఇంఛార్జి కూరకుల గోపీకి వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ), తెలంగాణ జర్నలిస్ట్స్ అసోషియేషన్ (టీజేఏ)నేతలు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం రఘునాథ పాలెం మండలంలోని గోపి స్వగ్రామం పాపటపల్లి వెళ్ళిన డబ్ల్యూజేఐ రాష్ట్ర కార్యదర్శి నారా సుబ్రమణ్యేశ్వర రావు, (ఎన్.ఎస్.రావు) ఖమ్మం జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్, టీజేఏ జిల్లా అధ్యక్షులు నాగ స్వామి, డబ్ల్యూజేఐ ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గ కన్వీనర్ కె. కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా నాయకులు కట్టేకోల చిన నరసయ్య, మోడెపల్లి కిరణ్, గోగుల నారాయణ రావు, జాబిశెట్టి కుటుంబ రావు, ఏనిగండ్ల శ్రీనివాస రావు, బొడ్డుపల్లి రవీందర్, గోపి మిత్రుడు పసుపులేటి ఉపేందర్ తదితరులు ఆయన చిత్ర పటానికి పూలు వేసి నివాళులర్పించారు. గోపి ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ల నేతలు గోపీతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన అకాల మరణం జర్నలిస్టు సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు.

# ఆగ్నివీర్‌కు ఎంపికైన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు



నెల్లికుదురు, జూన్ 5, విజన్ ఆంధ్ర: నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఆశోద ప్రశాంత్, గుండెపాక గణేష్ లు భారత సైన్యంలో ప్రతిష్టాత్మకమైన ఆగ్నివీర్ నియామకాలకు ఎంపిక కావడం పట్ల కళాశాల యాజమాన్యం శుక్రవారం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఎన్.స్.స్ జిల్లా కన్వీనర్ మర్సకట్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఎంపికైన విద్యార్థులను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్, ఎన్.స్.స్ జిల్లా కన్వీనర్ మర్సకట్ల అనిల్ కుమార్ లు మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల మరియు నిరంతర శ్రమతో ఈ విజయాన్ని సాధించారని, గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలను సాధించగలరని వారు నిరూపించారని అన్నారు. దేశ సేవకు అంకితమయ్యే అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు విద్యార్థులను అభినందిస్తూ, వారి విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ కళాశాల అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి. వెంకటేశ్వర్లు అధ్యాపకులు ప్రకాష్ బాబు, కవిరాజు, నాగేశ్వరరావు, శ్రీనివాస్, సుధాకర్, మహేందర్, బాబు, సతీష్, యాకన్న, సుభాష్ అధ్యాపకేతర బృందం శ్రావణ్, ప్రదీప్, లక్ష్మణ్, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## 2 తులాల బంగారం 1 లక్ష నగదు చోరీ



భూపాలపల్లి జిల్లా 05 జూన్ విజన్ ఆంధ్ర) : భూపాలపల్లి నియోజక వర్గం కొత్తపల్లి గోరి మండల కేంద్రంలో సూరం సంపత్ ఇంట్లో చోరీ. దశదిన కర్మ కోసం ఇంటికి తాళం వేసి వెళ్లిన కుటుంబ సభ్యులు.ఇంట్లో చొరబడ్డ దొంగలు రెండు తులాల బంగారం,30 తులాల వెండి,1లక్ష రూపాయల నగదు అపహరణ.క్లూస్ టీంతో ఆధారాల సేకరణ.. ఎస్సై త్రిలోక్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు. త్వరలోనే దొంగల్ని పట్టుకుంటామని తెలిపారు.

# నిందితులకు శిక్ష పడేలా కోర్టు డ్యూటీ అధికారుల పాత్ర కీలకం

**- ఎస్పీ రోహిత్ రాజు**



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, జూన్ 06(విజన్ ఆంధ్ర) : నేరస్తులకు శిక్ష పడేలా చేయడంలో కోర్టు డ్యూటీ అధికారుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, కోర్టు డ్యూటీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, కోర్టు డ్యూటీ అధికారులకు కేసులపై పూర్తి అవగాహన కల్పించే బాధ్యత స్టేషన్ హౌస్ ఆఫీసర్లదేనని అన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా కేసులను సమగ్రంగా పర్యవేక్షించాలని, కోర్టు ప్రక్రియలో ఎటువంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా చూడాలని సూచించారు. సమ్మన్లు, వారెంట్ల జారీలో జాప్యం లేకుండా సకాలంలో సాక్షులు, నిందితులకు అందజేయాలని ఆదేశించారు. కోర్టులో విచారణ సమయంలో సాక్షులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, కేసు వివరాలపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కేసులకు సంబంధించిన సీజ్ చేసిన ఆస్తులు, వస్తువులను నిర్దిష్ట సమయంలో కోర్టులో హాజరు పరచాలని చెప్పారు. కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, న్యాయాధికారులతో సమన్వయం పెంపొందించుకోవాలని సూచించారు. నేరస్తులకు శిక్ష పడేలా కేసుల విచారణలో సమర్థవంతంగా వ్యవహరించడం ద్వారా బాధితులకు న్యాయం చేకూర్చడం ప్రతి పోలీసు అధికారి బాధ్యత అని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్, కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

# నీటి నిల్వ చెరువును (ఇంకుడుగుంత )ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి బ్యూరో జున్ 5(విజన్ఆంధ్ర) : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా ఐ డి ఓ సి సి ప్రాంగణంలో డి ఎం ఎఫ్ సి (టి) నిధుల ద్వారా నిర్మించిన నీటి నిల్వ చెరువును జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు , పర్యావరణ పరిరక్షణకు నీటి నిల్వ చెరువులు ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో వర్షపు నీటిని సద్వినియోగం చేసేందుకు ఇటువంటి చర్యలు చేపట్టడం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. డిఎం ఎఫ్ సి(టి) నిధుల నుంచి రూ.6.55 లక్షల వ్యయంతో ఈ నీటి నిల్వ చెరువును నిర్మించినట్లు తెలిపారు. వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాల మట్టాన్ని పెంచడంతో పాటు పర్యావరణ సమతుల్యతకు ఇది ఉపయోగపడుతుందని కలెక్టర్ వివరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.అనంతరం జిల్లా కలెక్టర్ నీటి నిల్వ చెరువు పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చెరువు చుట్టూ పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. పరిసరాలను పచ్చదనంతో అభివృద్ధి చేయడం ద్వారా కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. నీటి నిల్వ చెరువు పరిసర ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దితే భవిష్యత్తులో బతుకమ్మ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, వేడుకలను కూడా ఇక్కడ నిర్వహించుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఇంచార్జి అదనపు కలెక్టర్ ఎన్ వి గిరి, డి ఆర్ డి ఓ దామోదర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నష్టం జరగకుండా తడిసిన వరిని వెంటనే తరలించాలి

**: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



కామారెడ్డి బ్యూరో జున్ 5(విజన్ఆంధ్ర) : అకాల వర్షాల కారణంగా ఈ నెల 5వ తేదీ వరకు పూర్తికావలసిన కొనుగోలు ప్రక్రియ 10వ తేదీలోగా కొనుగోలు ప్రక్రియను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.కామారెడ్డి డివిజన్‌లో గురువారం కురిసిన భారీ వర్షాల కారణంగా సుమారు 800 మెట్రిక్ టన్నుల వరి తడిసిపోవడంతో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం అదనపు కలెక్టర్ విక్టర్ తో కలిసి రామేశ్వర్‌పల్లి ప్యాడీ పర్చేజ్ సెంటర్‌ను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన కలెక్టర్, రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా తడిసిన వరిని వెంటనే తరలించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.ధాన్యం తరలింపులో జాప్యం జరగకుండా తగిన సంఖ్యలో వాహనాలను ఏర్పాటు చేసి తడిసిన వరిని అత్యవసరంగా రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా మేనేజర్ శ్రీకాంత్ , జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, ఎఫ్‌సీఐ రామ్మోహన్ రావు, సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం సిద్ధిరామేశ్వర రైస్ మిల్లులో ఆరు పారా బాయిల్డ్ రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. తడిసిన వరిని వెంటనే అన్‌లోడ్ చేసి స్వీకరించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పూర్తి సహకారం అందించాలని సూచించారు.తమ సామర్థ్యానికి అనుగుణంగా ధాన్యాన్ని అన్‌లోడ్ చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన 14 మంది రైస్ మిల్లర్ల పై జిల్లా కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ కొనుగోలు ప్రక్రియకు సహకరించని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోందని, ప్రస్తుత తేదీ నాటికి జిల్లాలో మొత్తం 4,19,000 మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం వారి ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసి సకాలంలో తరలించేందుకు అన్ని చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ప్రత్యేక గ్రామసభల ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



కామారెడ్డి బ్యూరో జున్ 4(విజన్ఆంధ్ర ) : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 532 గ్రామపంచాయతీలలో విడతల వారీగా ప్రత్యేక గ్రామసభలను నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు జూన్ 4, 6, 8, 10 తేదీలలో గ్రామసభలు నిర్వహించేందుకు మండల స్థాయి అధికారులను పర్యవేక్షణ అధికారులుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఉత్తర్వులు జారీ చేశారు.ఇందులో భాగంగా గురువారం జిల్లాలోని 136 గ్రామపంచాయతీలలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంగా దోమకొండ మండలంలోని గొట్టుముక్కుల గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ హాజరై గ్రామస్థులతో సమావేశమయ్యారు. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, ఇతర జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మురికి కాలువలను శుభ్రపరచడం, పిచ్చి మొక్కలను తొలగించడం, తాగునీటి వనరులు, వాటర్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచడం, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామాల్లో పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చని తెలిపారు. ఘన వ్యర్థాల నిర్వహణ రూల్స్2026ను గ్రామపంచాయతీలు తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. తడి, పొడి, శానిటరీ , ప్రత్యేక వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి నిర్వహించాలని సూచించారు. గ్రీన్ బుట్టలో తడి వ్యర్థాలు, బ్లూ బుట్టలో పొడి వ్యర్థాలు, రెడ్ బుట్టలో శానిటరీ వ్యర్థాలు, నల్ల రంగు బుట్టలో ప్రత్యేక వ్యర్థాలను వేరు చేసి గ్రామపంచాయతీకి అందించాలని ప్రజలకు సూచించారు.

# మోడీ మాటలు ఆచరిస్తే దేశం విశ్వగురువు అవుతుంది

**- రాబోయే ఎన్నికల్లో పొత్తులు లేకుండా బిజెపి గెలుపు ఖాయం**

**- ఏక్ పెడ్ మాతా పే నామ్ పే మోడీ పిలుపులో భాగంగా మొక్కలు నాటిన మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి**



సూర్యాపేట జూన్ 05:(విజన్ ఆంధ్ర) : మోడీ మాటలు విని ఆచరిస్తే దేశం బాగుంటుందని మనందరం బాగుంటామని దేశం విశ్వగురువు అవుతుందని హుజూర్నగర్ మాజీ ఎమ్మెల్యే బిజెపి రాష్ట్ర నాయకులు శానంపూడి సైదిరెడ్డి అన్నారు. జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధానమంత్రి మోడీ ఇచ్చిన పిలుపుమేరకు ఏక్ పెడ్ మాతా కే నామ్ పేలో భాగంగా శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బిజెపి కార్యాలయ భవన నిర్మాణ స్థలంలో తన తల్లి సత్యవతి తో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. జనహితం మోడీ హితమని ఆయన అందరి నాయకుడని పర్యావరణహితానికై మోడీ కృషి చేస్తున్నారని అందుకే అమ్మ పేరున ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చినట్లు తెలిపారు. రాజకీయం అంటే సంపాదించుకోవడమే అనుకునే ఈ రోజుల్లో దేశ కోసం దేశ సంస్కృతి కోసం ఆలోచిస్తూ భారతదేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దేందుకు మోడీ కృషి చేస్తున్నాడన్నారు. దేశ నాయకుడు మాటలు విన్న దేశం అభివృద్ధి చెందుతుందని మోడీ మాటలను ప్రస్తుతం ప్రపంచం వింటుందని ఆయన చెప్పిన మాటలు విని ఆచరిస్తే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. పదవుల కోసం మాటలు చెప్పే నాయకుడు మోడీ కాదని ఆయన సారధ్యంలో తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో ఎలాంటి పొత్తులు లేకుండా బిజెపి అధికారం కైవసం చేసుకోవడం ఖాయం అన్నారు. మోడీ ఫోటో చూస్తేనే ప్రజలు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని మొక్కలే మానవాళికి జీవనాధారం అన్నారూ. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జల్లి గణేష్, చలమల్ల నరసింహ, గజ్జల వెంకటరెడ్డి, పాండురంగ చారి, కోడి లింగయ్య, పరుశురాం, రవి నాయక్, గుడిసె వెంకన్న, దాసరి వెంకన్న, గజ్జల కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

# ఎస్పీ కార్యాలయంలో భరోసా ఆధ్వర్యంలో మహిళలకు, చిన్నారులకు కన్వర్జెన్స్ సమావేశం



భూపాలపల్లి జిల్లా : 5 ( విజన్ ఆంధ్ర ) భూపాలపల్లి ఎస్పీ కార్యక్రమం లో మహిళలు, చిన్నారుల రక్షణకు శాఖల సమన్వయం కీలకం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్. మహిళలు, చిన్నారులపై జరిగే హింస, వేధింపుల కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం, రక్షణ, పునరావాస సేవలు అందించేందుకు సంబంధిత అన్ని శాఖల మధ్య సమన్వయం అత్యంత అవసరమని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో భరోసా కార్యక్రమానికి సంబంధించి కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో మహిళలు మరియు చిన్నారుల సంక్షేమానికి సంబంధించిన వివిధ శాఖల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో బాధితులకు వైద్య, న్యాయ, కౌన్సెలింగ్, పునరావాస సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. అలాగే మహిళలు, చిన్నారులపై నమోదవుతున్న కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు, బాధితులకు అవసరమైన సేవల కల్పన, రిఫరల్ వ్యవస్థ బలోపేతం, సంక్షేమ కార్యక్రమాల అమలులో శాఖల మధ్య సమన్వయాన్ని మరింత మెరుగుపరచాలని సూచించారు. అదేవిధంగా బాధితులకు ఒకే వేదికపై అన్ని రకాల సహాయ సేవలు అందించే దిశగా భరోసా కేంద్రాల పాత్రను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, కేసుల పరిష్కారంలో ప్రతి శాఖ తన బాధ్యతలను సమయానుకూలంగా నిర్వర్తించాలని సమావేశంలో సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్,×జూూ అధికారులు, చైల్డ్ లైన్ ప్రతినిధులు, జఔజ & జీజీదీ సభ్యులు, ఐూూూ ప్రతినిధులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు, ూజు౯ూ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దర్యాప్తు అధికారులు మరియు భరోసా ఎస్ఐ స్వప్న కుమారి, భూపాలపల్లి జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ఐడీఓసీ జంక్షన్ డివైడర్లలో మొక్కలు నానాటి పచ్చదనాన్ని పెంపొందించాల

**- సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం**




రాజన్న సిరిసిల్ల (విజన్ ఆంధ్ర బ్యూరో), జూన్ 5: జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) జంక్షన్ సుందరీకరణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన డివైడర్ల మధ్యలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఐడీఓసీ జంక్షన్‌లో కొనసాగుతున్న సుందరీకరణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జంక్షన్‌లో ఏర్పాటు చేసిన జోట విగ్రహంతో పాటు వస్త్ర పరిశ్రమలో నూలు నుంచి వస్త్రం తయారీ వరకు జరిగే వివిధ దశలను ప్రతిబింబించే శిల్పాలను పరిశీలించారు. సిరిసిల్ల ప్రత్యేకతను ప్రతిబింబించేలా రూపొందించిన విగ్రహాలు ఆకర్షణీయంగా ఉన్నాయని పేర్కొంటూ సంబంధిత అధికారులను కలెక్టర్ అభినందించారు. జంక్షన్‌ను మరింత అందంగా తీర్చిదిద్దేందుకు డివైడర్ల మధ్య మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని సూచించారు. అలాగే గ్రీనరీ అభివృద్ధి, మొక్కల ఏర్పాటు, అలంకరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్, డీఈ వాణి తదితర అధికారులు పాల్గొన్నారు. “సిరిసిల్ల నేతన్న జీవన విధానాన్ని ప్రతిబింబించేలా ఐడీఓసీ జంక్షన్‌ను అభివృద్ధి చేస్తున్నాం. పచ్చదనంతో కూడిన సుందరమైన జంక్షన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం“ అని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు.

## జిల్లా వ్యవసాయ శాఖ ఏడి తో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హైమావతి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి05 జూన్ : సిద్దిపేట జిల్లా సమీకృత జిల్లాకార్యాలయసముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోనీ వ్యవసాయ శాఖ ఏడిఏ, ఏఓ, ఏఈఓ లతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి జూమ్ సమావేశం ద్వారా వ్యవసాయ శాఖలో చేస్తున్న పలు కార్యక్రమాల పనితీరు గూర్చి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్మాట్లాడుతూ... ఫార్మసీ రిజిస్ట్రీ రోజు వారి టార్గెట్ పెట్టుకుని పూర్తి చెయ్యాలని ఏ ఈ ఓ లను, ఫార్మసీ రిజిస్ట్రీ మానిటర్ చెయ్యాలని ఏఓ, ఏ డి ఏ లను ఆదేశించారు. ఫార్మసీ రిజిస్ట్రీ వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పలు పథకాలు రైతులకు అందించడంజరుగుతుందని తెలిపారు. ఏ ఓ పరిధిలోనీ సీడ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో 50 శాతం సన్న వడ్లు అమ్మేలాగా చూడాలని సన్న వడ్లను పెద్ద ఎత్తున ప్రమోట్ చెయ్యాలని ఆదేశించారు. గ్రామ సభలో, రైతు సభలో సన్న వడ్లు పండించేందుకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిలా రైతులను ప్రోత్సహించాలని ఆదేశించారు.ప్రతి సారి వరి సాగు ఒక్కటే పండించడం ద్వారా భూమి సారం తగ్గుతుందని పంట మార్పిడి వైపు ప్రతి రైతు ఆలోచన చెయ్యాలని, వాణిజ్య పంటలు, చిరు ధాన్యాలు, ఆయిల్ ఫామ్ సాగు వైపు రైతులను ప్రేరేపించాలని, తద్వారా రైతులు లాభం పొందడమే కాకుండా భూమి సారవంతంగా ఉంటుందని తెలిపారు.

## ఘనంగా చిట్టెం. అభిజయ్ రెడ్డి జన్మదిన వేడుకలు.



నారాయణపేట , జూన్ 5 ( విజన్ ఆంధ్ర) : టీపీసీసీ సభ్యులు చిట్టెం.అభిజయ్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం నారాయణపేట పట్టణంలోని సీవీఆర్ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ,ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, యువతకు అండగా నిలుస్తున్న అభిజయ్ రెడ్డి సేవలను కొనియాడారు. దివంగత నాయకులు చిట్టెం నర్సిరెడ్డి,చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల మధ్య ఉంటూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. నారాయణపేట నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే డాక్టర్.చిట్టెం.పర్ణిక రెడ్డి గారితో కలిసి సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేసేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు.ముఖ్యంగా నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రత్యేక చొరవ చూపుతూ వందలాది మంది యువకుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని కొనియాడారు.పార్టీ బలోపేతం,ప్రజా సమస్యల పరిష్కారం, యువతకు ఉపాధి కల్పన,సామాజిక సేవా కార్యక్రమాల్లో అభిజయ్ రెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయమని నాయకులు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకొని ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి,పట్టణ అధ్యక్షులు ఎండి. సలీం,సీనియర్ నాయకులు ఎండి. గౌస్,కోట్ల.రవీందర్ రెడ్డి,ఆర్టివో బోర్డు డైరెక్టర్ పోషల్ రాజేష్, పళ్ళ అనిల్,వెంకు గౌడ్,అఖిల్ రెడ్డి, సందీప్ రెడ్డి,సంగారెడ్డి,కార్తీక్ రెడ్డి, ఎరుకలి. వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**- మొక్కలు నాటిన మహబూబాబాద్ రోటరిక్లబ్**
**- ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఎస్పీ నంబూరు తిరుపతి రావు**

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 5 (విజన్ ఆంధ్ర): పర్యావరణ పరిరక్షణ సమాజంలోని అందరి భాధ్యత కావాలని మహబూబాబాద్ డిఎస్పీ నంబూరు తిరుపతి రావు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ రోటరిక్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిఎస్పీ తిరుపతి రావు మాట్లాడుతూ పుడమితల్లికి పచ్చటి పందిరి వెయ్యాలనే రోటరీ సంకల్పం గొప్పదని అభినందించారు. రోజురోజుకూ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న మనిషి ప్రకృతికి దూరంగా జరిగి పోతున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు. క్రమశిక్షణ తప్పిన మానవాళి చర్యలతో భూగోళం వేడెక్కి వాతావరణ సమతుల్యత దెబ్బతింటోందని అన్నాడు. చెట్ల నరికివేత, భూగర్భవనరుల విచ్చలవిడి వినియోగం, అపరిమిత ప్లాస్టిక్ ఉత్పత్తి వినియోగం లాంటి అవలక్షణాలు మానవాళి మనుగడకు గొడ్డలిపెట్టుగా మారాయని అన్నాడు. తద్వారా ఓజోన్ పొర చిల్లులు పడి ఉష్ణోగ్రతలు పెరిగాయని అన్నాడు. ఋతువుల్లో మార్పుతో పాటు ధృవాల వద్ద




మంచు పలకాలు కరిగి రాబోయే రోజుల్లో తీరప్రాంత నగరాలు, చిన్నచిన్న దేశాలు, ద్వీపాలు సముద్రంలో కలిసిపోతాయని శాస్త్రవేత్తలు హెచ్చరించారని పేర్కొన్నాడు. ఇకనైనా ప్రతిమనిషి బాధ్యతతో మెలిగి అడవుల పరిరక్షణతో పాటు విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. ఇందులో భాగంగా రోటరిక్లబ్ చేస్తున్న సేవలు సమాజాభివృద్ధిలో ముఖ్యభూమిక పోషిస్తున్నాయని రోటరీ సేవలను కొనియాడారు. విద్యా, వైద్యం, పర్యావరణం, శాంతిస్థాపన, సమాజంలోని రుగ్మతలపై రోటరిక్లబ్ చేస్తున్న కార్యక్రమాలు సమాజానికి దిక్సూచి అని అన్నాడు ఇంకా ఈకార్యక్రమంలో డిస్ట్రిక్ట్ లీడర్ వద్దుల సురేందర్, సెక్రెటరీ జంగాల విజయ్ కుమార్, ట్రెజరర్ శంతన్ రామరాజు, డిస్ట్రిక్ట్ లీడర్లు బిక్కి వెంకటేశ్వర్లు, కొడారి నాగేందర్, జంగాల నర్సింహారావు, జంగాల మంగపతి రావు, అచ్చ శ్రీనివాస్, కట్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 5,విజన్ ఆంధ్ర : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలోని పెంచికల్‌పేట్ ఫారెస్ట్ డివిజనల్ కార్యాలయంలో జిల్లా ఎస్.పి. నితికా పంత్, జిల్లా అటవీ అధికారి బాలామణి, జిల్లా అదనపు ఎస్.పి. (అడ్మిన్) చిత్తరంజన్, కాగజ్ నగర్ అటవీ డివిజన్ అధికారి అప్పయ్య లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, ప్రత్యామ్నాయమైన పర్యావరణహిత వస్తువులను ఉపయోగించడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు. పర్యావరణానికి విఘాతం కలిగితే భావితరాల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, ఎలినో ప్రభావం వలన ఉష్ణోగ్రత పెరగడం, నీటి లభ్యత తగ్గడం మానవాళి మనుగడకు ప్రమాదం అని తెలిపారు. చెట్లు నాటడమే




కాకుండా నీటిని పొదుపుగా వినియోగించాలని, ప్రతి వర్షపు నీటి బొట్టును భూమిలో ఇంకేలా కృషి చేయాలని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు, సంచులు, బాటిళ్లు వినియోగించడం వలన పర్యావరణానికి ఉప్పు వాటిల్లుతుందని, ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని తెలిపారు. జిల్లా ఎస్.పి. మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ద్వారా భవిష్యత్తు తరాలకు సహజసిద్ధమైన, ఆహ్లాదకర వాతావరణాన్ని అందించిన వారమవుతామని తెలిపారు. నేడు మనం వినియోగిస్తున్న ప్లాస్టిక్ వస్తువుల వల్ల భవిష్యత్తు తరాల వారు సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది అని, ప్లాస్టిక్ వ్యర్థాలు నేల, నీరు, జీవావరణాన్ని కలుషితం చేస్తాయని, ప్రతి ఒక్కరూ చెట్లు నాటి సంరక్షించుకోవాలని తెలిపారు. ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. జిల్లా అటవీ అధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతుగా మొక్కలు



నాటాలని, తద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందిస్తామని అన్నారు. ఒక్కొక్కరు ఒక్కొక్క ముక్క నాటి సంరక్షించగలిగితే హరిత తెలంగాణ సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం ప్లాస్టిక్ రహిత నిత్యావసర వస్తువుల వినియోగంపై ఏర్పాటు చేసిన అవగాహన స్టాల్స్‌ను సందర్శించి, వాటి ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణహిత జీవన విధానాలను అలవర్చుకోవాలని సూచించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అటవీ రేంజ్ అధికారి అనిల్ కుమార్, అటవీ అధికారులు, స్థానిక సర్పంచ్ భక్తు రామచందర్, అటవీ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొండపాక మండలం మర్పడగ గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అర్బన్ ఆక్సిజన్ పార్క్ లో మొక్కలు నాటిన మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి జూన్ 5 : సిద్దిపేట జిల్లా కేంద్రంలో గల పోలీస్ కమిషనరేట్ గల ఆక్సిజన్ పార్కులో కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ రఘునందన్ రావు ,జిల్లా కలెక్టర్ హైమావతి, సిపి రష్మీ పెరుమాళ్,అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి కిరణ్ , డిఎఫ్ఓ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ధరిపల్లి చంద్రం, వివిధ విభాగాల అధికారులు.. పర్యావరణాన్ని పరిరక్షించడానికి చెట్టు విలువ తెలుసా అనే పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్. మొక్కలు నాటి సంరక్షించాలని ప్రతిజ్ఞ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం లాంచనంగాప్రారంభించాం..ప్రపంచమే కుగ్రామంగా మారుతున్న వేళ పర్యావరణాన్ని కాపాడడానికి మొక్కలు నాటాలి మొక్కలు నాటడం కార్యక్రమంగా కాదు మన జీవితంలో భాగస్వామ్యం కావాలిహుస్నాబాద్ నియోజకవర్గం లో 280 మహిళా సంఘాలకు 13 రకాల వస్తువులు గవర్నర్ గారి చేత మీద స్టీల్ బ్యాంక్ పంపిణీ చేశాం 500 హోటల్స్ కి గ్లాస్ లు పంపిణీ చేశాం.. ఈరోజు హుస్నాబాద్ మున్సిపాలిటీ ,సూర్యాపేట తో కలిసి అవార్డు తీసుకుంటుంది.. దిల్లీలో కాలుష్యంతో నివసించే పరిస్థితి లేదు.. తెలంగాణ లో అలాంటి పరిస్తితి రాకుండా ముఖ్యమంత్రి గారు ఈవి పాలసీ తీసుకొచ్చారు.. దేశంలో ఎక్కడ లేని విధంగా సున్నా టాక్స్ అమలు చేస్తున్నాం.. మొక్కలు నాటడానికి అన్ని గ్రామాల్లో ఐదుగురు సభ్యులతో కమిటీ వేశాం..



ప్రజలందరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలి..ఒకప్పుడు ఎక్కడ చూసినా పండ్ల మొక్కలు ఉండేవి..ఇప్పుడు లేకపోవడం వల్ల కోతులు గ్రామాల్లోకి వచ్చి ఇబ్బందులుపెడుతున్నాయి.రాష్ట్రంలో 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కడుతున్నాం..ప్రతి ఇంట్లో మొక్కలు నాటాలి.. ఎక్కడ ప్రభుత్వం స్థలం ఉంటే అక్కడ మొక్కలు నాటాలి..ప్రభుత్వం గీతా కార్మికుల కోసం కాటమయ్య రక్షణ కవచాలు ఇచ్చేటప్పుడు తాటి చెట్లు ఈత చెట్లు నాటిస్తోంది గత సంవత్సరం అటెండర్ నుండి మొదలు జిల్లా కలెక్టర్ వరకు ఒకే రోజు మొక్కలు నాటారు.. అలాంటి కార్యక్రమం తీసుకోవాలి.. పర్యావరణాన్ని కాపాడడానికి ప్రకృతి రక్షించడానికి మనం పని చేయాలిపర్యావరణాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ చేయడంకాదుపాటించాలి..గ్రామాల్లో మొక్కలు నాటడం లో ఒక కాంపిటీషన్ క్రియేట్ చేయండి.. మంచిగా మొక్కలు నాటిన గ్రామాల్లో సర్పంచ్ లను అభినందించండి.

# మట్టి పరీక్షలు, సమతుల్య ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన

**- మట్టి పరీక్షలతోనే భూసారం పరిరక్షణ.. రైతులకు కేవీకే సూచనలు**

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, జూన్ 06(విజన్ ఆంధ్ర) : భారత ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా చేపట్టిన "ఖేతి బచావో అభియాన్" 30 రోజుల కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), భద్రాద్రి కొత్తగూడెం ఆధ్వర్యంలో మట్టి పరీక్షలు, సమతుల్య ఎరువుల వినియోగం మరియు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణసాగర్ గ్రామపంచాయతీ పరిధికి చెందిన 50 మంది రైతులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. టి. భరత్ మాట్లాడుతూ, రైతులు పోటీతత్వంతో మోతాదుకు మించి రసాయన ఎరువులు



వినియోగించడం వల్ల భూసారం క్షీణిస్తోందని తెలిపారు. భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకుని, వాటి ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఇంటి పెరట్లో లేదా పొలాల గట్లపై పండ్ల మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని సంరక్షించవచ్చని పేర్కొన్నారు. ఉద్యాన శాస్త్రవేత్త శివ మాట్లాడుతూ, కృషి విజ్ఞాన కేంద్రం రైతుల కోసం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు, జీవనోపాధి కల్పనకు సంబంధించిన నైపుణ్య శిక్షణల గురించి వివరించారు. రైతులు ఇంటి వద్దనే ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కూరగాయల సాగు చేపట్టాలని సూచించారు. అలాగే పంట మార్పిడి విధానాన్ని అనుసరించి ఉద్యాన పంటలు, ముఖ్యంగా ఆయిల్ పామ్, మునగ సాగు, పందిరి విధానంలో తీగజాతి కూరగాయల సాగు చేపట్టడం ద్వారా స్థిరమైన ఆదాయంతో పాటు నేల ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని తెలిపారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కృషి విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే గిరిజన ఉప ప్రణాళిక పథకం కింద కృష్ణసాగర్ గ్రామపంచాయతీ పరిధికి చెందిన 50 మంది రైతులకు వరిలో సాగు కోసం నాణ్యమైన వంగడం కేఎన్ఎం-1638 విత్తనాలను పంపిణీ చేశారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**- అడవుల పరిరక్షణతోనే భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణం**
**- అదనపు జిల్లా న్యాయమూర్తి కె. స్వప్న రాణి**

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూన్-05(విజన్ ఆంధ్ర) : పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు మొక్కల పెంపకం, అడవుల సంరక్షణ అత్యంత అవసరమని అదనపు జిల్లా న్యాయమూర్తి కె. స్వప్న రాణి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పెద్దపల్లి జిల్లా రంగంపల్లి జిల్లా కోర్టు సముదాయంలో అదనపు జిల్లా న్యాయమూర్తి కె. స్వప్న రాణి, జూనియర్ సివిల్ జడ్జి ఎన్. మంజుల ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడవుల ప్రాధాన్యం, పర్యావరణ పరిరక్షణ అవసరంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా న్యాయమూర్తి కే.స్వప్న రాణి



మాట్లాడుతూ, వాతావరణ మార్పులు ప్రపంచవ్యాప్తంగా సవాళ్లుగా మారుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. అనంతరం భూపాలపల్లి జిల్లా అటవీ అధికారి, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జ్ అటవీ అధికారి ఎం. నవీన్ రెడ్డి, ఐఎఫ్ఎస్ ఆధ్వర్యంలో ఐడీఓసీ కార్యాలయ ప్రాంగణంలో మొక్కల నాటారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రామగుండం ప్రాంతీయ కార్యాలయ సహాయ శాస్త్రవేత్త ఈ. కనక జ్యోతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఐడీఓసీ కార్యాలయం నుంచి ఖిలావనపర్తి గ్రామం వరకు అటవీ శాఖ సిబ్బందితో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్మారం మండలంలోని ఖిలావనపర్తి రాంపల్లి రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్‌లోని కాంపార్ట్‌మెంట్ నెం.479/1 వద్ద రెండు హెక్టార్ల అధిక సాంద్రత మిశ్రమ మొక్కల పెంపకం ప్రాంతంలో ప్రత్యేక మొక్కల నాటకం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కోర్టు సముదాయంలో 30 మొక్కలు, ఐడీఓసీ కార్యాలయ ప్రాంగణంలో 10 మొక్కలు, ఖిలావనపర్తి ప్రాంతంలో 20 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో అటవీ శాఖ అధికారులు, టి. సతీష్ కుమార్, వినయ్ నాయక్, దేవదాస్, రమేష్, కొమురయ్య, రహమతుల్లా, ఖిలావనపర్తి సర్పంచ్ మోతే కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ మున్నూరు కాపు సంఘం పటేల్స్ రాష్ట్ర కమిటీ అధ్యక్ష ఎన్నికలు!

**- కొండ దేవయ్య పటేల్**

సిద్దిపేట జిల్లా ప్రతినిధి జూన్ 5 : తెలంగాణ రాష్ట్రంలో మున్నూరు కాపు సమాజ ఐక్యత, సామాజిక సాధికారత, రాజకీయ ప్రాధాన్యతను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో తెలంగాణ మున్నూరు కాపు సంఘం పటేల్స్ రాష్ట్ర కమిటీ అధ్యక్ష ఎన్నికలునిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.రాష్ట్రంలోని జిల్లా, నియోజకవర్గ, మండల, పట్టణ, గ్రామ స్థాయి సంఘాల ఆధ్వర్యంలో సుమారు ఒక లక్ష మంది మున్నూరు కాపు కుల బాంధవ్యులు మరియు పటేల్స్ ఈ ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలనిపిలుపునిస్తున్నాం. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కునువినియోగించుకొని సంఘం భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములు కావాలి. ప్రజాస్వామ్య పద్ధతిలో లక్ష మంది సభ్యుల ఓట్లతో ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షుడు మరియు కమిటీకి సమాజం తరఫున బలమైన నైతిక, సామాజిక మద్దతు లభిస్తుంది. దీనివల్ల గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు మున్నూరు కాపు సమాజంలో ఐక్యత, సంఘటిత శక్తి మరియు నాయకత్వ వికాసం పెరుగుతుంది.ఈ ఎన్నికల ద్వారా ఏర్పడే నాయకత్వం మున్నూరు కాపుల హక్కులు, సంక్షేమం, విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై ప్రభుత్వాలతో సమర్థవంతంగా చర్చించి, సమాజ అభివృద్ధి కోసం కృషి చేయగలదు. అలాగే పటేల్ గెజిట్, సామాజిక న్యాయం, పెండింగ్‌లో ఉన్న



సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడానికి బలమైన వేదికగా నిలుస్తుంది.మున్నూరు కాపు సమాజానికి వివిధ రాజకీయ పార్టీలు, ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉంది. సమాజం సంఘటితమైతేనే ప్రభుత్వాలు మన సమస్యలను గుర్తించి పరిష్కరించే అవకాశం ఉంటుంది.మన సంఖ్యాబలాన్ని, ఐక్యతను, సామాజిక శక్తిని నిరూపించాల్సిన సమయం వచ్చింది.అందువల్ల రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, మండల, పట్టణ, గ్రామ స్థాయి సంఘాల ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణ కమిటీలను వెంటనే ఏర్పాటు చేసి, సభ్యుల నమోదు కార్యక్రమాన్ని చేపట్టి, ప్రతి కుటుంబాన్ని ఈ ఎన్నికల్లో భాగస్వామ్యం చేయాలని కోరుతున్నాం.ఐక్యతే బలం సంఘటిత మున్నూరు కాపు సమాజమే మన భవిష్యత్తు."తెలంగాణ మున్నూరు కాపు సంఘం పటేల్స్రాష్ట్ర కమిటీ ఎన్నికల నిర్వహణ కోసం పిలుపు.

# పూర్తి స్థాయిలో వరి ధాన్యాన్ని గోదాములో నిల్వ చేస్తాం...

**- రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు**
**- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు**

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూన్-05(విజన్ ఆంధ్ర) : పెద్దపల్లి నియోజకవర్గంలోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యంలో ఇప్పటికే 98 శాతం మేర లిఫ్టింగ్ పూర్తిచేశామని, మిగిలిన ధాన్యాన్ని కూడా రెండు నుంచి మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో తరలించేలా చర్యలు చేపడుతున్నట్లు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. పెద్దపల్లి, కాల్వ శ్రీరాంపూర్ మండలాల్లో లారీల జాప్యం, హమాలీల కొరత కారణంగా కొన్ని కొనుగోలు కేంద్రాల్లో కొంత ధాన్యం పెండింగ్‌లో ఉందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు పెద్దపల్లి, సుల్తానాబాద్ లారీ అసోసియేషన్ అధ్యక్షులు భారీ, తిరుపతి, శ్రీనివాస్, సతీష్‌లతో చర్చించినట్లు తెలిపారు. అలాగే పెద్దపల్లి, సుల్తానాబాద్ సీఐలు ప్రవీణ్, రంజిత్, ఎస్ఐలు, పోలీసు



అధికారులు మరియు సంబంధిత శాఖల అధికారుల సహకారంతో ధాన్యం తరలింపును వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. హమాలీల కొరత నివారణకు పెద్ద కల్వల సంతు, నరేష్‌లతో పాటు మరికొందరు హమాలీలతో మాట్లాడి అదనపు సిబ్బందిని అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. అవసరమైతే రాత్రి వేళల్లో కూడా పని నిర్వహించి ధాన్యం లిఫ్టింగ్‌ను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పెద్దపల్లి, కాల్వ శ్రీరాంపూర్, ఓదెల, జూలపల్లి మండలాల్లో అక్కడక్కడ మిగిలిన ధాన్యాన్ని రెండు రోజుల్లో పూర్తిగా తరలిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కేరళకు రుతుపవనాలు చేరిన నేపథ్యంలో వర్షాల ప్రభావం పడకముందే ధాన్యాన్ని సురక్షితంగా గోదాములకు తరలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో మక్కల కొనుగోలు ప్రక్రియ కూడా పూర్తిస్థాయిలో కొనసాగుతోందని, కొనుగోలు చేసిన మక్కలను అవసరమైన గమ్యస్థానాలకు తరలిస్తున్నామని చెప్పారు. రైతులకు చెల్లింపుల విషయమై మాట్లాడుతూ, ఇప్పటివరకు సుమారు రూ.4 కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యాయని, మిగిలిన బకాయిలు కూడా త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ అవుతాయని ఎమ్మెల్యే విజయరమణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, పలు గ్రామాల సర్పంచ్ లు మరియు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలి లకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది

## శ్రీనివాస్ తెలంగాణ పద్మశాలి ఫెడరేషన్ అధ్యక్షులు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి జూన్ 5 : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాలను బలోపేతం చేయడానికి రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధంగా ఉన్నదనీ గూడూరు



శ్రీనివాస్ అన్నారు.రాష్ట్రంలో కుల సంఘాలకు ఫెడరేషన్ల ఏర్పాటు చేసిన ఘనత రేవంత్ రెడ్డి కే దక్కిందన్నరు. సిద్దిపేట పట్టణంలోని కాళ్ళకుంట్ల కాలనీ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ సమావేశానికి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి గూడూరు శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులవృత్తుల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలతో అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పద్మశాలి ముఖ్యంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా కుల సంఘాలతో చర్చించి ముఖ్యమంత్రి గారికి నివేదిక సమర్పిస్తానని గూడూరు శ్రీనివాస్ తెలిపారు ప్రభుత్వం ద్వారా అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందజేయడానికి తన శాయశక్తుల కృషి చేస్తానని ఆయనతెలిపారు.ప్రభుత్వం ద్వారా అర్హులకు సంక్రమించే అనేక సంక్షేమ పథకాలు రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు డాక్టర్ కే సతీష్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కాముని రాజేశం ఇందిరానగర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు డాక్టర్ విట్టల్ పాలకొండ కాలనీ నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు స్వర్గం రమేష్ కార్యవర్గ సభ్యులు పద్మశాలి కుల బంధువులు హాజరైనారు.

# బోనస్ డబ్బులు వేయ కుండా ప్రభుత్వం మోసం

**- కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్**

నారాయణపేట, జూన్ 5 (విజన్ ఆంధ్ర) : రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లు కు క్వింటాలుకు 500 బోనస్ వేస్తామని ప్రకటించి వడ్లు కొనుగోలు కేంద్రాలలో రైతులు అమ్మి నెల రోజులు అయిన కూడా బోనస్ డబ్బులు వేయకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.వెంటనే రైతుల ఖాతాలో బోనస్ డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. కొన్న వడ్ల డబ్బులు మాత్రమే రైతుల ఖాతాలలో జమ చేశారనీ గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా యాసంగికి బోనస్ వేసేటట్లు లేరు అని అన్నారు. పెట్టుబడులు ఎక్కువ అయ్యాయి, పంటలు తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గింది వడ్లు అమ్మితే పెట్టుబడి కూడా రాలేదు అని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఒకవేళ ప్రైవేట్ వ్యక్తుల దగ్గర వడ్డీకి తెచ్చి పంటలు పండించిన వారి పరిస్థితి మరి గోరంగా ఉందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయ్యింది ఇప్పటి వరకు రైతు భరోసా వేయ



లేదని దాంతో రైతులు పంటపెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయి స్తున్నారని అప్పుకు వెళ్తే మునుపు తీసుకున్న అప్పు కడితే కొత్త అప్పు పుట్టే పరిస్థితి లేదని అన్నారు. రైతులను ఆదుకోవడం కోసం బోనస్ డబ్బులు వెంటనే రైతుల ఖాతాలలో జమ చేయాలని,యాసంగి రైతు భరోసా డబ్బులు వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు.



## అగ్నివీర్ కు ఎంపికైన శ్రీ సాయి స్కూల్ పూర్వ విద్యార్థులకు సన్మానం

నారాయణపేట, జూన్ 5 (విజన్ ఆంధ్ర) : నారాయణ పేట జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి స్కూల్ పూర్వ విద్యార్థులు వి. రవి నాయక్, ఈ. నితిన్ గౌడ్ లు అగ్నివీర్ లో ఆర్మీకి ఎంపిక అయినందుకు శ్రీ సాయి స్కూల్ ప్రిన్సిపాల్ వసంత్ రావు, ఉపాధ్యాయులు హెచ్. నర్సింహా శాలువాతో సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా పాఠశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు దేశ, విదేశాలలో డాక్టర్లు, ఇంజనీర్లు, అనేక ప్రభుత్వ ఉదోగాలతో పాటు దేశ సేవ చేయడం కోసం అగ్నివీర్ ప్రారంభం అయినప్పటినుండి ప్రతి అగ్నివీర్ లో ఆర్మీ, నేవీ ఉద్యోగాలు సాధించడం గర్వకారణం అని తెలిపారు. భవిష్యత్ లో దేశ సేవ చేయుటకు ఉన్నతమైన ఉద్యోగాలు పొందుటకు కృషి చేయాలని సూచించారు.

# గాలి ఆగినా గానం ఆగలేదు

**- ఒక్క ఊపిరి రాగం లక్షల హృదయాల ప్రశంసలు**

**- తెలంగాణ ఆత్మను ఒక్క ఊపిరితో పలికించిన గాయని వరం**



విజన్ ఆంధ్ర(5)హైదరాబాద్ : జానపద కళలు జాతి ఆత్మ. తెలంగాణ జనపదం కేవలం కళ మాత్రమే కాదు. అది తెలంగాణ మట్టి జ్ఞాపకం, జాతి గౌరవం. డప్పు చప్పుడు నుంచి గిరిజన గీతాల వరకు ప్రతి స్వరం తెలంగాణ ఆత్మను పలుకుతోంది, ప్రజల నోట పుట్టి, ప్రజల గుండెల్లో బతికే జీవ గీతమే తెలంగాణ జానపదం, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా విడుదలైన తెలంగాణ గీతం విశేష ఆదరణ పొందుతోంది, తెలంగాణ జానపద సంగీతానికి తన గాత్రంతో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన యువ గాయని వరం, మరోసారి సంగీతా భిమానుల ప్రశంసలు అందుకుంటోంది, రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్క రించుకుని ఆమె ఆలపించిన ఈ గీతం సామాజిక మాధ్యమాల్లో వేగంగా వైరల్ అవుతోంది, విడుదలైన కొద్ది సమయంలోనే ఈ గీతం లక్షలాది మంది ప్రేక్షకులను చేరుకుని తెలంగాణ ప్రజల హృదయాలను హత్తుకుంది, మహబూబాబాద్ జిల్లాకు చెందిన వరం చిన్ననాటి నుంచే సంగీతాన్ని తన జీవితంలో భాగంగా మలుచుకుంది. పాఠశాల వయసులో ప్రారంభమైన ఆమె గాన ప్రస్థానం నేడు తెలంగాణ జానపద సంగీత రంగంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది, పల్లె జీవన విధానం, తెలంగాణ మట్టి వాసన, ప్రజల భావో ద్వేగాలను తన గాత్రంలో మేళవిస్తూ ఆమె ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంది, జానపద గీతాలతో పాటు పలు తెలుగు చిత్రాల్లోనూ గాత్రదానం చేసిన వరం, సినీ సంగీత రంగంలోనూ తన ప్రతిభను చాటుకుంది. అయినప్పటికీ ఆమె హృదయానికి అత్యంత దగ్గరగా నిలిచింది మాత్రం తెలంగాణ జానపద సంగీతమే, ప్రతి పాటలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల భావోద్వేగాలను ప్రతి బింబిస్తూ ఆమె తనదైన శైలిని కనబరుస్తూ వస్తోంది, రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్క రించుకుని విడుదలైన తాజా తెలంగాణ గీతం యూట్యూబ్‌తో పాటు వివిధ సామాజిక మాధ్యమ వేదికల్లో విశేష ఆదరణ పొందుతోంది, పాటలోని పదాల స్పష్టత, భావ వ్యక్తీకరణ, గాన నైపుణ్యం సంగీతా భిమానులను ఆకట్టు కుంటున్నాయి, ముఖ్యంగా శ్వాస తడ బడకుండా, విరామం లేకుండా సాగిన గానం శ్రోతలను ఆశ్చర్యానికి గురిచేసింది, పాట ముగిసే వరకు అదే ఉత్సాహం, అదే భావ ప్రకటనతో కొనసాగిన ఆమె గాత్రం ప్రస్తుతం సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురిపిస్తోంది, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి, రాష్ట్ర ఆవిర్భావ గాథ, ఆత్మ గౌరవాన్ని ప్రతిబింబించే ఈ గీతం యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపుతోందని అభిమానులు పేర్కొంటున్నారు, గ్రామీణ నేపథ్యం నుంచి ఎదిగిన ఒక యువ గాయని తన ప్రతిభతో ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ స్వరాన్ని వినిపించడం గర్వ కారణమని పలువురు అభిప్రాయ పడుతున్నారు, తెలంగాణ జానపద సంగీతాన్ని డిజిటల్ ప్రపంచానికి మరింత చేరువ చేస్తూ, కొత్త తరానికి పరిచయం చేస్తున్న వరం గాత్రం ఇప్పుడు కేవలం ఒక స్వరం మాత్రమే కాదు, తెలంగాణ ఆత్మను ప్రపంచానికి వినిపిస్తున్న గాన ప్రతిధ్వనిగా మారింది.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి



నిర్మల్ జిల్లా,జూన్ 05,(విజన్ ఆంధ్ర); దశుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోర్టు ఆవరణలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, మొక్కలు నాటి, పచ్చదనం పెంపొందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని తెలిపారు. మొక్కలు నాటడం వల్ల అందరం పర్యావరణ పరిరక్షణలో కృషి చేసినవారమౌతామని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాధిక, కోర్టు బార్ అసోసియేషన్ ప్రతినిధులు శుభకరన్, అధికారులు చంద్రమోహన్, రాజారాం, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ రాహుల్ శర్మ ను కలిసిన రవాణా శాఖ అధికారులు



భూపాలపల్లి జిల్లా 05 జూన్ (విజన్ ఆంధ్ర): జిల్లా రవాణా శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన వెంకన్న జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను ఐడిఓసి కార్యాలయంలో కలిసి మొక్కను అందజేశారు. భూపాలపల్లి జిల్లా రవాణా శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ సంధాని జగిత్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జగిత్యాల జిల్లాలో సేవలందిస్తున్న వెంకన్నను భూపాలపల్లి జిల్లాకు నియమించారు. ములుగు జిల్లాన నుండి బదిలీపై వచ్చిన ఎంవిఐ శ్రీనివాస్ కూడా జిల్లా కలెక్టర్ కు మొక్కను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంవిఐ సుందర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

## వాంబే హౌసింగ్ పథకం కింద రూ.60 వేలు చెల్లించిన పేదలకు న్యాయం చేయాలి

**- సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఐలాపురం రాజశేఖర్,**



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జూన్ 5, (విజన్ ఆంధ్ర ప్రతినిధి): వాంబే హౌసింగ్ పథకం కింద డీడీల రూపంలో రూ.60 వేల వరకు చెల్లించిన పేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని సీపీఎం నాయకులు హౌసింగ్ పీడీ పి వి ఆర్ మూర్తికి వినతిపత్రం అందజేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ మండలానికి చెందిన పలువురు పేదలు 2003లో అప్పటి ప్రభుత్వం వాంబే హౌసింగ్ పథకం కింద ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పడంతో లబ్ధిదారుల వాటాగా రూ.60 వేల వరకు డీడీల రూపంలో చెల్లించారని తెలిపారు. అయితే ఇంతకాలం గడిచినా వారికి ఇళ్లు ఇవ్వకపోవడంతో తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఐలాపురం రాజశేఖర్ విమర్శించారు. ఈ వ్యవహారంలో అప్పటి అధికారుల నిర్లక్ష్యం, వైఫల్యం కారణంగా పేదలు నష్టపోయారని అన్నారు. ప్రస్తుతం ప్రజాపాలన ప్రభుత్వం స్పందించి అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించి న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం స్వీకరించిన హౌసింగ్ పీడీ మూర్తి స్పందిస్తూ, అంశంపై విచారణ జరిపించి అర్హులైన పేదలకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యురాలు ఎ. విజయ, బాధిత కుటుంబాలు పాల్గొన్నారు.

# నిఘా 'టాస్క్' విఫలం..!!

- ఇం'ధన' సామ్రాజ్యంలో ఎన్నెన్నో సిత్రాలు
- ట్యాంకర్లు, స్థావరాల వివరాలు ఇచ్చినా చర్యలు శూన్యం
- పెట్రోల్ మాఫియా వెనుక 'పెద్ద తలల' హస్తం
- అక్రమార్కులు, అధికారుల మధ్య క్విడ్ ప్రో కో..!?



*అది జనవరి 12, 2018. మేడిపల్లి చౌరస్తా చెంగిచెర్ల వెళ్లేదారిలో రెండు ట్యాంకర్ల నుంచి పెట్రోల్ తీస్తుండగా మంటలు చెలరేగాయి. అక్కడికక్కడే ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన అప్పట్లో సంచలనం సృష్టించగా.. తాజాగా మళ్లీ అలాంటి పరిస్థితులే పునరావృతమయ్యే అవకాశాలున్నాయి. మల్లాపూర్ గోకుల్‌నగర్, బోడుప్పల్ మై హోం పక్కన యధావిధిగా దందా కొనసాగుతోంది. 2018 నాటి ఘటన మళ్లీ సంభవిస్తే బాధ్యులెవరూ..?*



గతంలో పెట్రోల్ ట్యాంకర్ పేలిన ఫైల్ ఫోటో

**మేడ్చల్ జిల్లా,జూన్ 05(విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి) :** మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి, నాచారం, చర్లపల్లి, మల్లాపూర్, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో అక్రమ ఇంధన దందా కొనసాగుతోందనే ఆరోపణలు స్థానికంగా గుప్పుమంటున్నాయి. ట్యాంకర్ల నుంచి ఇంధనం మళ్లింపు, రహస్య నిల్వ కేంద్రాలు, అనధికార విక్రయాలపై ఎప్పటికప్పుడు చర్చ జరుగుతున్నప్పటికీ, ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ ఇంధన నిల్వలు, ట్యాంకర్ల రాకపోకలు, రహస్య కేంద్రాల కార్యకలాపాలపై స్థానికులు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయనే ప్రచారం ఉన్న ప్రాంతాల్లోనే సంబంధిత నిఘా వ్యవస్థలు, పర్యవేక్షణ యంత్రాంగం ఎంత మేరకు పనిచేస్తున్నాయనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### నెమ్మదించిన నిఘా విభాగం...

అక్రమ ఇంధన కేంద్రాల వద్దకు వివిధ వాహనాలు, రాకపోకలు సాగుతున్నట్లు స్థానికులు గమనిస్తుండగా.. అధికార యంత్రాంగంలో మాత్రం చలనం లేదనే విమర్శలు వస్తున్నాయి. పలుమార్లు దాడులు, కేసులు నమోదైనట్టే అనిపిస్తున్నప్పటికీ అక్రమంగా కొనసాగుతున్న ఇంధన దందాకు అడ్డుకట్ట పడటం లేదు. దీంతో ఎస్ఓటీ, టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసుల నిఘా వ్యవస్థల పనితీరుపై కూడా ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.
పదేపదే ఆరోపణలు వస్తున్న ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు, విజిలెన్స్ విభాగాలు, సంబంధిత శాఖలు సంయుక్తంగా స్వతంత్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల్లో నెలకొన్న సందేహాలకు తెరపడాలంటే సంబంధిత శాఖలు పారదర్శకంగా విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



### సమాచారం ఉన్నా స్పందించరేం..?



ఇంధన మాఫియా గురించి కిందిస్థాయి వరకు సమాచారం ఉన్నప్పటికీ చర్యలు చేపట్టడం లేదు. కొందరు అధికారులకు వివరాలు అందించినప్పటికీ తాత్కాలిక చర్యలతో మమ అనిపిస్తున్నట్టు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో పోలీసులు, ప్రత్యేక నిఘా విభాగాలు, టాస్క్‌ఫోర్స్ బృందాల పనితీరుపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది పెద్దల అండదండలు ఉన్న కారణంగానే ఎవరూ దానిపై పట్టించుకోవడం లేదని గుసగుసలూ వినిపిస్తున్నాయి. అందుకే రహస్య దందా వివరాలు బయటకు పొక్కడం లేదని స్పష్టమవుతోంది. అయితే గత కొన్నేళ్లుగా అనేక ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో అందులో ఎంతవరకు వాస్తవమన్నది సమగ్ర విచారణ ద్వారానే తేలాల్సి ఉంది.

# వర్క్‌లోడ్ వద్దు.. పీస్ ఆఫ్ మైండ్ ముద్దు!!



**- ఒత్తిడిని 'డిలీట్' చేసి.. విజయాన్ని 'డౌన్‌లోడ్' చేసుకుందాం**
**- భారం దించుదాం.. స్మార్ట్‌గా గెలుద్దాం**
**- గుండె ధైర్యమే.. అసలైన పవర్ బ్యాంక్**
**- నవ్వుతూ సాగుదాం.. సక్సెస్ కొడదాం**
**- థింక్ అండ్ ఫాలో "విజన్ ఆంధ్ర" మంత్రం**

**హైదరాబాద్, జూన్ 5 :**
రాత్రి 11 గంటలు. లాప్‌టాప్ స్క్రీన్ వెలుతురు ముఖంపై పడుతుంటే, చేతిలో చల్లారిపోయిన కాఫీ కప్పుతో, కళ్ల కింద నల్లటి వలయాలతో అద్దంలో మిమ్మల్ని మీరు ఎప్పుడైనా చూసుకున్నారా? ఆ క్షణంలో... 'సక్సెస్ అంటే ఇదేనా? ఈ పరుగు పందెం ఎక్కడికి తీసుకెళ్తోంది?' అనే ప్రశ్న గుండెల్లో మెదిలిందా? ఈ రోజుల్లో కెరీర్, టార్గెట్లు, డెడ్‌లైన్లు... ఇవన్నీ మనల్ని ఒక యంత్రంలా మార్చేస్తున్నాయి. గెలుపు గుర్రం ఎక్కాలనే ఆరాటంలో, ప్రాణం లాంటి ప్రశాంతతను పణంగా పెట్టేస్తున్నాం. కానీ ఒక్కటి గుర్తుంచుకోండి...

### విజయం అనేది జీవితంలో ఒక భాగం మాత్రమే, జీవితమే విజయం కాదు.

ఆ బరువును కాస్త దించేయండి. మనం రోజూ మోస్తున్న పని భారం మన మెదడుకే కాదు, మన మనసుకూ గాయాలు చేస్తోంది. ఆఫీస్ ఫైళ్లను సర్దినట్టు, మన ఆలోచనలను కూడా కాస్త రీ-అరేంజ్ చేసుకోవాల్సిన టైమ్ వచ్చేసింది.

### నో చెప్పడం నేర్చుకుందాం

అన్ని పనులూ మనమే చేసేయాలి, అందరినీ మనమే ఇంప్రెస్ చేయాలనే భారాన్ని కాస్త తగ్గించుకుందాం.

### స్మార్ట్ వర్క్.. నాట్ హార్ట్ బ్రేకింగ్ వర్క్

గంటల తరబడి డెస్క్‌కు అతుక్కుపోవడం కాదు, ప్లానింగ్‌తో పనిని ముగించి మనకంటూ కాస్త 'మీ టైమ్' కేటాయించుకుందాం.




### మానసిక స్థైర్యం మన లోపలి అసలైన 'పవర్ బ్యాంక్'

ఒత్తిడి అనేది బ్యాటరీని డ్రైన్ చేసే యాప్ లాంటిది. దాన్ని అన్‌ఇన్‌స్టాల్ చేయాలంటే మనకు కావాల్సింది మానసిక స్థైర్యం. కంటి నిండా నిద్ర, గుండె నిండా ధైర్యం, ముఖంపై చిన్న నవ్వు... ఇవే మనం ఒత్తిడికి ఇచ్చే పర్ఫెక్ట్ రిటర్న్ గిఫ్ట్. మనం మానసికంగా బలంగా ఉన్నప్పుడు, ఎలాంటి కష్టమైనా 'జస్ట్ ఏ ఫేజ్' (ఇదో చిన్న దశ మాత్రమే) అనిపిస్తుంది. అమ్మ చేతి ముద్దలో ఉండే హాయిని, స్నేహితులతో గడిపే పది నిమిషాల నవ్వులని, కిటికీ గుండా వచ్చే చల్లటి గాలిని ఆస్వాదించడం మొదలుపెడితే... ఒత్తిడి తనంతట తానే పక్కకు తప్పుకుంటుంది.

### కొత్త మంత్రం జపిద్దామా!

ఒత్తిడిని పక్కన పెడదాం.. విజయాన్ని అందుకుందాం. ఈ మోడర్న్ లైఫ్‌లో మనకు కావాల్సింది బర్న్-అవుట్ (అలిసిపోవడం) అవ్వడం కాదు, బ్రైట్‌గా వెలగడం. పని భారాన్ని పక్కన పెట్టి, మనసును తేలిక చేసుకున్నప్పుడే అసలైన ఐడియాలు పుడతాయి. ఆ ఐడియాలే మనల్ని సక్సెస్ వైపు నడిపిస్తాయి. కాబట్టి, ఈ రోజు నుంచే...మొబైల్స్,
లాప్‌టాప్‌తో పాటు ఒత్తిడిని కూడా కాసేపు 'షట్‌డౌన్' చేద్దాం. గుండె నిండా ధైర్యాన్ని నింపుకుందాం. ఆనందంగా, ఆరోగ్యంగా ఉంటూనే విజయాన్ని ముద్దాడదాం. ఎందుకంటే... మీరు గెలిచినప్పుడు చప్పట్లు కొట్టే ప్రపంచానికి, ఆ గెలుపు వెనుక మీ నవ్వు కూడా అంతే ముఖ్యం.

**- గడ్డం రాజు**
స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)


## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో,జూన్ 5,(విజన్ ఆంధ్ర) : డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మిగిలి ఉన్న అన్ని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, లబ్ధిదారులకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన నల్గొండలోని గొల్లగూడ డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయాన్ని పరిశీలించారు. గొల్లగూడ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అద్దాలు,ఎలక్ట్రికల్ వైరింగ్,విండోలు,వాటర్ ట్యాంకులు,నీటి ట్యాపులు,లైటింగ్,తలుపులు, బాత్రూములు,టాయిలెట్లు,కిచెన్ గదులు తదితర పనులను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే గృహ సముదాయం మొత్తాన్ని శుభ్రపరచి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని, జిమ్,పార్కులు,బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రం,జిరాక్స్ సెంటర్,మీ సేవా కేంద్రం, మెడికల్ షాప్,కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీ రాజ్ కుమార్‌ను ఆదేశించారు. అదేవిధంగా లే అవుట్ బోర్డులు,దిశా నిర్దేశిక సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. గృహ సముదాయం పరిసర ప్రాంతాల్లో సీసీ రోడ్లు,అంతర్గత రహదారులు,వైకుంఠధామం,క్రీడా మైదానం వంటి మౌలిక వసతుల అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం మాత్రమే కాకుండా నివాసితులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఒకేచోట అందుబాటులో ఉండేలా సమగ్ర ప్రణాళికతో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన వసతులు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ పరిశీలనలో జిల్లా గృహ నిర్మాణ పీడీ రాజ్ కుమార్,పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్,కార్పొరేషన్ కమిషనర్ శరత్చంద్ర,కాంట్రాక్టర్ సైదిరెడ్డి,సంబంధిత అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.



## మాన్‌సూన్ రెగట్టాలో అగ్రస్థానానికి రవికుమార్



హైదరాబాద్, జూన్ 05 (విజన్ ఆంధ్ర) : హుస్సేన్‌సాగర్‌లో జరుగుతున్న 27వ మాన్‌సూన్ రెగట్టా నేషనల్ ర్యాంకింగ్ సెయిలింగ్ చాంపియన్‌షిప్ నాలుగో రోజు పోటీల్లో తెలంగాణకు చెందిన డిఫెండింగ్ నేషనల్ చాంపియన్ రవికుమార్ అద్భుత ప్రదర్శనతో లీడర్‌బోర్డ్‌లో అగ్రస్థానానికి చేరుకున్నాడు. చివరి రేసులో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన అతడు మొత్తం 12 పాయింట్లతో ముందంజలో నిలిచాడు. మరో తెలంగాణ సెయిలర్ వుట్ల నరసింహ 14 పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా, ఎస్‌కే రమీజా భాను 21 పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతోంది. ఈ నెలాఖరులో మొరాకోలో జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్‌కు భారత జట్టు తరఫున ఎంపికైన 14 ఏళ్ల రవికుమార్ పేద కుటుంబం నుంచి ఎదిగి జాతీయ చాంపియన్‌గా నిలవడం విశేషం. శనివారం జరిగే చివరి రెండు రేసులతో మాన్‌సూన్ రెగట్టా విజేత నిర్ణయంకానుంది. ఇతర విభాగాల్లో ప్రీత్ సివాల్, కాత్యాయని కౌశిక్, బద్రీనాథ్ నిరుదు-రిశ్విక జోడీ, శరణ్య జాదవ్-శివం వాల్మీకి జోడీలు తమ తమ విభాగాల్లో ఆధిక్యంలో కొనసాగుతున్నాయి.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.